thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 307 | కరీంనగర్ మంగళవారం, 13 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00


## రైతులకు భారీ షాక్.. పెరగనున్న యూరియా ధరలు!

న్యూఢిల్లీ : ఇటీవల యూరియా దొరకక ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు మరో షాక్ తగలనుంది. రబీ సీజన్ ప్రారంభానికి ముందే దేశంలో ఎరువుల ధరలు పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. యూరియాతో పాటు కొన్ని రకాల ఎరువుల ఎగుమతులను ఈ నెల 15 నుంచే చైనా నిలిపివేసింది. ఈ నిర్ణయం భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంపై దుష్ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నిలిపివేత 5 నుంచి 6 నెలల పాటు కొనసాగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మనం ఉపయోగించే టెక్నికల్ మోనోఅమ్మోనియం ఫాస్ఫేట్ (టీఎమ్ఏపీ), అడ్బ్లూతో పాటు యూరియా, డీఏపీ వంటి ఎరువులను దాదాపు 95 శాతం చైనా నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ఇప్పుడు చైనా ఆంక్షలతో వీటి ధరలు మరో 10-15 శాతం పెరిగే అవకాశం ఉంది.

# జల వివాదం మరింత జటిలమేనా?

## రెండు రాష్ట్రాల మధ్య సస్పెన్స్!

### పోలవరం-నల్లమలసాగర్.. రిట్ పిటిషన్‌ను వెనక్కి తీసుకున్న తెలంగాణ




రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలు మరింత జటిలంగా మారుతున్నాయా? ఒకవైపు చర్చలకు సిద్ధం అంటూనే రెండు తెలుగు రాష్ట్రాలు.. పోరుకు రెడీ అవుతున్నాయా? అంటే.. తెరవెనుక-బయట జరుగుతున్న పరిణామాలను గమనిస్తే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టు ద్వారా.. గోదావరి నుంచి సముద్రంలో కలిసే వెయ్యి టీఎంసీలకు పైగా నీటిలో కనీసం 200 టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నది ఏపీ ప్రభుత్వ ప్రతిపాదన. అయితే.. అసలు కేటాయించని నీటిని ఎందుకు వినియోగిస్తారన్నది తెలంగాణ అభ్యంతరం. ఇదే.. ఇరు రాష్ట్రాల మధ్య గత మూడు మాసాలుగా వివాదాన్ని రాజేసింది. అటు కోర్టులు, ఇటు రాజకీయాల్లోనూ ఈ వ్యవహారం తీవ్రస్థాయిలో చర్చకు వచ్చింది. అయితే.. అటు తెలంగాణ ముఖ్యమంత్రి, ఇటు ఏపీ సీఎం ఇద్దరూ కూడా గొడవలు వద్దు.. కూర్చుని మాట్లాడుకుని పరిస్థితిని సర్దుబాటు చేసుకుని ముందుకు సాగాలని భావిస్తున్నట్టు ప్రకటిస్తున్నారు. ఇరువురు కూడా సానుకూలంగానే ఉన్నట్టు సంకేతాలు ఇస్తున్నారు. కానీ.. ఒకవైపు వారి వ్యాఖ్యలకు.. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలకు మధ్య ఎక్కడా పొంతన చిక్కడం లేదు. పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. ఈ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో నేడు విచారణ జరిగింది. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. విచారణ అనంతరం తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆర్టికల్ 131, సివిల్ సూట్ రూపంలో మళ్లీ రావాలని సీజేఐ సూచించారని తెలిపారు. ఆయన సూచన మేరకు పిటిషన్‌ను ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. "ఏపీ ప్రభుత్వం నిర్మాణం చేయాలనుకుంటున్న ప్రాజెక్టుపై మా అభ్యంతరాలతో రిట్ పిటిషన్ వేశాం. గత సోమవారం కూడా విచారణ జరిగింది. ఇవాళ అదనంగా మరికొన్ని వాదనలను తెలంగాణ ప్రభుత్వం తరఫున వినిపించాం. కేటాయింపుల కంటే ఎక్కువ నీళ్లు వాడొద్దనేది ముఖ్యమైన అంశం. ఏపీ ప్రభుత్వం అనేకసార్లు ఉల్లంఘనలకు పాల్పడింది. వాటిని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చాం. స్టాప్ వర్క్ ఆర్డర్‌ను అమలు చేయడం లేదని తెలిపాం. ఏపీకి కేటాయించింది 484.5 టీఎంసీలు.. కానీ ఎక్కువగా ఉపయోగించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గోదావరి, కృష్ణా బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లాం. ముందు డిజైన్ చేసినదానికంటే అదనంగా ఏమీ చేయడానికి వీల్లేదని వాదించాం. పోలవరం ప్రాజెక్టు ఒరిజినల్ ఫామ్‌కు అదనంగా మార్పులు చేయడానికి వీల్లేదని వాదనలు వినిపించాం" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.

**మధ్యవర్తిత్వమే మంచిది.. సుప్రీం ధర్మాసనం...** కాగా, గత విచారణలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

జల వివాదాలను పరిష్కరించుకు నేందుకు రెండు రాష్ట్రాలు మధ్యవర్తిత్వం ద్వారా ప్రయత్నిస్తే బాగుంటుం దని సూచించింది. అయినప్పటికీ, తమ రాష్ట్ర ప్రయోజనాల కోసం న్యాయపోరాటానికే మొగ్గు చూపుతున్నట్లు ఇరు రాష్ట్రాల చర్యలు కనిపిస్తున్నాయి.



### రిట్ విషయంలో సీఎం రేవంత్ తీరును ప్రజాక్షేత్రంలో ఎండగడతాం

హైదరాబాద్: పోలవరం - నల్లమల సాగర్‌కు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. సీఎం రేవంత్ నిజస్వరూపం, ద్రోహబుద్ధి సుప్రీంకోర్టు సాక్షిగా బట్టబయలైందన్నారు. గతంలో పాలమూరు ప్రాజెక్టుపై రైతులతో ఏపీ రిట్ వేయించి స్టే తెచ్చుకుందని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కార్ విచారణార్హత లేని పిటిషన్ వేసి రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఆరోపించారు. తెలంగాణ నీటి హక్కులను ఏపీకి ధారాదత్తం చేస్తూ రేవంత్ రెడ్డి ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. "రిట్ ఉపసంహరించుకుని సివిల్ సూట్ ఫైల్ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం అంటోంది. దీంతో పోలవరం - నల్లమల సాగర్ ప్రాజెక్టు కట్టుకోవడానికి ఏపీకి గడువు ఇచ్చినట్లైంది. నాలుగు రాష్ట్రాల వాదనలు వినడమనేది ఏళ్లు గడిచినా ముగియని కథే. ఈలోగా ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు పనులను పూర్తి చేసుకుంటుంది. తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తూ ఏపీ నీళ్లు తరలించుకుపోతుంది. సుప్రీంకోర్టులో బలహీన రిట్.. సంక్రాంతి వేళ చంద్రబాబుకు రేవంత్ ఇచ్చిన గిఫ్ట్. టెండర్ చివరి తేదీ తర్వాత కోర్టుకు వెళ్లి నల్లమల సాగర్‌కు పరోక్షంగా రేవంత్ అంగీకరించారు. పసలేని రిట్ వేసి సంపూర్ణంగా నల్లమల సాగర్‌కు మద్దతు ఇచ్చారు. పంచాయితీలు, కోర్టులు వద్దు.. చర్చించుకుందామన్న రేవంత్ మాటల ఆంతర్యమేంటి? తెలంగాణ నీటి హక్కులను గుంపగుత్తగా ఏపీకి అప్పజెప్పడమేనా చర్చల లక్ష్యం. రేవంత్ రెడ్డి.. గురు దక్షిణ కోసం ద్రోహం చేస్తుంటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు. రేవంత్ రెడ్డి దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం పోరాడుతాం" అని హరీశ్ రావు తెలిపారు.




### అందుకే ఉపాధి హామీ పథకం పేరు మార్పు: కేంద్ర మంత్రి

హైదరాబాద్, జనవరి 12: ఉపాధి హామీ పథకాన్ని తీసేశారంటూ బీజేపీపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో గతంలో చాలా అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఒక సంవత్సరం ఒకచోట గుంతలు తవ్వితే మరుసటి ఏడాదీ అదే ప్రాంతంలో తవ్వేవారని విమర్శించారు. దేశంలో అనేక మార్పులు, సంస్కరణలు చేస్తున్నామని.. మార్పులకు అనుగుణంగానే ఉపాధి హామీ పథకం పేరును మార్చామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. మన్రేగా పథకం.. ఇకపై వికసిత్ భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ(వీబీ-జీ రామ్ జీ) పేరుతో కొనసాగనుందని కిషన్ రెడ్డి తెలిపారు. వీబీ-జీ రామ్ జీ ద్వారా గోడౌన్‌లు నిర్మించాలని నిర్ణయించామని ఆయన వెల్లడించారు. అలాగే వ్యవసాయ రంగానికి దీనిని అనుసంధానం చేస్తామని కూడా మంత్రి వివరించారు. పని ఇవ్వలేని పరిస్థితుల్లోనూ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'ఇది కేవలం గుంతలు తవ్వే పథకం కాదు.. దేశాన్ని అభివృద్ధి చేసే పథకం' అని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు. గ్రామ పంచాయతీలకు అమలు అధికారం కల్పించామని, పని దినాలను 100 నుంచి 125కు పెంచామన్నారు మంత్రి. రాష్ట్రాలకు అదనపు నిధులు వచ్చేలా చేస్తున్నామని వివరించారు. దివ్యాంగులు, వృద్ధులకు కూడా ఉపాధి హామీ కార్డులు ఇస్తామని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు.



### ఇప్పటి వరకు ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదు

హైదరాబాద్: తాను ఇప్పటివరకు ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తీసుకుందామని అనుకున్నా.. ఏదో ఒక పని వచ్చి పడుతోందన్నారు. సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ 2026 డైరీ ఆవిష్కరణలో కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరని, 10.50లక్షల ప్రభుత్వ ఉద్యోగులే రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని అన్నారు. "ఉద్యోగులే ప్రభుత్వ సారథులు, వారధులు. వారి సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం. ఉద్యోగుల్లో కూడా నేను అంటే నచ్చని వారు చాలా మంది ఉండొచ్చు. నేను వచ్చాక ఉద్యోగుల జీతాలు ఎలా వస్తున్నాయో మీరే గమనించాలి. ఉద్యోగుల డీఏ దస్త్రాలపై సంతకం చేసి ఇక్కడికి వచ్చాను. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా ఇవ్వాలని నిర్ణయించాం. ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.12వేల కోట్లు మేర పెండింగ్‌లో ఉన్నాయి. పన్ను వసూళ్లలో అవకతవకలు అరికడితే రావాల్సిన నిధులు వస్తాయి. పన్నులు పెంచాల్సిన అవసరం లేదు. సరిగా వసూళ్లు చేస్తే చాలు"అని అన్నారు.

**జిల్లాల పునర్విభజనకు కమిటీ...** జిల్లాల సరిహద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయని, త్వరలో జిల్లాల పునర్విభజన కోసం విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ కమిటీ రాష్ట్రమంతా తిరిగి అభిప్రాయాలు స్వీకరిస్తుందని చెప్పారు. రాచకొండ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదనే మార్చినట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త జిల్లా కేంద్రాల్లో ఇళ్ల స్థలాలు ఇస్తామని సీఎం వెల్లడించారు.

# వాళ్ళకు గుడ్ న్యూస్ చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి

## దివ్యాంగులు పెళ్లి చేసుకుంటే రూ. 2 లక్షల ఆర్థిక సాయం

హైదరాబాద్, జనవరి 12: దివ్యాంగులను దివ్యాంగులు వివాహం చేసుకుంటే రూ.2లక్షల ఆర్థిక సాయాన్ని అందజేస్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. దివ్యాంగులను ఇతరులు వివాహం చేసుకున్నా.. ఈ ఆర్థిక సాయాన్ని అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. క్రీడల్లో రాణించిన దివ్యాంగులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారు. సమాజంలో ఆత్మగౌరవంతో వారు నిలబడేలా తమ ప్రభుత్వం మానవీయ కోణంలో పని చేస్తోందని తెలిపారు. ఒక కుటుంబసభ్యుల్లా వారికి భరోసా కల్పించేందుకు ఈ ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా రూ.50కోట్లు కేటాయించిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను ఉపయోగించుకుని జీవితంలో ఎదగాలని దివ్యాంగులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ ప్రాంతంలో దివ్యాంగులకు స్ఫూర్తి.. కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి అని ఆయన గుర్తు చేశారు. వైకల్యం అనే ఆలోచనను దరి చేరనీయకుండా.. ఉన్నత స్థాయికి ఎదిగిన గొప్ప వ్యక్తి జైపాల్ రెడ్డి అని ఆయన గుర్తు చేశారు. సోమవారం బేగంపేట గ్రీన్‌ల్యాండ్స్‌లోని ప్రజాభవన్ వేదికగా మూడు కొత్త సంక్షేమ పథకాలు.. చిన్నారుల కోసం బాల భరోసా, వృద్ధుల కోసం ప్రణామ్ డే కేర్ సెంటర్లు, ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పథకాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, సీతక్క, అడ్లూరు లక్ష్మణ్‌తో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రూ.50కోట్లతో దివ్యాంగులకు సహాయక పరికరాలు పంపిణీ చేశామని వివరించారు. ప్రణామ్ కార్యక్రమం ద్వారా వృద్ధులను ఆదుకుంటామన్నారు రేవంత్. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో 10 నుంచి 15 శాతం కోత విధిస్తామని హెచ్చరించారు. అందుకోసం ఈ బడ్జెట్ సమావేశాల్లో బిల్లు సైతం తీసుకు వస్తామన్నారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారిని మనమే దారిలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. తల్లిదండ్రులపై బాధ్యత లేని వారికి సమాజంపై ఏం బాధ్యత ఉంటుందంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇక ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని చెప్పారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కో-ఆప్షన్ మెంబర్‌గా ఒక ట్రాన్స్‌జెండర్‌ని కార్పొరేటర్‌గా నామినేట్ చేయాలని సూచిస్తున్నానన్నారు. తద్వారా వారి సమస్యలపై వారు మాట్లాడుకునే అవకాశం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో హెల్త్ పాలసీని తీసుకు రాబోతున్నామన్నారు. తెలంగాణ సమాజం.. సామాజిక న్యాయం, సమాన అవకాశాలను కోరుకుంటోందన్నారు. అందుకే దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కులగణన నిర్వహించామని చెప్పారు. తెలంగాణ ఒత్తిడికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన నిర్వహించేందుకు అంగీకరించిందని గుర్తు చేశారు. తెలంగాణ కులగణన మోడల్‌ను దేశం అనుసరిస్తోందని పేర్కొన్నారు సీఎం. తమ ప్రజా ప్రభుత్వంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసి సమాన అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఒకప్పుడు సామాన్యులకు ప్రవేశం లేని ఈ ప్రజాభవన్‌లో ఇప్పుడు అందరికీ ప్రవేశం కల్పించామని తెలిపారు. ఈ ప్రభుత్వానికి ధర్మ గంట ఉందని.. ఎవరు ఏ సమస్యలు చెప్పినా విని పరిష్కరిస్తుందని వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా, పేదల సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందామంటూ ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.



చురకలు
మంగళవారం 13 జనవరి 2026




హైదరాబాద్: సంక్రాంతి పండగ తరవాత మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ నెల 16న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పర్యటన ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా బహిరంగసభలో ప్రసంగిస్తారు. అదేరోజు సదర్‌మాట్ బ్యారేజీ ప్రారంభోత్సవంతో పాటు, చనాఖా-కోర్ట ప్రాజెక్టు సందర్శన, సభ ఉంటుందని కాంగ్రెస్ పార్టీవర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమాలతోనే మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. వాస్తవానికి ఫిబ్రవరి 3న జడ్చర్లలో నిర్వహించే బహిరంగ సభతో ప్రచారం ప్రారంభించాలని అనుకున్నా సమయం సరిపోదని.. అంతకన్నా ముందే జరపాలని తాజాగా నిర్ణయించారు.

**శంకుస్థాపనలు.. సభలు..** ఈ నెల 17న జడ్చర్లలో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి, మహబూబ్‌నగర్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపన చేసి, ఇదే పట్టణంలో ఏర్పాటుచేసే బహిరంగసభలో ప్రసంగించనున్నారు. 18న పాలేరులో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనల అనంతరం ఖమ్మం పట్టణంలో నిర్వహించే ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తారు. అనంతరం అక్కడే సీపీఐ వందేళ్ల సభలో పాల్గొంటారు. అదేరోజు సాయంత్రం ములుగు జిల్లా మేడారం చేరుకుని, అక్కడ రాత్రి బస చేస్తారు. 19న ఉదయం 6.30 గంటలకు కొత్తగా నిర్మించిన సమ్మక్క-సారలమ్మ గద్దెలను సీఎం ప్రారంభించి మొక్కులు తీర్చుకుని హైదరాబాద్ చేరుకుంటారు. అదేరోజు సాయంత్రం దావోస్‌కు బయలుదేరి వెళతారు. అక్కడినుంచి 25న అమెరికా వెళతారని తెలుస్తోంది. ఫిబ్రవరి ఒకటో తేదీన రేవంత్ తిరిగి హైదరాబాద్‌కు వస్తారని పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఈ కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించలేదు.

ఒక్కోచోట లక్ష మందితో సభ: ఫిబ్రవరి 3 నుంచి మళ్లీ ఉమ్మడి జిల్లాల్లో వరసగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సభలు ఏర్పాటు చేయనున్నారు. మున్సిపల్ ఎన్నికలకు హైదరాబాద్ మినహా మిగిలిన 9 ఉమ్మడి జిల్లాల్లో ఒక్కోచోట లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలనేది కాంగ్రెస్ ప్రచార వ్యూహం. ఈ సభలను విజయవంతం చేయడానికి ఒక్కో లోక్‌సభ నియోజకవర్గం లేదా ఒక ఉమ్మడి జిల్లా పర్యవేక్షణ బాధ్యతలను ఒక్కో మంత్రికి అప్పగించాలని సీఎం ఇప్పటికే సూచించారు. ఈ మేరకు ఏ జిల్లాకు ఏ మంత్రి అనేది పార్టీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. లోక్‌సభ నియోజకవర్గాలకు కాకుండా.. ఉమ్మడి జిల్లాలకు ప్రస్తుతం ఇన్‌ఛార్జి మంత్రులుగా ఉన్నవారికే సభల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలనే యోచనలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) ఉన్నట్లు సమాచారం.

పీసీసీ రూపొందించిన ప్రతిపాదనలపై ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించిన తరవాత మంత్రుల జాబితాను విడుదల చేస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం వార్డులు, ఛైర్మన్ పదవులు గెలవాలనే లక్ష్యంతో సభలు, ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.





## భారీగా చైనీస్ మాంజా సీజ్.. 57 మంది అరెస్ట్

హైదరాబాద్: దేశంలో చైనా మాంజాపై నిషేధం విధించినప్పటికీ.. వీటి అమ్మకాలు ఇంకా జరుగుతునే ఉన్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ పతంగులు ఎగురవేస్తూ ఆనందిస్తున్న సమయంలో ఈ చైనా మాంజా ప్రాణాలు తీస్తోంది. ఇప్పటికే ఈ చైనీస్ మాంజా కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయారు. హైదరాబాద్ వ్యాప్తంగా చైనీస్ మాంజా నిషేధానికి పోలీసులు ముమ్మర చర్యలు చేపట్టారు. జనవరి 8 నుంచి 11 వరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పోలీసులు రూ.43 లక్షల విలువైన 2,150 బాబిన్లు సీజ్ చేసి.. 57 మందిని అరెస్ట్ చేశారు. నిషేధిత మాంజా విక్రయంపై 29 కేసులు నమోదు చేశారు. గత 30 రోజులలో 132 కేసులు నమోదు చేసి, రూ.1.68 కోట్ల విలువైన 8,376 బాబిన్ల చైనీస్ మాంజా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనల్లో 200 మందిని అరెస్ట్ చేశారు పోలీసులు. కాగా.. చైనా మాంజా అంటే నైలాన్ లేదా సింథటిక్ దారానికి గాజు, లోహపు పొడుల వంటి పదునైన పదార్థాలను పూతగా వేసి తయారుచేసే ప్రమాదకరమైన దారం. ఇది సంప్రదాయ పత్తి దారంతో రూపొందించిన మాంజా కంటే చాలా పదునుగా బలంగా ఉంటుంది.

అయితే.. ఇది పర్యావరణానికి హానికరం. మనుషులకు, పక్షులకు, జంతువులకు గాయాలు చేసి, కొన్నిసార్లు ప్రాణాపాయం కూడా కలిగిస్తోంది. అందుకే చైనీస్ మాంజా విక్రయాలపై నిషేధం విధించారు. ఈ కారణంగా సంక్రాంతి పండుగ వేళ వీటి విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు విస్తృత చర్యలు చేపట్టారు.

## హైదరాబాద్-విజయవాడ హైవేపై కొనసాగుతున్న 'సంక్రాంతి' రద్దీ

చౌటుప్పల్: హైదరాబాద్-విజయవాడ హైవేపై 'సంక్రాంతి' రద్దీ కొనసాగుతోంది. పండగకు ఏపీ వైపు వెళ్లే వాహనాలతో పలుచోట్ల ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతోంది. పంతంగి టోల్‌ప్లాజా వద్ద కార్లు, ఇతర వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగుతున్నాయి. విజయవాడ వైపు వెళ్లే వాహనాల కోసం 10 టోల్ బూత్‌లను అధికారులు తెరిచారు. పెదకాపర్తి, చిట్యాల, కోదాడ, రామాపురం క్రాస్ వద్ద వాహనాలు నెమ్మదిగా వెళు తున్నాయి. హైవేపై బ్లాక్ స్పాట్ల వద్ద పోలీస్ పికెట్ కొనసాగుతోంది.





## మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం: మహేశ్‌కుమార్ గౌడ్

నిజామాబాద్: త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సర్వేల ఆధారంగా అభ్యర్థులకు బీఫామ్‌లు ఇస్తామని చెప్పారు. నిజామాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక సర్పంచ్ స్థానాలు గెలుచుకున్నాం. మున్సిపల్ ఎన్నికల్లోనూ విజయం కాంగ్రెస్‌దే. నిజామాబాద్ నగరంలో మంచి మెజార్టీతో గెలవబోతున్నాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా సన్నబియ్యం పంపిణీ జరుగుతోంది. గతంలో పేదవాడి సొంతింటి కల నెరవేరలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తోంది. రెండో దశలోనూ మంజూరు చేస్తాం. నిజామాబాద్ జిల్లాకు మరో రెండు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఇస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ఓట్ల రూపంలో మారనుంది. దేశంలో వేల ఉద్యోగాలను తొలగించిన ఘనత ప్రధాని మోదీది. భాజపాకు ఎందుకు ఓటెయ్యాలో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలి. దేవుడి పేరుతో ఓట్లు అడిగే హక్కు ఆ పార్టీకి ఎవరిచ్చారు? అలాంటి సంస్కృతి కాంగ్రెస్ పార్టీలో లేదు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

## యూరియా ఇవ్వని వ్యక్తి.. పాలమూరును సస్యశ్యామలం చేస్తారా?: సీఎం రేవంత్‌పై కేటీఆర్



మహబూబ్‌నగర్: బీఆర్ఎస్ హయాంలో పెట్టిన పరిశ్రమలకు ఇప్పుడు రిబ్బన్లు కట్ చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. మహబూబ్‌నగర్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమం జరిగింది. మహబూబ్‌నగర్‌లో ఐటీ హబ్ పెట్టి 14 పరిశ్రమలు తెస్తే ఇప్పుడు పారిపోయేలా చేశారని కేటీఆర్ ఆరోపించారు. పాలమూరు రైతన్నలను రేవంత్‌రెడ్డి ఎండపెడుతున్నారని విమర్శించారు. యూరియా ఇవ్వని వ్యక్తి పాలమూరును సస్యశ్యామలం చేస్తామంటున్నారంటూ ఎద్దేవా చేశారు. "కృష్ణా జలాలు మన వద్ద ఉన్నప్పుడే తీసుకుంటే కిందకు వెళ్లవు. ఈ విషయంలో పాత బాస్‌కు కోపం రావద్దు.. కేసీఆర్‌కు పేరు రావద్దనేది రేవంత్ ఆలోచన. రేవంత్ రెడ్డి నిజాయతీ గల మోసగాడు. ప్రజలు మోసగాళ్లనే నమ్ముతారని రేవంత్ చెప్పేవారు. పదేపదే మోసపోతే ప్రజలదే తప్పు అవుతుంది.

అభివృద్ధి పనులకు డబ్బులు లేవని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారు. డబ్బులు మూటలు కట్టి దిల్లీకి పంపితే రాష్ట్రంలో పనులకు ఎలా వస్తాయి? ఆంధ్రా కాంట్రాక్టర్లకు సీఎం పెద్దపీట వేస్తున్నారని జడ్చర్ల ఎమ్మెల్యేనే అంటున్నారు. తమ ప్రభుత్వం వస్తుందో? రాదో? తెలియదు. హామీ ఇవ్వనని జూపల్లి చెప్పారు. హామీలు, పథకాల అమలు గురించి ప్రశ్నిస్తే దూషిస్తున్నారు. అదృష్టం బాగుండి రేవంత్ సీఎం అయ్యారు" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## భూములు అమ్మి ఖజానా నింపే ఆలోచన మా ప్రభుత్వానికి లేదు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జనవరి12 : తమ ప్రభుత్వం పేదల భూములకు రక్షణ కల్పించే చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల 39 సబ్ రిజిస్టార్ కార్యాలయాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వాటిని 12 క్లస్టర్‌అబశ్రీశ్రీలుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్టర్ కార్యాలయాలు నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు వీటి నిర్మించేందుకు ముందుకురావడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. కూకట్‌పల్లిలో ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. డబ్బే తమ ప్రభుత్వానికి ప్రాధాన్యం కాదని స్పష్టం చేశారు. భూములు అమ్మి ఖజానా నింపే ఆలోచన ప్రభుత్వానికి లేదని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ అవసరాలకు భూములు తీసుకుంటే డబ్బులతో పాటు వారికి ఇళ్లను నిర్మించి ఇస్తామని మంత్రి పేర్కొన్నారు.

**ఖాళీ స్థలాలు ఆక్రమిస్తున్నారు: ఎంపీ ఈటల...** హౌసింగ్ కాలనీల్లో.. 40ఏళ్ల క్రితం వేసిన లేఅవుట్లలో ఖాళీ స్థలాలు బై నంబర్స్ వేసి ఆక్రమిస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపణలు చేశారు. కాంగ్రెస్



ప్రభుత్వం కాపాడలేదని మరికొన్ని చోట్లా వేలం వేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వం తలుచుకుంటే కాపడకపోవడం అనేది ఉండదని ఆయన అన్నారు. అలాంటి భూములు వేలం వేయకుండా పార్కులు చేసి ప్రభుత్వం రక్షించాలను సూచించారు. పోలీస్ స్టేషన్లు.. భూముల పంచాయతీలు పరిష్కరించే కేంద్రాలుగా మారొద్దని ఆయన కోరారు. 40ఏళ్ల క్రితం పేదలకు ఇచ్చిన స్థలాలను బ్రోకర్లు కబ్జా చేస్తున్నారని ఆరోపణలు చేశారు ఈటల. పేదలు కొనుక్కున్న భూములకు రక్షణ కల్పించాలని సూచించారు. నమీ, ×ణూాలో పేదలు కొన్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ ప్రభుత్వం ధనికుల కోసం పనిచేయడం కాదని.. పేదల సమస్యలు పరిష్కరించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.


## మాజీ సీఎం రోశయ్య సతీమణి కన్నుమూత..




హైదరాబాద్, జనవరి12 : దివంగత మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య సతీమణి కొణిజేటి శివలక్ష్మి(86) కన్నుమూశారు. వారి మరణం తెలుగు రాష్ట్రాల్లో విషాదాన్ని నింపింది. శివలక్ష్మి ఇవాళ (సోమవారం) తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా ఆమె వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ అమీర్‌పేటలోని తన నివాసంలో కన్నుమూశారు. శివలక్ష్మి మరణం వారి కుటుంబంలోనే కాకుండా, రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర విషాదం నింపింది.

**రాజకీయ ప్రముఖుల సంతాపం...** శివలక్ష్మి మరణ వార్త తెలియగానే తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అమీర్‌పేటలోని రోశయ్య నివాసానికి అభిమానులు, కార్యకర్తలు భారీగా చేరుకొని ఆమె పార్థివ దేహానికి నివాళులు అర్పిస్తున్నారు. రోశయ్యకు శివలక్ష్మి అండగా ఉంటూ, ఆయన రాజకీయ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించారని బంధుమిత్రులు తెలిపారు. రోశయ్య సుదీర్ఘ కాలం పాటు రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పినప్పటికీ.. శివలక్ష్మి తెర వెనకే ఉంటూ కుటుంబాన్ని చక్కదిద్దేవారని బంధుమిత్రులు చెబుతున్నారు.

## అలర్ట్.. జనవరి 14న హైదరాబాద్‌లో వర్షం



గత కొన్ని రోజుల నుంచి తెలుగు రాష్ట్రాల్లో చలి వాతావరణం ప్రజలకు చుక్కలు చూపిస్తోంది. ఉష్ణోగ్రతలు అత్యంత దారుణంగా నమోదవుతున్నాయి. ఉదయం, సాయంత్రం చలి గాలులు వీస్తున్నాయి. ఇరు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 10 నుంచి 5 మధ్య నమోదవుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అక్కడ కనిష్ఠ ఉష్ణోగ్రతలు 7 నుంచి 3 డిగ్రీలకు పడిపోతున్నాయి. ఉదయం పూట భారీగా మంచుకురుస్తోంది. మధ్యాహ్నం 12 గంటలయినా సరే పలు ప్రాంతాల్లో చలి తగ్గటం లేదు.


**హైదరాబాద్‌కు వర్ష సూచన...** చలి వాతావరణంతో అల్లాడిపోతున్న హైదరాబాద్ ప్రజలకు భారత వాతావరణ శాఖ బ్యాడ్ న్యూస్ చెప్పింది. జనవరి 14న.. అంటే బుధవారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. నగరాన్ని మబ్బులు కమ్మేసే అవకాశం ఉందని వెల్లడించింది. భారత వాతావరణ శాఖ అంచనాల మేరకు హైదరాబాద్‌లో వర్షం పడితే చలి వాతావరణం మరింత పెరిగే అవకాశం ఉంది. వర్షం కారణంగా గాల్లో తేమ పెరిగి.. దానికి చలి తోడైతే ప్రజలు అల్లాడిపోకతప్పదు. బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

## రైతన్నలు యూరియా తగ్గించి న్యాచురల్ ఫార్మింగ్ వైపు మళ్లాలి: మంత్రి తుమ్మల

ఖమ్మం జిల్లా , జనవరి 12 : పంటలకు యూరియా వాడటం వల్లే నష్టం కలుగుతోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. యూరియా వాడకం క్రమంగా తగ్గించాలని సూచించారు. అన్నదాతలకు పెట్టుబడి ఖర్చు తగ్గాలని, ఆదాయం పెరగాలని పేర్కొన్నారు. ఇవాళ(సోమవారం) రఘునాథపాలెం మండలం చింతగుత్తిలో డ్రోన్ స్ప్రేను మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.

**పురుగులమందులకు వ్యతిరేకం..** తాను పురుగులమందులకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు మంత్రి తుమ్మల. పంటకు కొట్టాల్సిన దానికంటే ఎక్కువ పురుగులమందు కొట్టి భూమాతను చంపేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాచురల్ ఫార్మింగే ఉత్తమమని.. దీనిపై రైతన్నలు దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పురుగులమందుల డూప్లికేట్



కంపెనీలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. పంటలకు ఎక్కడ, ఏ తెగులు ఉందని శాటిలైట్ ద్వారా సమీక్షించి రైతుకు చెప్పాలని అనుకుంటున్నామని తెలిపారు. దానికి కొన్ని గ్రామాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుంటున్నామని వెల్లడించారు.

## బోరబండలో ఉన్మాది ఘాతుకం.. మాట్లాడటం లేదన్న అనుమానంతో...

హైదరాబాద్, జనవరి12 : హైదరాబాద్ నగరంలో మరో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. బోరబండ ప్రాంతంలో ఓ యువకుడు తనతో సరిగ్గా మాట్లాడటం లేదనే కారణంతో ఓ యువతిని దారుణంగా హత్య చేశాడు. ఈ దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. దీంతో నగరంలో మహిళల భద్రతపై మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

**పబ్‌లో పరిచయం.. మొదలైన స్నేహం..** పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడైన యువకుడికి, యువతితో బంజారాహిల్స్‌లోని ఓ పబ్‌లో గతంలో పరిచయం ఏర్పడింది. ఆ పబ్‌లో యువతి ఉద్యోగం చేస్తుండగా, తరచూ అక్కడికి వచ్చే యువకుడితో పరిచయం ఏర్పడి క్రమంగా స్నేహంగా మారింది. మొదట సాధారణంగా మాట్లాడుకున్నా.. కాలక్రమేణా ఇద్దరి మధ్య సన్నిహిత సంబంధం ఏర్పడినట్లు తెలుస్తోంది.

**ఊర్వశీ బార్‌కు షిఫ్ట్ అయిన యువతి..** అయితే.. కొద్ది రోజుల క్రితం ఆ యువతి బంజారాహిల్స్‌లోని పబ్‌ను విడిచి, బోరబండ పరిధిలోని ఊర్వశీ బార్‌కు ఉద్యోగం మారింది.

ఆ తర్వాత.. యువతి నిందితుడితో మాట్లాడటం తగ్గించిందని, ఫోన్ కాల్స్‌కు కూడా సరిగా స్పందించకపోవడంతోనే ఈ హత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

**అనుమానం..** యువతి తనను పట్టించుకోవడం లేదని, ఉద్దేశపూర్వకంగా దూరం పెడుతోందనే అనుమానం నిందితుడిలో పెరిగింది. ఈ అనుమానం క్రమంగా కోపంగా, ఆగ్రహంగా మారి చివరికి హత్యకు దారితీసింది. తనతో మాట్లాడకపోవడానికి కారణం ఏంటో తెలుసుకోవాలనే నెపంతోనే నిందితుడు యువతిని పిలిచినట్టు సమాచారం.


**మాట్లాడదామని పిలిచి..** యువతిని బోరబండ ప్రాంతానికి నిన్న(ఆదివారం) నిందితుడు పిలిచాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో.. తీవ్ర కోపంతో ఆమెపై దాడికి పాల్పడ్డాడు. పదునైన ఆయుధంతో యువతిని హత్య చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటనా స్థలంలోనే యువతి మృతిచెందినట్టు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

**మహిళల భద్రతపై ఆందోళన...** ఈ ఘటన బోరబండ పరిసర ప్రాంతాల్లో తీవ్ర కలకలం రేపింది. జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతంలో ఇలాంటి ఘటన జరగడం స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. ముఖ్యంగా రాత్రి వేళ ఉద్యోగాలు చేసే యువతుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**పోలీసుల అదుపులో నిందితుడు..** సమాచారం అందుకున్న వెంటనే బోరబండ పోలీసులు.. సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. హత్యకు పాల్పడిన యువకుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితుడిపై హత్య కేసు నమోదు చేసి, పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.



# మహాత్ముని చివరి నిరాహార దీక్ష - గాంధీ చివరి ఉపవాసం (జనవరి 13-18, 1948)



భారత జాతిపిత మహాత్మాగాంధీ దేశ స్వాతంత్ర్య సాధన కోసం ఎన్నో సార్లు నిరాహార దీక్షలు చేపట్టారు. అయితే గాంధీజీ స్వతంత్రం వచ్చిన తరువాత నిరాహారదీక్ష కూడా చేసారు. స్వాతంత్ర్యానంతరం గాంధీ ప్రయత్నాలు హిందూ - ముస్లిం విద్వేషాలను నివారించడానికి పరిమిత మయ్యాయి. ముస్లిం నాయకుడైన మహమ్మద్ అలీ జిన్నాను ప్రధాని మంత్రిగా చేసైనా దేశ విభజనను ఆపాలని గాంధీ భావించారు. ఇది హిందూ– ముస్లింల మధ్య మరింత చిచ్చు రాజేసింది. నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ లు గాంధీ విధానాన్ని వ్యతిరేకించారు. విభజన జరిగితే నే అల్లర్లు సమసి పోతాయని వారు భావించారు. దేశ విభజనే..అంతర్గత యుద్ధమో తేల్చుకోండని జిన్నా పిలుపు నివ్వడం గాంధీని ఐరకాటంలో పడేసింది. 1947 ఆగస్టు 15న దేశ మంతా సంబరాలు జరుపు కుంటుంటే..గాంధీ మాత్రం కలకత్తాలోని ఒక హరిజన వాడన శుభ్రం చేస్తు గడపడం విశేషం. దేశ విభజన ప్రతిపాదన, దానికి వ్యతిరేకంగా చెలరేగిన అల్లర్లు, అవి దారితీసిన ఉద్రిక్తతలు, మత ఘర్షణల ఫలితంగా అనూహ్యమైన రీతిలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వం పరిస్థితిని అదుపు చేయలేని అసహాయ స్థితిలో పడింది. మొత్తం పోలీసు బలగాలు దేశ పశ్చిమ ప్రాంతానికి పంప బడ్డాయి. తూర్పు ప్రాంతంలో కల్లోలాలను అదుపు చేసే భారం గాంధీ పై పడింది. దేశ విభజనతో ముఖ్యంగా పంజాబు, బెంగాలు లలో పెద్దఎత్తున సంభవించిన వలసలవల్ల మత కలహాలు, మారణ కాండలు ప్రజ్వరిల్లాయి. 1947లో కాశ్మీరు విషయమై భారత్ - పాకిస్తాన్ యుద్ధం తరువాత ఇంటా, బయటా పరిస్థితి మరింత క్షీణించింది. ముస్లిము లందరినీ పాకిస్తాను పంపాలనీ, కలసి బ్రతకడం అసాధ్యమనీ వాదనలు నాయకుల స్థాయిలోనే వినిపించ సాగాయి. ఈ పరిస్థితి గాంధీకి మింగుడు పడని అంశంగా మారింది. దీనికి తోడు విభజన ఒప్పందం ప్రకారము పాకిస్తానుకు ఇవ్వవలసిన 55 కోట్లు రూపాయలను ఇవ్వడానికి భారత ప్రభుత్వం నిరాకరించింది. ఆ డబ్బు భారతదేశంపై పాకిస్తాన్ యుద్ధం చేస్తే యుద్ధానికి ఉపయోగ పడుతుందని సర్దార్ పటేల్ వంటి నాయకుల అభిప్రాయం. కాని అలా కాకుంటే పాకిస్తాన్ మరింత ఆందోళన చెందుతుందనీ, దేశాలమధ్య విరోధాలు ప్రబలి మతవిద్వేషాలు సరిహద్దులు దాటుతాయనీ, అంతర్యుద్ధానికి దారితీస్తుందనీ గాంధీజీ అభిప్రాయం.

జనవరి 12, 1948. ఆ రోజు సాయంత్రం తన రోజువారీ ప్రార్థన సమావేశంలో, మరుసటి రోజు ఉదయం నుండి ఆమరణ ఉపవాసం కూర్చుంటానని గాంధీ ప్రకటించారు. 1948 జనవరి 13న మధ్యాహ్నం సుమారు 12 గంటలకు గాంధీజీ రెండు డిమాండ్లతో నిరాహార దీక్షలో కూర్చున్నారు. మొదటి డిమాండ్ పాకిస్తాన్‌కు భారత్ విభజన ఒప్పందంకు సంబంధించిన మిగిలిన రూ.55 కోట్లు ఇవ్వాలి. రెండోది ఢిల్లీలో ముస్లింలపై జరుగుతున్న దాడులు ఆగాలి. దీనికి ముందు గాంధీ తన రోజువారీ పనులను పూర్తి చేశారు. నెహ్రూ, పటేల్, ఆజాద్‌లతో ఆయన సుదీర్ఘ చర్చలు జరిపారు. కొంతమంది బిర్లా హౌస్ పచ్చిక బయళ్లలో గుమిగూడారు. 'వైష్ణవ జన తో తేనె కహియే తో' పాట, ఆయనకు ఎంతో ప్రియమైన భజన్లను, శ్లోకాలను పాడారు. తర్వాత ఖురాన్ మరియు గురు గ్రంథ్ సాహిబ్ నుండి శ్లోకాలు పఠించ బడ్డాయి. ఇలా ఆయన ఢిల్లీలో తన చివరి ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. ఎవరెంతగా ప్రాధేయపడినా ఆయన తన దీక్ష మానలేదు. చివరకు భారత ప్రభుత్వం దిగివచ్చి పాకిస్తానుకు 55 కోట్ల డబ్బు ఇవ్వడానికి అంగీకరించింది. 1948 జనవరి 18న ఒక శాంతి కమిటీ ఏర్పాటైంది. ముస్లింలు ఢిల్లీలోని తమ ఇళ్లలోకి వెళ్లవచ్చని, హిందువులు, సిక్కుల ఆక్రమణ నుంచి మసీదులను విడిపిస్తామని, అక్రమ కబ్జాల నుంచి ముస్లింల ప్రాంతాలను విడిపిస్తామని, ఇక్కడ నుంచి భయపడి వెళ్లిపోయిన ముస్లింలు తిరిగి రావడానికి హిందువుల నుంచి ఎలాంటి అభ్యంతరం ఉండదని ఆ కమిటీ మహాత్మా గాంధీకి హామీ ఇచ్చింది. హిందూ, ముస్లిమ్, సిక్కు వర్గాల నాయకులు సఖ్యంగా ఉండటానికి కట్టుబడి ఉన్నామని ఆయనవద్ద ప్రమాణం కూడా చేశారు. జనవరి 18న మధ్యాహ్నం 12.45కు మౌలానా ఆజాద్ ఇచ్చిన నారింజ రసం తాగిన మహాత్మా గాంధీ తన నిరాహార దీక్షను విరమించారు. కాని ఈ మొత్తం వ్యవహారంలో గాంధీ పట్ల మతోన్మాదుల ద్వేషం బలపడింది. మత ప్రాతిపదికన పాకిస్తాన్ ప్రత్యేక దేశం ఏర్పాటుకు గాంధీ వ్యతిరేకిస్తున్నారని ముస్లింలు భావించగా, ముస్లింల వేధింపులపై ప్రతీకారం తీర్చుకునేందుకు గాంధీ తమకు అడ్డుపడుతున్నాడని హిందూ తీవ్రవాదులు భావించారు. గాంధీ హత్యకు దారితీసింది హిందూ– ముస్లింల మధ్య నెలకొన్న కలహాలే అనే వాదన బలంగా ఉంది. ఈ నేపథ్యంలో నే నాథూరామ్ గాడ్సే పథకం ప్రకారం 1948 సంవత్సరం జనవరి 30వ తేదీ నాడు బిర్లా మందిర్ ప్రార్థన మందిరం మైదానంలో హత్య చేయడం జరిగింది. గాంధీ సమ్మతితో కాంగ్రెస్ లోని అగ్రనేతలు అంతా కలిసి దేశాన్ని చీలికలు - పేలికలు గా మార్చారని, దేశ విభజనకు సమ్మతి తెలిపి పెద్ద కుమారుడు వంటి గాంధీ భారత దేశానికి ద్రోహం చేయడం ద్వారా ఆయన తన ధర్మాన్ని నెరవేర్చడంలో ఘోరంగా విఫలం అయ్యాడని, అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే నేను తుది నిర్ణయానికి వచ్చానని, అందుకే తానే గాంధీని కాల్చి చంపానని గాడ్సే కోర్టులో వివరించాడు. స్వతంత్ర భారతదేశంలో ఉరితీయబడిన మొదటి వ్యక్తిగా గాంధీని చంపిన నాథూరామ్ వినాయక్ గాడ్సే చరిత్రలో నిలిచిపోయాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**




అమరావతి: రాష్ట్ర ప్రజల ఆశలను నిలబెట్టామని.. వారిలో విశ్వాసాన్ని మళ్లీ కల్పించామని సీఎం చంద్రబాబు అన్నారు. 2025 ఏడాది మంచి ఫలితాలను ఇచ్చిందని చెప్పారు. విధ్వంసమైన వ్యవస్థల నుంచి సుపరిపాలనను గాడిలో పెట్టామన్నారు. సూపర్‌సిక్స్ ద్వారా సంక్షేమం, అభివృద్ధిని వేగంగా చేయగలిగామని.. ఈ ఏడాది కూడా మరింత కష్టించి పని చేద్దామన్నారు. సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో సీఎం సమీక్ష నిర్వహించారు. జీఎస్‌డీపీ, ఆర్టీజీఎస్, పట్టాదారు పాస్ పుస్తకాలు తదితర అంశాలపై చర్చించారు. తల్లికి వందనం ద్వారా 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,090 కోట్లు జమ చేశామని సీఎం అన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా 3.5కోట్ల మంది మహిళలు ప్రయాణాలు చేశారని.. దీనికోసం ఇప్పటి వరకు రూ.1,114 కోట్ల వ్యయం చేశామని చెప్పారు. అన్నదాత సుఖీభవ కింద 46లక్షల మంది రైతులకు రూ.6,310 కోట్లు ఖాతాల్లో వేశామని వివరించారు. ఏడాదిన్నరలో 50వేల కోట్ల మేర పింఛన్లు అందించడంతో సంక్షేమంలో కొత్త మైలురాయిని సాధించామని సీఎం పేర్కొన్నారు. అమరావతిని శ్మశానం, ఎడారి అని గతంలో హేళన చేశారని.. కానీ ఇదో స్ఫూర్తిదాయక ప్రాజెక్టు అని చంద్రబాబు చెప్పారు. అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నామన్నారు. పోలవరం అద్భుతమైన ప్రాజెక్టు అని.. అది పూర్తయితే దక్షిణ భారతంలో ఏ రాష్ట్రమూ మనతో పోటీ పడలేదని చెప్పారు. నల్లమలసాగర్ ద్వారా రాయలసీమ ప్రాంతంతో పాటు ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలకు నీరు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదన్నారు. ఎగువ నుంచి వదిలిన నీళ్లు పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు తీసుకెళ్లి వాడుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. పోలవరంలో మిగిలిన నీటిని తెలంగాణ కూడా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆ రాష్ట్రంలో ప్రాజెక్టులు కట్టినప్పుడు తానెప్పుడూ అడ్డు చెప్పలేదని సీఎం గుర్తుచేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టును త్వరలోనే జాతికి అంకితం చేస్తామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వ సహకారంతో కాపాడుకున్నామని వివరించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల సెంటిమెంట్ అని.. ఆ ప్లాంట్‌ను నిలబెట్టి తీరుతామన్నారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయని తెలిపారు. పెట్టుబడులకు డెస్టినేషన్‌గా రాష్ట్రం మారిందన్నారు. ఎస్ఐపీబీ ద్వారా రూ.8.74లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని.. వాటి ద్వారా కూడా పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయన్నారు.




## అమెరికా చేతిలో దెబ్బలు.. దిగొచ్చిన ఇరాన్.. ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు..

అంతర్గత తిరుగుబాటుతో సతమతమవుతున్న ఇరాన్ నాయకత్వం దిగొచ్చినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యకు సిద్ధమవుతోందని వార్తలు వస్తున్న వేళ ఆ దేశ నాయకులు తనకు ఫోన్ చేశారని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా చేతిలో దెబ్బలు తిని ఇరాన్ నేతలకు విసుగు వచ్చి ఉంటుందని, అందుకే వెనక్కి తగ్గారని ట్రంప్ ఎద్దేవా చేశారు. త్వరలోనే ఇరాన్ నాయకులతో సమావేశం అయ్యే అవకాశం ఉందని తెలిపారు (ఖా ×త్మీఖ్ ఖ్రీఎం జూతీశీవ్రం). 'ఇరాన్ నాయకులు నిన్న నాకు ఫోన్ చేశారు. మాతో వారు చర్చలు జరపాలనుకుంటున్నారు. అక్కడి నాయకులు పరిమితులు దాటి హింసతోనే దేశాన్ని పరిపాలిస్తున్నారు. ఆ దేశ పరిస్థితిని మేం నిశితంగా గమనిస్తున్నాం. సమస్య పరిష్కారం కోసం అందుబాటులో ఉన్న బలమైన ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నాం. ఇరాన్ నాయకులను కలవడానికి ముందే మేం చర్యలు తీసుకోవాల్సి రావొచ్చు. ఏదేమైనా ఇరాన్ నాయకులతో ఒక సమావేశం మాత్రం ఉంటుంది' అని ట్రంప్ స్పష్టం చేశారు. అలాగే ఇరాన్‌లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడం గురించి కూడా ట్రంప్ స్పందించారు.

శాటిలైట్ ద్వారా ఇరాన్‌లో ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించడం గురించి స్పేస్ ఎక్స్ అధినేత ఎలన్ మస్క్‌తో మాట్లాడాలనుకుంటున్నట్టు తెలిపారు. కాగా, ఇరాన్‌లో జరుగుతున్న ఘర్షణల్లో ఇప్పటివరకు 544 మంది వరకు చనిపోయినట్టు సమాచారం. వీరిలో 48 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. ఇప్పటివరకు 10 వేల మందికి పైగా నిరసనకారులను ఇరాన్ ప్రభుత్వం అరెస్ట్ చేసింది.

# రాజకీయ దురంధరుడు మర్రి చెన్నారెడ్డి జనవరి 13...మర్రి చెన్నారెడ్డి జయంతి




మర్రి చెన్నారెడ్డి (జనవరి 13, 1919 - డిసెంబర్ 2, 1996) భారత జాతీయ కాంగ్రెసు పార్టీకి చెందిన రాజకీయ నాయకుడు. 1978 నుండి 1980 వరకు, 1989 నుండి 1990 వరకు రెండు పర్యా యాలు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఉత్తర ప్రదేశ్ గవర్నర్‌గా (1974–1977), పంజాబ్ గవర్నర్ (1982–1983), గవర్నర్‌గా కూడా పనిచేశారు. ఫిబ్రవరి 1992 నుండి మే 1993 వరకు రాజస్థాన్, 1993 నుండి ఆయన మరణించే వరకు తమిళనాడు గవర్నర్‌గా ఉన్నారు . అతను ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు .అతి పిన్న వయస్కుడైన మంత్రులలో ఒకరైన ఘనత కూడా ఆయనకు ఉంది. 30 సంవత్సరాల వయస్సులో ఆంధ్ర ప్రదేశ్ మంత్రి కావడం కూడా విశేషం. చెన్నారెడ్డి జనవరి 13, 1919న ప్రస్తుత వికారాబాదు జిల్లా, వికారాబాదు తాలూకాలోని మార్పల్లి మండలం లోని సిరిపురం గ్రామములో శంకరమ్మ, లక్ష్మారెడ్డి దంపతులకు జన్మించారు. హైస్కూలు విద్యార్థిగా వున్న రోజులలో, ఉపన్యాస పోటీలను ఏర్పాటు చేయడం, గ్రంథాల యాలను స్థాపించడం, సేవాకార్య క్రమాలను నిర్వహించి, తోటి విద్యార్థులను ఉత్తేజ పరిచేవారు. కాలేజీలో చదువుతున్న రోజులలో సాంఘిక సేవా దళాలను ఏర్పాటు చేసి వాటికి నాయకత్వం వహించ డమో, లేదా నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా జరిగే రాజకీయ మహా సభలలో ప్రతినిధిగా పాల్గొనడమో చేస్తూ ఉండేవారు. చిన్ననాటినుండి వైద్యవృత్తిని చేబట్టాలనే ఆకాంక్ష బలంగా ఉండేది. చివరకు తన 22వ ఏట ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎం.బి.బి.యస్ పట్టా తీసుకొనడం ద్వారా ఆయన ఆశయం సిద్ధించింది. రాష్ట్ర ప్రభుత్వ శాఖలో వైద్యులుగా నియమింప బడ్డారు. ఉద్యోగంలో ప్రవేశించిన రెండు నెలలలోనే ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి హైదరాబాదు లో స్వతంత్రంగా రెండు వైద్యాల యాలను నెలకొల్పి వైద్యం చేయడం ప్రారంభించారు. రెండు సంవత్సరాలకు ఆ రెండు చికిత్సాలయాలను మూసివేసి, తన జీవితాన్ని పూర్తిగా దేశ రాజకీయాలకు అంకితం చేశారు. గాంధీజీ పిలుపు మేరకు 1935లో ఆంధ్రమహాసభలో పాల్గొన్నారు. అది ఆయన రాజకీయ అరంగేట్రం. కార్యకర్తగా, సమావేశకర్తగా, ఖాదీ ప్రచారకులుగా, గాంధేయులుగా, విద్యార్థి నాయకులుగా, ఆంధ్ర విద్యార్థి కాంగ్రెస్ వ్యవస్థాపకులుగా అనేక స్థాయిల్లో పనిచేసి అనుభవాన్ని సంపాదించారు. 1938లో జైలు శిక్షను అనుభ వించారు. చెన్నారెడ్డి 1941లో ఎం.బి.బి.ఎస్ డిగ్రీ పొందారు. వరంగల్ లోని గాంధీ ఆసుపత్రిలో డాక్టర్ గా పని చేశారు. తర్వాత రోజుల్లో ఆంధ్ర యువజన సమితి, విద్యార్థి కాంగ్రెసును స్థాపించారు. అనేక విద్యార్థి, యువత, విద్యా, అక్షరాస్యత, సాంస్కృతిక సంస్థలలో చురుకుగా పాల్గొనే వారు. ఒక వారపత్రికకు రెండు సంవత్సరాల పాటు సంపాద కత్వము వహించారు. అనేక పత్రికలలో వ్యాసాలు కూడా ప్రచురించారు. చెన్నారెడ్డి అప్పటి హైదరాబాదు రాష్ట్రములోని స్వాతంత్ర్యోద్యమములో పాల్గొన్నారు. 1942లో ఆంధ్ర మహాసభ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1946 లో జరిగిన రాష్ట్ర స్టేట్ కాంగ్రెసు మహాసభకు చెన్నారెడ్డి ఆహ్వాన సంఘ కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. చివరకు ఈ స్టేట్ కాంగ్రెసు అధ్వర్యాన్నే, హైదరాబాద్ ప్రజలు నిజాం నిరంకుశ పరిపాలనను ఎదుర్కొని పోరాడారు. నిజాం మీద సాగించిన ఈ పోరాటాన్ని అహింసాయుత పద్ధతిని సాగించాలని డాక్టరు చెన్నారెడ్డి అభిమతం. ఆ సందర్భంలో ఆయన ఢిల్లీ వెళ్ళి పండిట్ జవహర్లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ తదితరులను కలుసుకుని వచ్చారు. మహాత్మాగాంధీ. ఆశీస్సులను కూడా పొందారు. ఆయన అనేక సంవత్సరాలు ఆంధ్రా ప్రావిన్స్ కాంగ్రెస్ కమిటీకి ప్రధాన కార్యదర్శిగా, 30 సంవత్సరాలు పిసిసి వర్కింగ్ కమిటీ సభ్యునిగా ఉన్నారు . హైదరాబాదు స్వతంత్ర్య పోరాటం ఉధృత రూపం దాల్చడంతో, నిజాం ప్రభుత్వం నాయకులందరినీ అరెస్టు చేసింది. అరెస్టు అయిన నాయకులలో చిన్నవాడైన చెన్నారెడ్డి కూడా ఉన్నారు. చర్చల ఫలితంగా విడుదలై, స్టేట్ కాంగ్రెస్ నాయకులందరు హైదరాబాదు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు వలస వెళ్ళి, అక్కడనుండి ఉద్యమం సాగించారు. ఆ సమయంలో చెన్నారెడ్డి విజయవాడ వచ్చి, "హైదరాబాదు" అనే వారపత్రికను నిర్వహిస్తూ, హైదరాబాదు ప్రజలు సాగిస్తున్న స్వాతంత్ర్య పోరాటాన్ని ఉధృత పరిచారు. ఆ సమయంలో భారత ప్రభుత్వం కలుగజేసుకుని నిజాంపై పోలీసు చర్యలను తీసుకుని, హైదరాబాదు సంస్థానాన్ని ఇండియాలో అంతర్భాగంగా విలీనం చేసింది. దానితో ఇండియా పార్లమెంటుకు హైదరాబాదు రాష్ట్రంలోని కొందరిని ప్రజా ప్రతినిధులుగా భారత ప్రభుత్వం తీసుకొనడం జరిగింది. ఆనాటి పార్లమెంటు సభ్యులలో చెన్నారెడ్డి కూడా ఒకరు. పార్ల మెంటులో హైదరాబాదు లోని విషమ సంఘటనలను, పరిస్థితులను గురించి చెన్నారెడ్డి చేసిన ప్రసంగాలు నెహ్రూ, రాజాజీల వంటి వారిని ఆకర్షించాయి. పర్యవసానంగా చెన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీ విప్ గా ఎన్నుకో బడ్డారు. ఇంతలో 1952లో దేశమంతటా ప్రప్రథమంగా వయోజన వోటింగు పద్ధతిని జనరలు ఎన్నికలు జరిగాయి. చెన్నారెడ్డి హైదరాబాదు రాష్ట్ర శాసన సభకు ఎన్నుకో బడ్డారు. తర్వాత బూర్గుల మంత్రివర్గంలో ఆహార, వ్యవసాయ శాఖలమంత్రిగా తీసుకోబడి, ఇండియన్ డెలిగేషనుకు నాయకత్వం వహించి, 1953, 1955 సంవత్సరాలలో విదేశాలు పర్యటించారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ జరిగిన తర్వాత సంజీవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి మంత్రి వర్గాలలో కూడా చెన్నారెడ్డి మంత్రిగా పనిచేశారు. ఆంధ్ర రాష్ట్రంతో తెలంగాణ విలీనాన్ని వ్యతిరేకించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పెద్ద మనుషుల ఒప్పందంపై సంతకం చేసిన తెలంగాణ ప్రాంత నేతలలో ఒకరు . డాక్టర్ రెడ్డి 1967 లో ఇందిరా గాంధీ కేంద్ర మంత్రివర్గంలో ఉక్కుశాఖా మంత్రిగా తీసుకో బడ్డారు. ఆంధ్రప్రదేశ్ లోని తెలంగాణ ప్రజలు సాంఘిక ఆర్థిక విద్యా రంగాలలో వెనుకబడి యుండడాన్ని డాక్టరు చెన్నారెడ్డి సహించలేక పోయారు. ఏప్రిల్ 1968 లో కేంద్ర మంత్రివర్గం నుండి రాజీనామా చేసారు. 1968లో ఢిల్లీ నుండి హైదరాబాదుకు తిరిగి రాగానే "తెలంగాణ ప్రజా సమితి" అనే పార్టీని నెలకొల్పి, ప్రత్యేక తెలంగాణ నిర్మాణం కొరకు పోరాటం సాగించారు. ఉద్యమాన్ని రాజకీయం చేసేందుకు చెన్నారెడ్డి తెలంగాణ ప్రజాసమితి అధ్యక్షుడయ్యారు. విభజనకు మద్దతిచ్చే ఆ పార్టీ 11 లోక్‌సభ స్థానాలను (14 స్థానాల్లో) గెలుచు కోవడం ద్వారా ప్రజా ఆదరణ పొందింది. ఉత్తర ప్రదేశ్ (1970ల మధ్యలో రాష్ట్రపతి పాలన సమయంలో), రాజస్థాన్, పంజాబ్, తమిళనాడు మరియు పాండిచ్చేరి గవర్నర్‌గా కూడా ఉన్నారు. 1971లో సిక్స్ పాయింట్ ఫార్ములా రూపొందించిన ఘనత ఆయనదే. 1972లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరిగినప్పుడు కాంగ్రెస్ మేనిఫెస్టోలో 'న్యూ డీల్ ఫర్ తెలంగాణ'గా చేర్చారు. డాక్టరు చెన్నారెడ్డి శక్తి సామర్థ్యా లను గుర్తించిన ఇందిరా గాంధీ, ఆయనను ఉత్తరప్రదేశ్ గవర్నరుగా నియమించగా, 1974 అక్టోబరు 24వ తేదీన పదవీ స్వీకారం చేశారు. 1977 అక్టోబరులో గవర్నరు పదవివి రాజీనామా చేసి హైదరాబాదుకు తిరిగి వచ్చారు. దేశ పరిస్థితులను, వివిధ రాజకీయ పక్షాల తీరు తెన్నులను పరిశీలించారు. చివరకు కాంగ్రెసు (ఐ) పార్టీని తమ పార్టీ గా నిర్ణయించుకున్నారు. 1978 జనవరి 18 వ తేదీని రాష్ట్రకాంగ్రెసు (ఐ) అధ్యక్ష పదవిని స్వీకరించారు. 1978 ఫిబ్రవరిలో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో డాక్టరు చెన్నారెడ్డి కృషి వలన కాంగ్రెస్ (ఐ) పార్టీ 180 స్థానాలు గెలుచు కొన్నది. అత్యధిక సంఖ్యాబలం గల కాంగ్రెస్ (ఐ) పార్టీ తరుపున డాక్టరు చెన్నారెడ్డి గారు 1978 మార్చి 6వ తేదీని ముఖ్యమంత్రి పదవిని అలంక రించారు. డిసెంబర్ 2,1996న చెన్నారెడ్డి మరణించారు. చెన్నారెడ్డి సమాధి హైదరాబాదులో ఇందిరా పార్కు ఆవరణలో ఉంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**




## పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ ప్రయోగంలో సాంకేతిక లోపం.. శాటిలైట్‌తో తెగిన సంబంధాలు

ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీఎస్ఎల్వీ–సీ62 రాకెట్ ప్రయోగంలో సాంకేతిక లోపం తలెత్తింది. నాలుగో దశలో శాటిలైట్‌తో సంబంధాలు తెగిపోయాయి. 18 నిమిషాల్లోనే పూర్తి కావాల్సిన ప్రయోగం సాంకేతిక లోపం కారణంగా ఆలస్యం అవుతోంది. ప్రయోగంపై ఇస్రో ఛైర్మన్ నారాయణన్ మాట్లాడుతూ.. 'పీఎస్అబశ్రీశ్రీఎల్వీ–సీ62 రాకెట్ ప్రయోగానికి అంతరాయం ఏర్పడింది. ప్రయోగం మూడో దశ వరకు సాఫీగా సాగింది. మూడో దశ తర్వాత సాంకేతిక లోపం ఏర్పడింది. సాంకేతిక సమస్యపై విశ్లేషిస్తున్నాం' అని అన్నారు. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్–షార్ నుంచి పీఎస్అబశ్రీశ్రీఎల్వీ–సీ62 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రోజు ఉదయం 10:18 గంటలకు రాకెట్ ప్రయోగం జరిగింది. కొత్త ఏడాదిలో ఇస్రో చేపట్టిన తొలి ప్రయోగం ఇదే కావటం విశేషం. పీఎస్అబశ్రీశ్రీఎల్వీ–సీ62 రాకెట్ అధునాతన భూపరిశీలన ఉపగ్రహం ఈవోఎస్–ఎన్1తో పాటు మరో 15 చిన్న ఉపగ్రహాలను నింగిలోకి తీసుకెళ్లింది. అయితే, సాంకేతిక లోపం కారణంగా మూడవ దశ తర్వాత శాటిలైట్‌తో సంబంధాలు తెగిపోయాయి. సాంకేతిక సమస్యను పరిష్కరించడానికి ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు. ఈవోఎస్–ఎన్ 1ను వాతావరణ మార్పులు, పర్యావరణ పరిశోధన నిమిత్తం కక్ష్యలోకి పంపుతున్నారు. దీంతోపాటు పంపే మిగతా 15 ఉపగ్రహాలనూ ధృవ కక్ష్యలోకి రాకెట్ ప్రవేశపెడుతుంది. వీటిలో 8 విదేశీ ఉపగ్రహాలున్నాయి. వీటితో భారత్ నుంచి ఇప్పటి వరకు ప్రయోగించిన విదేశీ ఉపగ్రహాల సంఖ్య 442కు చేరుతుంది. ఇక, ఈ ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్ 22 గంటల ముందు అంటే.. ఆదివారం మధ్యాహ్నం 12.17 గంటలకు ప్రారంభమైంది. పీఎస్ఎల్వీ–సీ 62 ప్రయోగం విజయవంతం కావాలని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ శనివారం శాస్త్రవేత్తలతో కలిసి తిరుమల శ్రీవారిని, శ్రీకాళహస్తీశ్వర స్వామిని, సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీవారి పాదాల చెంత ఉపగ్రహం నమూనాను ఉంచి పూజలు చేశారు.

## ఎన్‌హెచ్ఏఐకి 4 గిన్నిస్ రికార్డులు.. అసాధ్యాన్ని సుసాధ్యం చేశారన్న కేంద్రమంత్రి



నేషనల్ హైవేస్ అథారిటీస్ ఆఫ్ ఇండియా, రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ అత్యంత అరుదైన ఘనతను సాధించాయి. బెంగళూరు - విజయవాడ హైవే నిర్మాణంలో 4 గిన్నిస్ రికార్డులు నెలకొల్పాయి. ఎన్‌హెచ్ఏఐ, రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ ఆధ్వర్యంలో 6 రోజుల్లోనే 156 కిలోమీటర్ల రహదారి నిర్మాణం జరిగింది. జనవరి 6న 24 గంటల్లోనే 28.8 కిలోమీటర్ల రహదారి నిర్మాణం జరిగింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. నేషనల్ హైవేస్ అథారిటీస్ ఆఫ్ ఇండియా, రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్‌లపై ప్రశంసలు కురిపించారు.

ఎన్‌హెచ్ఏఐ, రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ సాధించిన రికార్డులపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ.. 'మన ఇంజినీర్లు, అధికారులు అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. విజయం సాధించడంలో కృషిచేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు. నూతన సాంకే తికతతో నాణ్యమైన రహదారుల నిర్మాణం జరగడం గొప్ప విషయం. తక్కువ సమయంలో వేగంగా రహదారుల నిర్మాణం పూర్తిచేశారు. నాణ్యత విషయంలో రాజీలేకుండా రోడ్ల నిర్మాణం జరుగుతోంది' అని అన్నారు.

చురకలు

## సంపాదకీయం

# ఫలితం అనుభవిస్తున్న టర్కీ..!

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ – పాక్ మధ్య ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగిన సమయంలో.. ఉగ్రవాదులు చేసిన పనిని ప్రపంచ దేశాలు ఖండించాయి. ఉగ్రవాదాన్ని అంతం చేసే విషయంలో భారత్ కు తమ మద్దతును ప్రకటించాయి. అలాంటి పరిస్థితుల నేపథ్యంలో అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో భారత సహాయం పొందిన ఓ దేశం మాత్రం పాక్ కు సహకరించింది. తాజాగా ఆ ప్రతిఫలం అనుభవించిన విషయం తెరపైకి వచ్చింది. అవును... పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ వేళ టర్కీ, అజర్ బైజన్ దేశాలు పాకిస్థాన్ కు మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో.. ఆ దేశాల పర్యాటక రంగంపై గట్టిగా ప్రతికూల ప్రభావం పడింది. ఇందులో భాగంగా... భారత్ నుంచి ఆయా దేశాలకు వెళ్లే పర్యటకుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఈ నేపథ్యంలో వెలుగులోకి వచ్చిన తాజా గణాంకాలు ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే... కొన్నేళ్ల నుంచి అటు టర్కీ, ఇటు అజర్ బైజన్ దేశాలు భారత్ లో భారీ ప్రచారం చేసి పర్యటకులను పెద్ద ఎత్తున ఆకర్షించాయి. దీంతో పెద్ద సంఖ్యలో భారతీయులు అక్కడికి వెళ్లడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఆ దేశాల ప్రభుత్వ టూరిజం బోర్డులు భారత మార్కెట్ ను కీలకంగా గుర్తించాయి. ఈ క్రమంలో... ఈ క్రమంలో పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఆ కీలక సమయంలో టర్కీ, అజర్ బైజన్ లు బహిరంగంగానే పాకిస్థాన్ కు మద్దతు తెలిపాయి. దీంతో.. మే నెల నుంచే ఈ రెండు దేశాలకు బుకింగ్స్ ను పర్యటకులు రద్దు చేసుకున్నారు. ఈ సమయంలో... భారత్ కు చెందిన ట్రావెల్ సర్వీస్ ప్రొవైడర్లు కూడా ఈ దేశాలకు బుకింగ్స్ ను నిలిపేసి నిరసన వ్యక్తం చేశారు. అవసరమైతేనే ఆ దేశాలకు ప్రయాణం చేయాలని పర్యటకులకు బుక్కింగ్ సంస్థలు సూచనలు కూడా చేశాయి. దీంతో... అప్పటి వరకూ అజర్ బైజన్ కు వెళ్లే భారతీయుల సంఖ్య ఏటా 33 శాతం వృద్ధి చెందుతూ రాగా.. మే నెల తర్వాత తర్వాత నాలుగు నెలల్లో ఒక్కసారిగా 56 శాతం పతనమైంది. సాధారణంగా ఆ నాలుగు నెలల్లో లక్ష వరకు ఉండాల్సిన పర్యటకుల సంఖ్య 44 వేలకు పడిపోయింది. ఆపరేషన్ సిందూర్ కు ముందు నాలుగు నెలల్లో ఆ దేశానికి 81 వేల మంది భారతీయులు వెళ్లారు. ఇక టర్కీ విషయానికొస్తే... మే నుంచి ఆగస్టు వరకు టర్కీకి వెళ్లే భారతీయుల సంఖ్య మూడో వంతు తగ్గింది. ఈ సీజన్ లో గతేడాది 1.36లక్షల మంది ఆ దేశాన్ని సందర్శించగా.. ఈ సారి ఆ సంఖ్య 90,400కు పరిమితమైంది. ముందు ముందు ఈ ప్రభావం మరింతగా ఉండొచ్చని అంటున్నారు.

**'దోస్తే' మేలు మరిచిన టర్కీ!:** 2023 ఫిబ్రవరి 6న భూకంపవల్ల సిరియాతో పాటు టర్కీ అతలాకుతలం అయ్యింది. ఈ సమయంలో ప్రపంచంలోని అన్ని దేశాల కంటే ముందుగా భారత్ స్పందించింది. టర్కీకి ఆపన్న హస్తం అందించింది. ఆ సమయంలో టర్కీకి భారత ప్రధాని మోడీ సంఘీభావం తెలిపారు. టర్కీ ప్రజలకు భారత్ మద్దతుగా నిలుస్తుందని చెబుతూ.. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. అనంతరం... టర్కీకి సహాయం చేయడానికి భారత్ "ఆపరేషన్ దోస్త్"ను ప్రారంభించింది. ఈ సమయంలో... టర్కీకి తక్షణం సహాయ చర్యలు ఏమి అందించాలనే విషయాన్ని నిర్ణయించడానికి ప్రధాని మోడీ సంబంధిత శాఖలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమయంలో 8,45,590 డాలర్ల సహాయ సామాగ్రిని పంపించారు. ఈ సందర్భంగా స్పందించిన టర్కీ రాయబారి ఫిరత్ సునేల్... భారత్ కు కృతజ్ఞతలు తెలిపారు. అవసరంలో నిలబడిన స్నేహితుడే నిజంగా స్నేహితుడని చెప్పుకొచ్చాడు. ఢిల్లీకి ధన్యవాదాలు తెలిపారు. కట్ చేస్తే... ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ కు మద్దతు తెలిపి భారత్ కు వెన్నుపోటు పొడిచే పనికి పూనుకుంది. ఇప్పుడు అనుభవిస్తుంది!

# తెలుగు సాహిత్య చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం అద్దేపల్లి - జనవరి 13.. అద్దేపల్లి రామమోహనరావు వర్ధంతి



అద్దేపల్లి రామమోహనరావు తెలుగు సాహిత్య చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం పొందిన కవి, విమర్శకుడు, ప్రజాస్వామ్య భావజాలాల కోసం పోరాడిన వ్యక్తి. విప్లవ సాహిత్య క్షేత్రంలో ఆయన చూపిన దారిలో నేటికీ అనేక రచయితలు తమ కవిత్వం, రచనల ద్వారా ముందుకు సాగుతున్నారు.

**జీవిత విశేషాలు...** అద్దేపల్లి రామమోహనరావు1936 సెప్టెంబర్ 6న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా, చింతగుంటపాలెం గ్రామంలో జన్మించారు. పేదరికంలో పెరిగినా, విద్యా అభ్యాసం ద్వారా తన జీవితాన్ని మార్చుకున్నారు. తన మాతృభాష తెలుగు పట్ల గల ప్రేమను చిన్ననాటి నుంచే ప్రదర్శించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతిలో ఎం.ఏ. (తెలుగు) పూర్తి చేశారు. విద్యా రంగంలో కాకినాడ ఎంఎస్ఎన్ చారిటీస్ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయుడిగా, తర్వాత ప్రొఫెసర్‌గా సేవలందించారు.

**సాహిత్య జీవితం...** అద్దేపల్లి రామమోహనరావు విప్లవ సాహిత్య క్షేత్రంలో ఒక మార్గదర్శకుడిగా నిలిచారు. తెలుగు సాహిత్య రంగంలో విప్లవ కవిత్వాన్ని ప్రోత్సహించి, ప్రజల కష్టాలు, అణచివేత, అసమానతలను అక్షర రూపంలో ప్రతిబింబించారు. విప్లవ కవిత్వంలో ప్రముఖులు అయిన ఆవంత్స సోమసుందర్, చెరబండ రాజు, నగ్నముని, కె. శివారెడ్డి వంటి వారి రచనల ప్రభావంతో, ఆయన సాహిత్య రంగానికి ప్రేరణ పొందారు. తెలుగులో మినీ కవితా ప్రక్రియ (హైకూ) ను ప్రవేశపెట్టిన ప్రముఖ కవుల్లో ఆయన ఒకరు.

**విప్లవ కవిత్వం...** విప్లవ కవిత్వంలో అద్దేపల్లి రామమోహనరావు రచనలు సామాజిక సమస్యలపై అవగాహన కలిగించడమే కాకుండా, మార్పు కోసం ప్రజలను ప్రేరేపించాయి. సమాజంలోని అసమానతలు: పేదరికం, అణచివేత, మరియు వివక్షత వంటి సమస్యలను తన కవిత్వంలో ఎండగొట్టారు. మార్క్సిస్ట్ ఆలోచనలు: ఆయన కవిత్వం మార్క్సిస్ట్ భావజాలంతో నిండి ఉండేది. సమానత్వం, శ్రామిక వర్గ విముక్తి కోసం ఆయన పాడిన పాటలు ప్రజలను చైతన్యవంతులను చేశాయి. ప్రజా భావన: ఆయన రచనలు ప్రజల గళాన్ని ప్రతిఫలింపజేశాయి. అద్దేపల్లి రామమోహనరావు కేవలం కవి మాత్రమే కాదు, తెలుగు సాహిత్యంలో ఒక ప్రముఖ విమర్శకుడిగా కూడా ప్రసిద్ధి చెందారు. ఆయన విమర్శలు సాహిత్యానికి ఒక కొత్త దిశను చూపించాయి. తెలుగులో హైకూ కవిత్వం, అనుశీలన – ఒక పరామర్శ పేరుతో తెలుగు హైకూ కవిత్వంపై మొట్టమొదటి విమర్శాత్మక గ్రంథన్ని రాశారు. సాహిత్య విమర్శ విషయంలో ఆయన పరిశీలనా శైలి లోతైనది, సాధికారికమైనది.

**ప్రచురణలు, రచనలు...** అద్దేపల్లి రామమోహనరావు గారు అనేక కవితా సంపుటాలు, విమర్శ గ్రంథలు, మరియు వ్యాసాలు రచించారు.

**ముఖ్య రచనలు:** తెలుగులో హైకూ కవిత్వం, సాహిత్య వివేకం, తెలుగు తేజం, అనేక ప్రజాకవిత్వ సంపుటాలు.

**అవార్డులు...** ఆయన రచనలు తెలుగు సాహిత్యంపై ప్రత్యేక ముద్ర వేసినందుకు అనేక గుర్తింపులు పొందాయి. తెలుగు సాహిత్య రత్న బిరుదు. అనేక సాహిత్య సంస్థల నుండి ప్రశంసలు, పురస్కారాలు పొందారు. విప్లవ సాహిత్యంలో ఆయన చేసిన కృషి ఎందరికో ఆదర్శంగా నిలిచింది. అద్దేపల్లి రామమోహనరావు 2016 జనవరి 13న కన్నుమూశారు. ఆయన మరణం తెలుగు సాహిత్యానికి తీరని లోటు. కానీ ఆయన రచనలు, విమర్శలు, కవిత్వం నేటికీ స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. విప్లవ భావజాలాన్ని కొనసాగించే రచయితలలో ఆయన పేరు చిరస్థాయిగా నిలుస్తుంది. ఆయన రచనల ద్వారా సాహిత్య ప్రేమికులు తెలుగు భాషా వైభవాన్ని స్మరించు కుంటున్నారు. అద్దేపల్లి రామమోహనరావు తెలుగు సాహిత్య చరిత్రలో ఒక చిరస్థాయి అధ్యాయం. విప్లవ భావజాలానికి, ప్రజల కష్టాలకు అక్షరరూపం ఇచ్చిన ఆయన రచనలు తెలుగు భాషాభిమానుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతాయి. భవిష్యత్తు తరాలకు ఆయన రచనలు మార్గదర్శకంగా ఉంటాయి. తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవలను ఈ తరం, రాబోయే తరాలు చిరస్థాయిగా గుర్తుంచు కుంటాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595495**

# అంగ రంగ వైభవంగా శ్రీశైల బ్రహ్మోత్సవాలు - 12వ తేదీ నుండి 18 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి





ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైల మల్లికార్జున స్వామి క్షేత్రంలో సంక్రాంతి ఉత్సవాలు ప్రారంభం అయినాయి. దట్టమైన నల్లమల అడవుల్లో, కృష్ణానది ఒడ్డున.. జ్యోతిర్లింగం, శక్తిపీఠం ఒకేచోట వెలసిన భూలోకకైలాసమే శ్రీశైలం. ఇక్కడ పరమేశ్వరుడు ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన మల్లికార్జున లింగం రూపంలో కొలువైతే, పార్వతీదేవి అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన భ్రమరాంబికా దేవిగా దర్శనమిస్తోంది. భూలోక కైలాసంగా గుర్తింపు పొందిన శ్రీక్షేత్రంలో ఏడాదికి రెండుసార్లు బ్రహ్మోత్సవాలను... మొదటి ఉత్సవాలను సంక్రాంతి సమయంలో... రెండోసారి మాఘమాసంలో వచ్చే మహాశివరాత్రి సమయంలో నిర్వహిస్తారు. సంక్రాంతి బ్రహ్మోత్సవాలను పంచాహ్నిక దీక్షలతో 7 రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు 12న ప్రాంభమై, 18 తో ముగుస్తాయి. తెలుగు నేలపై కొలువైన దివ్యక్షేత్రం శ్రీశైలం. జ్యోతిర్లింగం, శక్తి పీఠం ఒకే గిరి శృంగం మీద వెలసిన పరమ పవిత్ర స్థలంగా భాసిల్లుతున్న క్షేత్రం. పన్నెండు జ్యోతిర్లింగాలలో రెండవది, శ్రీభ్రమరాంబా దేవికి నెలవైన శక్తిపీఠం. శైవక్షేత్రాల్లో తలమానికం. మల్లికార్జున మహాలింగ చక్రవర్తి కొలువై ఉండి, సకల లోకారాధ్యంగా, త్రైలోక్య పూజితంగా విరాజిల్లుతున్నది. సంకల్ప, పూజా సందర్భాలలో శ్రీశైలానికి ఏ దిగ్భాగంలో ఉన్నామో భగవంతునికి తెలియచేసుకునే సాంప్రదాయాన్ని బట్టి క్షేత్ర ప్రాధాన్యత స్పష్టం అవుతున్నది. పురాణాల్లో వర్ణితమైనఎనిమిది శృంగాలతో, నలభై నాలుగు నదులు, అరవై కోట్ల తీర్థరాజాలు, పరాశర, భరద్వాజాది మహర్షుల తపోవన సీమలతో, చంద్ర, సూర్య కుండాది పుష్కరిణులతో, లతలు, వృక్ష సంతతులు, అనేక లింగాలు, అద్భుత ఔషధాలు కలిగి శ్రీశైల మల్లన్న దేవుని సన్నిధికి చేర్చే దారి అత్యంత ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. బ్రహ్మగిరి, విష్ణుగిరి, రుద్రగిరి అనే మూడు పర్వతాలకు పాదాభివందనం చేస్తూ వేదఘోషను ప్రతిధ్వనింప చేస్తూ, పాతాళగంగ నామాంకిత అయిన కృష్ణవేణీ నది ఈ ప్రదేశంలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్నది. అష్టాదశ పురాణాల్లోనూ భారత రామాయణాది ఇతిహాసా ల్లోనూ శ్రీశైల వైభవం వర్ణించ బడింది. కృతయుగంలో హిరణ్య కశిపుడు శ్రీశైలాన్ని తన పూజా మందిరంగా చేసుకొన్నాడు. పురాణాల ప్రకారం సీతారాములు ప్రతిష్ఠించిన సహస్ర లింగాలు, పాండవులు భక్తితో స్థాపించిన సద్యోజాత లింగం, పంచపాండవ లింగాలు పూజార్హత కలిగి అలరారు తున్నాయి. సంస్కృత, ఆంధ్ర, కన్నడ, మరాఠీ గ్రంథల్లో ఈ క్షేత్రాన్ని గురించిన వర్ణనలున్నాయి. పలు భాషల కవులు క్షేత్ర ప్రాధాన్యతను అభివర్ణించారు. స్కాంద పురాణంలోని శ్రీశైల ఖండం, ఈ క్షేత్ర మహత్తును వివరిస్తోంది. ఈ క్షేత్ర ప్రశాంతతకు ముగ్ధులైన ఆది శంకరులు కొంత కాలం ఇక్కడ తపస్సు చేసి, శివానంద లహరిని రచించి, మల్లి కార్జునుడికి సమర్పించి, భ్రమరాంబ సన్నిధిలో శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారు. దత్తావతార పరంపరలో భక్తుల పూజలందుకొనే నృసింహ సరస్వతీ స్వామి శ్రీశైల మహత్యాన్ని వివరిస్తూ తన పాదుకల్ని పట్టుకొన్న తంతుడు అనే భక్తుడికి ఈ క్షేత్ర దర్శన భాగ్యాన్ని కలిగించినట్లు గురుచరిత్ర చెబుతోంది. నృసింహ సరస్వతి స్వామి ఇప్పటికీ కదలీవనంలో గుప్తరూపంలో ఉన్నట్లు దత్తాత్రేయ భక్తులు విశ్వసిస్తారు. శ్రీశైల క్షేత్రాన్ని దర్శించి ఇక్కడి మఠాలలో ఉన్న సాధకులు, యోగుల వసతి కోసం క్రీస్తుపూర్వం నుంచి అనేక రాజవంశాలు ఎన్నో దానాలను గావించినట్లు శిలాశాసనాలు, చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇక్ష్వాకులు, శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్లవులు, రాష్ట్ర కూటులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర సామ్రాజ్యాధీశులు, భ్రమరాంబికా సమేతులైన మల్లికార్జునుణ్ణి దర్శించి భక్తుల సౌకర్యాలకు ఎన్నో ఏర్పాట్లు, అశేష వస్తుసంపదలు సమర్పించారు. శ్రీశైలంలో పంచ మఠాలు ప్రాచీన మైనవి. మొదటిదైన ఘంటామఠం – శ్రీశైల ఆలయానికి వాయువ్య దిశగా ఉంది. శివ సాధకుడైన ఘంటాకర్ణ సిద్దేశ్వరుడు తన శిష్యులతో కలిసి దీనిని ఏర్పాటు చేశారు. రెండోదైన విభూతి మఠం, శ్రీకృష్ణ దేవరాయల కాలపు వీరశైవుడైన శాంతి మల్లయ్య అనే వ్యక్తి పేరు మీదుగా ఏర్పడినట్లు పరిశోధనలు వివరిస్తున్నాయి. మూడోదైన రుద్రాక్ష మఠాన్ని మల్లి శంకరస్వామి అనే భక్తుడు నిర్మించాడని తెలుస్తోంది. ఇక్కడికి వచ్చే భక్తులకు అతడు రుద్రాక్షలను పంచిపెడు తుండేవాడని స్థానికులు చెబుతుంటారు. నాలుగోదైన సారంగ మఠాన్ని సారంగేశ్వరముని నిర్మించాడని చరిత్ర చెబుతోంది. దీనికి సంబంధించిన లిఖిత ఆధారంగా క్రీ.శ.1585 నాటి శాసనం మఠంలో లభ్యమైంది. అయిదోదైన నంది మఠంలో నందికేశ్వరుడు అనే యోగి సుదీర్ఘకాలం జీవించాడు. ఇది ఘంటా మఠానికి వైపు ఉండేది. ఇవే కాకుండా శ్రీశైలంలో పలు మఠాలు ఉండేవి. వాటిలో వీరశైవ సిద్ధాంత భిక్షావృత్తి మఠం ప్రసిద్ధమైంది. క్రీ.శ. 1518లో దీనిని సిద్ధ భిక్షావృత్తి భార్య, శిష్యుడు పర్వతయ్యలు ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. దీనికి చాలాకాలం ముందే 3వ కుళోత్తుంగ చోళుడు ఒక మఠాన్ని క్రీ.శ. 1178–1216 మధ్య కాలంలో ఏర్పాటు చేసినట్టుగా చరిత్ర చెబుతోంది. వటసిద్ధి మఠం, చంద్రమఠం, కమరీ మఠం అనే మఠాలు భక్తులకు అన్నవసతి ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. ఇంకా అనేక మఠాలు పదహారో శతాబ్దికి పూర్వం నుంచే ఇక్కడ ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న శ్రీశైల క్షేత్రంలో శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం యాగశాల ప్రవేశంతో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయినాయి. పంచాహ్నికదీక్షతో ఏడురోజులపాటు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 18న ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని, ప్రధాన వీధులను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అలాగే బ్రహ్మోత్సవాలకు భక్తులకు స్వాగతం పలుకుతూ శ్రీశైలం ముఖద్వారం నుంచి శ్రీశైలం వరకు రహదారి మార్గంలో స్వాగతతోరణాలు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలలో రెండవ రోజు నుంచి స్వామి, అమ్మవార్లకు వాహన సేవలు నిర్వహిస్తారు. భృంగివాహనసేవ, రావణ వాహనసేవ, నంది వాహనసేవ, స్వామి, అమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం, కైలాస వాహనసేవ, యాగ పూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూల స్నానం, సదస్యం, నాగవల్లి, ధ్వజావరోణ కార్యక్రమాలు, 18వ తేదీన జరిగే పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవలతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఈ నెల 12నుంచి 18వరకు ఆర్జిత, ప్రత్యక్ష, పరోక్షసేవలైన రుద్రహోమం, చండీహోమం, మృత్యుంజయహోమం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, స్వామి, అమ్మవార్ల కల్యాణం, ఏకాంతసేవలను నిలిపి వేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాస రావు ఆధ్వర్యంలో, భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సంక్రాంతి ఉత్సవాలు జనవరి 12న ఉదయం స్వామివారి యాగశాల ప్రవేశంతో ప్రారంభం కానున్నాయి. 13వ తేదీ నుంచి మల్లన్న స్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు వివిధ వాహన సేవలు నిర్వహిస్తారు. భక్తులకు కనువిందు చేసేలా ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టనున్నారు. మకర సంక్రాంతి పర్వదినమైన 15వ తేదీన స్వామి, అమ్మవార్లకు బ్రహ్మోత్సవ కళ్యాణం నిర్వహిస్తారు. ఈ కళ్యాణ మహోత్సవానికి చెంచు గిరిజన భక్తులకు దేవస్థానం ప్రత్యేక ఆహ్వానం అందించింది. చెంచు సంప్రదాయాలను గౌరవిస్తూ, వారి సమక్షంలో కళ్యాణం జరగడం శ్రీశైల క్షేత్రంలో ప్రత్యేక ఘట్టంగా నిలవనుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహించే రుద్ర హోమం, చండీ హోమం, మృత్యుంజయ హోమం, గణపతి హోమం, చండీ--రుద్ర పారాయణం వంటి యాగాలు జనవరి 12 నుంచి 18 వరకు నిరంతరంగా జరుగుతాయి. అయితే, ఉత్సవాల కారణంగా ఈ కాలంలో ఉదయాస్తమాన సేవ, ప్రాతఃకాల సేవ, ప్రదోషకాల సేవ, ఏకాంత సేవలు, స్వామి--అమ్మవారి కళ్యాణం, ఇతర ఆర్జిత సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే, 12 నుంచి 18 వరకు రుద్ర, చండి, మృత్యుంజయ, గణపతి హోమాల కోసం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# చలనచిత్ర రంగంలో అపూర్వమైన నటీమణి అంజలీదేవి - జనవరి 13...అభినవ సీత అంజలీదేవి వర్ధంతి

తెలుగు చలనచిత్ర రంగంలో అంజలీదేవి ఒక అపూర్వమైన నటీమణి. "అభినవ సీత"గా పేరుగాంచిన ఆమె, తన అద్భుతమైన అభినయంతో ప్రేక్షకులను అలరించి, తెలుగు సినిమా రంగ సర్వతోముఖాభివృద్ధికి అమూల్యమైన కృషి చేశారు. ఆమె జీవితం, నటన ప్రతిభ తెలుగు సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతాయి. అంజలీదేవి అసలు పేరు అంజనీ కుమారి. 1927 ఆగస్టు 24న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తూర్పు గోదావరి జిల్లా, పెద్దాపురం గ్రామంలో జన్మించారు. చిన్నప్పటి నుంచే ఆమెకు నాటకం, కళలపై ప్రగాఢ ఆసక్తి ఉండేది. కుటుంబ సహకారం లేకపోయినా ఆమె కళారంగం పట్ల నిబద్ధతతో, రంగస్థలంలో చేరి తన నటనా ప్రతిభను కనబరిచారు. అంజలీదేవి చలనచిత్ర రంగంలో 1936లో రాజా హరిశ్చంద్రలో అంజలీదేవి చిన్న పాత్రతో పరిచయమైనా, అయితే ఆమెకు పేరును తెచ్చిన చిత్రం "భక్త తుకారాం". ఈ చిత్రంలో ఆమె నటన ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంది. ఆమె నటనలో సహజత్వం, భావోద్వేగాలు, రుచికరమైన శైలీ తదితర లక్షణాలు ఆమెను ప్రఖ్యాతిని అందించాయి. అంజలీదేవి ప్రధానంగా పురాణిక, చారిత్రక పాత్రల్లో మరింత మెరిసి పోయారు. "సీతారామ కళ్యాణం", "మాయా బజారు, "అనార్కలి", "సువర్ణ సుందరి", "భక్త ప్రహ్లాద", "చంద్రహారం" వంటి చిత్రాల్లో ఆమె చేసిన పాత్రలు ఇంకా గుర్తుండి పోతున్నాయి. "మాయాబజారు లో ఆమె చేసే నాటకీయ నటన ప్రేక్షకులను మంత్రగత్తెలా ఆకట్టుకుంది "సువర్ణ సుందరి" లో ఆమె గానం, నృత్యం మరియు నటనలో ప్రతిభను ప్రతిబింబించింది. "సీతారామ కళ్యాణం", లవకుశ చిత్రాలలో ఆమె సీత పాత్రను గాఢమైన భావోద్వేగాలతో పోషించి, "అభినవ సీత"గా గుర్తింపు పొందారు. అంజలీదేవి నటనతోనే కాకుండా నిర్మాతగా కూడా విజయ వంతంగా పని చేశారు. 1950ల మధ్య ఆమె స్థాపించిన "అంజలీ పిక్చర్సు బ్యానర్ ద్వారా "అనార్కలి", "సువర్ణ సుందరి", "భక్త తుకారాం" వంటి సినిమాలను నిర్మించారు. ఈ చిత్రాలు కేవలం ప్రేక్షకాదరణ పొందడమే కాకుండా ఆర్థిక విజయాన్ని కూడా సాధించాయి. అంజలీదేవి నటనలో సహజత్వం, హావభావాల సాఫీ అమలుబడి, భావోద్వేగపూరిత సంభాషణలు ఆమెను ప్రత్యేకంగా నిలిపాయి. ఆమె నటించిన పాత్రలు చాలా విభిన్నంగా ఉన్నాయి. ఆమె సాంప్రదాయ పాత్రలతో పాటు, సమకాలీన పాత్రల్లో కూడా అద్భుతంగా మెరిపించారు. నర్తకి గానూ, ఆమె చేసిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఆమె శాంత స్వభావం, సరళత, ఇతరులకు సహాయపడే ప్రవర్తన ఆమెకు మరింత గౌరవాన్ని తెచ్చి పెట్టాయి. అంజలీదేవి తన కెరీర్‌లో అనేక పురస్కారాలు పొందారు. ముఖ్యమైనవి రఘుపతి వెంకయ్య అవార్డు, నంది పురస్కారాలు, పద్మశ్రీ పురస్కారం (భారత ప్రభుత్వం). ఈ అవార్డులు ఆమె నటనలోని విశిష్టతను, తెలుగు చలనచిత్ర పరిశ్రమకు చేసిన అమూల్యమైన కృషిని గుర్తించే ప్రతీకలుగా నిలిచాయి. 2014 జనవరి 13న అంజలీదేవి మరణం తెలుగు సినీ పరిశ్రమలో ఒక అపూర్వమైన లోటును ఏర్పరచింది. కానీ ఆమె సినీ రంగంలో చేసిన సేవలు, నటనా ప్రతిభ తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిరకాలం నిలిచి పోతాయి. ఆమె మరణం తెలుగు సినిమా పరిశ్రమలో విషాదం తెచ్చినా, ఆమె సృష్టించిన చిత్రాలు ఇప్పటికీ ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నాయి. అంజలీదేవి తెలుగు చలనచిత్ర రంగానికి గొప్ప సేవలు అందించారు. ఆమె తన నటన, సంగీతం, నృత్యం, నిర్మాతగా చేసిన కృషి తదితర ప్రతిభలకు అజేయమైన గుర్తింపు సంపాదించింది. ఆమె సినీ జీవితాన్ని



పరిశీలిస్తే, ఆమె వ్యక్తిత్వం, శ్రద్ధ, గౌరవం, నిరంతర కృషి తెలుగు సినీ పరిశ్రమకు పునాదిగా నిలుస్తుంది. తెలుగు సినిమా చరిత్రలో అంజలీదేవి పేరు ఒక అద్భుతమైన అధ్యాయంగా నిలిచి పోతుంది. ఆమె నటన, పాత్రల ఎంపిక, నృత్య ప్రతిభ తదితర సేవలు తరువాతి తరాల నటీనటులకు స్ఫూర్తి. ఆమె పేరు తెలుగు ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచి ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

చురకలు



## చదువుల ముల్లె.. కొలువుల పల్లె

పెన్‌పహాడ్ : అది మారుమూల గ్రామం. పచ్చని పంట పొలాలతో ఆహ్లాదకరంగా ఉంటుంది. అన్నీ వ్యవసాయాధారిత కుటుంబాలే. సరైన వసతులు లేవు. అయితేనేం.. తల్లిదండ్రులు విద్యాప్రాముఖ్యతను గ్రహించి పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. వారు కష్టపడి చదివి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇప్పుడది కొలువుల పల్లెగా గుర్తింపు పొందింది. ఇదీ పెన్‌పహాడ్ మండలం రంగయ్యగూడెం ప్రత్యే'కథ'. ఇదీ లెక్క: గ్రామంలో 679 మంది జనాభా ఉండగా.. ప్రభుత్వ ఉపాధ్యాయులు, వైద్యాధికారులు, పోలీసు శాఖలో ఏఎస్పీ, సీఐ, ఎస్సై, పోలీసు సిబ్బంది, బ్యాంకు, ఐఆర్ఎస్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు 105 మంది ఉన్నారు. 60 మంది ప్రైవేటు కంపెనీల్లో కొలువులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.



కాలినడకన వెళ్లి: గతంలో బడి, రోడ్డు, బస్సు సౌకర్యం లేక సమీపంలోని తిరుమలగిరి, నేలమర్రి గ్రామాలకు నడిచివెళ్లి పదో తరగతి వరకు చదివారు. పట్టణాల్లోని కళాశాలల్లో ఉన్నత విద్యనభ్యసించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు.

**కొలువులు సాధించి:** 1973లో తొలుత తొగరు సీతారాములు డిగ్రీ చదివి గ్రామాభివృద్ధి అధికారిగా చేరారు. ఆయన సోదరుడు తొగరు రంగయ్య ఓయూలో పీజీ చదివి గ్రూప్–2లో డీటీగా ఎంపికయ్యారు. వీరి అడుగు జాడల్లోనే తొగరు కరుణాకర్ ఉన్నత చదువు అభ్యసించి పోలీసుశాఖలో ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని గ్రామ యువకులు పట్టుదలతో చదువుకొని కొలువులు సాధిస్తూ ఆదర్శంగా నిలిచారు.

ఇదీ ఆకాంక్ష: 1975లో ఇక్కడ రెండో తరగతి వరకే ఉండగా ఐదో తరగతి వరకు పాఠశాల స్థాయి పెంచారు. ఆపై చదువులకు సమీప భక్తళాపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్తున్నారు. ఇక్కడ జడ్పీహెచ్ పాఠశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## నేత.. గుట్టల మేత

భువనగిరి : ప్రజాపాలన చేయాల్సిన రక్షకులే 'కంకర'భక్షకులుగా మారుతున్నారు.. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో ఓ 'ముఖ్య' నేత బినామీలతో సమీప గుట్టలను పిండి చేస్తున్నారు. గనులు, రెవెన్యూ, పంచాయతీ, పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి, పోలీస్ శాఖలు ఉన్నప్పటికి ఎవరూ ఇటువైపు కూడా కన్నెత్తి చూడటం లేదంటే అధికార బలం ఎంత పనిచేస్తుందో అర్థం చేసుకోవచ్చు. సామర్థ్యానికి మించి టన్నుల కొద్దీ బండరాళ్లను, కంకర మిశ్రమాన్ని హైదరాబాద్‌లోని నిర్మాణ సంస్థలకు సరఫరా చేస్తూ రూ.కోట్లు పోగేస్తున్నారు.

**బినామీలతో దందా.. ప్రశ్నిస్తే దాదాగిరి**

రాజపేట మండలం చల్లూరు శివారు గుట్టల్లో ఓ 'ముఖ్య' నేత గుట్టలను పిండి చేస్తూ కంకరను వెంచర్లు, నిర్మాణ సంస్థలకు తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. గ్రామపంచాయతీ, తహసీల్దార్ కార్యాలయాల్లో, విద్యుత్తు సంస్థలలో ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి, భూగర్భ గనుల శాఖల నుంచి గతంలో తీసుకున్న అనుమతులనే అనధికారికంగా కొనసాగిస్తుండటం గమనార్హం. స్థానికులు, యువత ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాదాగిరి చేసి అక్రమ పోలీస్ కేసులు బనాయిస్తున్నట్లు కొందరు స్థానికులు 'ఈనాడు'కు తెలిపారు.

భువనగిరి నియోజకవర్గంలో రైల్వేస్టేషన్ వెనుక గుట్టల్లో యంత్రాలతో తవ్వుతున్నారు. భువనగిరి–హుస్నాబాద్ రహదారి మార్గంలో ఉన్న గుట్టలపై నిత్యం పొక్లెయిన్‌లతో పనులు చేయిస్తున్నారు. భువనగిరి–వరంగల్–హైదరాబాద్ రహదారికి ఆనుకుని గుట్టలను జిలెటిన్ స్టిక్స్‌తో పేల్చివేస్తుండటమే కాకుండా అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు టిప్పర్లలో కంకర అక్రమ రవాణా చేస్తున్నారు.

నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి గతంలో వివిధ శాఖలు ఇచ్చిన అనుమతులనే ఫోర్జరీ చేసి తేదీలు మార్చి దొంగ పత్రాలు సిద్ధం చేసుకుని అక్రమ దందా చేస్తున్నారు.

**విచారణ చేసి చర్యలు తీసుకుంటాం**

రవికుమార్, జిల్లా భూగర్భగనులశాఖ అధికారి

చల్లూరు కంకర క్రషర్‌పై గతంలో ఫిర్యాదులు వస్తే విద్యుత్తు సరఫరా నిలిపివేసి తరలింపు అనుమతులు రద్దు చేశాం. మళ్లీ రవాణా చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. భువనగిరి పట్టణం నుంచి హైదరాబాద్, వరంగల్, హుస్నాబాద్‌కు వెళ్లే మార్గాల్లో ఉన్న గుట్టలపై కొందరు నిర్వాహకులు గతంలో తీసుకున్న అనుమతులతోనే తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. సిబ్బంది కొరత వల్ల క్షేత్రస్థాయి తనిఖీలు చేయలేదు. రెండు రోజుల్లో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. రవాణా, దుమ్ము, పర్యావరణపరంగా ఇబ్బందులు సంబంధిత శాఖలు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది.

## కాలుష్య పరిశ్రమలు అవుటర్ దాటేనా?

జిన్నారం: పారిశ్రామిక పాలసీ (హిల్ట్)పై ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన ప్రకటన.. పటాన్‌చెరు నియోజకవర్గంలో చర్చనీయాంశమయింది. హైదరాబాద్ మహానగరాన్ని విస్తరించే కార్యక్రమంలో భాగంగా అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) లోపల ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలికి తరలించటానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పటాన్‌చెరు నియోజకవర్గంలో పలు పారిశ్రామిక వాడలున్నాయి. హిల్ట్ పరిధిలోకి ఇస్నాపూర్, పటాన్‌చెరు, పాశమైలారంలను చేర్చారు. తమకూ అవకాశం కల్పించాలని ఐడీఏ బొల్లారం పారిశ్రామికవేత్తలు కోరుతున్నారు. ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేశారు. తాజాగా ఉపముఖ్యమంత్రి ప్రకటనతో పరిశ్రమల తరలింపు వ్యవహారం చర్చనీయాంశమైంది.

భవిష్యత్తులో సమస్యలు లేకుండా..

హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ(హిల్ట్) పరిధికి పారిశ్రామికవాడలను తేవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నూతన విధానానికి తెరతీసింది. ఇందులో భాగంగా ముందుగా కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు పంపాలనే ఆలోచనతో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 పారిశ్రామికవాడలను హిల్ట్ పరిధిలో చేర్చగా.. పటాన్‌చెరు నియోజకవర్గంలోనివి ఐదు ఉన్నాయి. నగరానికి భవిష్యత్తులో కాలుష్య సమస్య లేకుండా చేయాలనే ప్రభుత్వం ఓఆర్ఆర్ లోపల ఉన్న ఉన్న పరిశ్రమలను తరలించే యోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పాలసీలో 40 ఏళ్ల చరిత్ర ఉన్న ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడ లేకపోవడంపై యజమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రసాయన పరిశ్రమలను ఓఆర్ఆర్ ఆవలికి తరలిస్తే.. ఆయా ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలు నిర్మించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

పటాన్‌చెరు పరిధిలో కాలుష్య కారక పరిశ్రమలు: 265

ఈ నియోజకవర్గంలో కాలుష్యమయమైన చెరువులు: 45

వాయు కాలుష్య ప్రభావ యూనిట్లు: 172

ఓఆర్ఆర్ లోపల పారిశ్రామిక వాడలు: 5

పరిశ్రమల ప్రభావానికి గురవుతున్న పట్టణాలు: 15

కాలుష్యంపై పీసీబీకి నెల వారీగా సగటున అందుతున్న ఫిర్యాదులు: 320

# సగం మందికే 'నవోదయ'ం



కోరుట్ల : కార్పొరేట్‌కు దీటుగా అత్యున్నత ప్రమాణాలతో కూడిన బోధన అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కోరుట్లలో ఏర్పాటు చేసిన జవహర్ నవోదయ విద్యాలయం బాలారిష్టాలు దాటడం లేదు. ప్రస్తుత విద్యాసంవత్సరం(2025–26)లో పట్టణానికి నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేయగా ఆరు నెలలు దాటినా శాశ్వత భవనం దిశగా ముందడుగు పడలేదు.

**వచ్చే ఏడాదీ ఇదే పరిస్థితి!**

నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఇంటర్మీడియట్(ప్లస్ టూ) వరకు సీబీఎస్ఈ సిలబస్‌తో కూడిన విద్యనందిస్తారు. గతేడాది మార్చిలో చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన జగిత్యాల జిల్లాకు చెందిన వారికి కోరుట్లలో అవకాశం కల్పించారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 6వ తరగతిలో మొత్తం 80 సీట్లు భర్తీ చేయాల్సి ఉండగా శాశ్వత భవనం, వసతులు లేకపోవడంతో 40 సీట్లకు మాత్రమే విద్యార్థులను తీసుకున్నారు.

వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశాలకు డిసెంబరు 13న ప్రవేశ పరీక్ష నిర్వహించగా మార్చిలో ఫలితాలు విడుదల చేయనున్నారు. ఇప్పటివరకు భవన నిర్మాణం ప్రారంభించకపోవడంతో 2026–27లోనూ 40 సీట్లను మాత్రమే భర్తీ చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సమీకృత వసతి గృహంలో నిర్వహణ కోరుట్ల జవహర్ నవోదయ విద్యాలయాన్ని తాత్కాలికంగా పట్టణంలోని సమీకృత వసతిగృహ భవనంలో నిర్వహిస్తున్నారు. ఇందులో మొత్తం 22 గదులున్నాయి. గతేడాది ఆగస్టు 15న పాఠశాలను ప్రారంభించి బోధన అందిస్తున్నారు. ఇందులోనే విద్యార్థులకు వసతిగృహం ఏర్పాటు చేశారు. అయిదుగురు ఉపాధ్యాయులు, ముగ్గురు బోధనేతర సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

కేటాయింపు ఉత్తర్వుల్లో జాప్యం

నిబంధనల మేరకు నవోదయ విద్యాలయం మంజూరు కావాలంటే 30 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని చూపించాల్సి ఉంటుంది. ఈ మేరకు పట్టణ శివారులోని సంగెం రోడ్డు(జంబిగద్దె ప్రాంతం) వద్దనున్న ప్రభుత్వ స్థలంలో 23 ఎకరాలను కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించగా నాలుగు నెలల గడుస్తున్నా ఇప్పటివరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయకుండా తీవ్ర జాప్యం చేస్తోంది. ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయి అనుమతులు వస్తే దిల్లీలోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రధాన కార్యాలయానికి నివేదిస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా పాఠశాలకు శాశ్వత భవనం, వసతిగృహం, ఇతర నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి పనులు చేపడతారు. శాశ్వత భవన నిర్మాణాలు పూర్తయితేనే 6వ తరగతిలో మొత్తం 80 సీట్లను భర్తీ చేసే వీలుంటుందని అధికారులు తెలిపారు.

# సంక్రాంతికి 'సాఫీగా వెళ్లేలా'..!



సూర్యాపేట : సంక్రాంతి సమీపిస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లా మీదుగా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు భారీ సంఖ్యలో వాహనాలు వెళ్లే అవకాశం ఉంది. టోల్ గేట్లు, జాతీయ రహదారిపై వంతెనల నిర్మాణం తదితరాలతో ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు ప్రణాళికలను రూపొందించారు.

**ట్రాఫిక్ డైవర్షన్లు ఇలా..**

హైదరాబాద్ నుంచి గుంటూరు వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి వద్ద నల్గొండ, మిర్యాలగూడ, పిగుడురాళ్ల మీదుగా దారి మళ్లిస్తారు.

రాజమండ్రి–విశాఖపట్నం: నకిరేకల్ మీదుగా అర్వపల్లి, మరిపెడ బంగ్లా, ఖమ్మం మీదుగా మళ్లిస్తారు. అక్కడ సమస్య ఉంటే టేకుమట్ల నుంచి ఖమ్మం జాతీయరహదారి మీదుగా రాజమండ్రి వైపునకు పంపిస్తారు.

హైదరాబాద్–విజయవాడ: టేకుమట్ల డైవర్షన్‌ను ఎత్తివేయనున్నారు. టేకుమట్ల నుంచి ఖమ్మం జాతీయ రహదారికి వెళ్లి యూ టర్న్ తీసుకొని తిరిగి సూర్యాపేట వైపునకు రావల్సి ఉండగా.. జాతీయ రహదారిపై సరాసరి వాహనాలు వచ్చే విధంగా తాత్కాలిక రహదారిని నిర్మించారు.

ఖమ్మం–హైదరాబాద్: రాయినిగూడెం వైపునకు వచ్చి యూటర్న్ తీసుకోవల్సి ఉండగా.. చివ్వెంల, ఐలాపురం వద్ద దారి మళ్లించి సూర్యాపేట మీదుగా సరాసరి హైదరాబాద్ వెళ్లే విధంగా ప్రణాళికలను రూపొందించారు.

డ్రోన్ కెమెరాతో నిఘా: సూర్యాపేట జిల్లా పోలీసులు ఈ ఏడాది జాతీయ రహదారిపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయనున్నారు. ఎక్కడైనా వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోతే..వెంటనే తగిన చర్యలు చేపడతారు. సూర్యాపేట గ్రామీణం, సూర్యాపేట, మునగాల, కోదాడ, కోదాడ గ్రామీణ సీఐల ఆధ్వర్యంలో పండగకు ముందు, ఆ తర్వాత ఐదేసి రోజులు సిబ్బంది నిరంతరం ట్రాఫిక్‌ను పర్యవేక్షించనున్నారు. క్రేన్లు, అంబులెన్సులు, టోయింగ్ వాహనాలను సిద్ధం చేశారు. నాలుగు హైవే పెట్రోలింగ్ వాహనాలు గస్తీ కొనసాగనుంది.

బ్లాక్ స్పాట్ల వద్ద..: జిల్లా వ్యాప్తంగా 24 బ్లాక్ స్పాట్లను గుర్తించారు. వీటితోపాటు ప్రమాదకర క్రాసింగ్‌ల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టారు. సీసీ టీవీ కెమెరాలను, సైన్ బోర్డులు, విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేశారు. వేగ నియంత్రికలను, బారికేడ్లను తొలగించారు. గుంతలు పడిన చోట మరమ్మతులు చేపట్టారు.

వేగ నియంత్రణ పాటించాలి

నరసింహ, ఎస్పీ, సూర్యాపేట

వాహనదారులకు తొందరపాటు సరికాదు. ప్రతి ఒక్కరూ వేగ నియంత్రణ పాటించాలి. సంక్రాంతిని ఆనందంగా జరుపుకొని తిరిగి సురక్షితంగా గమ్యస్థానం చేరేందుకు నిరంతరం పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశాం.

# శాండ్ 'బేజార్'..!



మిర్యాలగూడ : తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) నల్గొండ జిల్లా మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన శాండ్ బజార్‌లో ఇసుక అక్రమ తరలింపు దందాతో నెలరోజులుగా భారీగా ఇసుక నిల్వలు పేరుకుపోతున్నాయి. టీజీఎండీసీ ఆన్‌లైన్ యాప్‌లో ఇసుకను బుకింగ్ చేసుకుంటే సాధారణ వినియోగదారులకు టన్ను రూ.1,400, ఇందిరమ్మ ఇళ్లకు టన్ను రూ.1,000కి విక్రయిస్తున్నారు. దీనికి అదనంగా రవాణా ఛార్జీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. నకిరేకల్ నియోజకవర్గం వంగమర్తి నుంచి ఇసుకను భారీ వాహనాల్లో తరలించి ఇక్కడ నిల్వ చేస్తున్నారు. డిసెంబరు మొదటి వారం నుంచి మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని రావులపెంట రీచ్ తెరవడంతో ఇక్కడి ఇసుకను బుకింగ్ చేసుకుంటున్నారు. వాస్తవానికి ఇక్కడ పదుల సంఖ్యలోనే ఇసుక బుకింగ్ చేస్తుండగా అనధికారికంగా తక్కెళ్లపాడు, కామేపల్లి మూసీ పరీవాహక ప్రాంతాల నుంచి రాత్రి సమయాల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుక అక్రమ తరలింపు కారణంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన శాండ్ బజార్‌లో నెలరోజులుగా ఇసుక భారీగా పేరుకుపోయింది. ప్రస్తుతం 7500 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు పేరుకు పోగా చేసేది ఏం లేక టీజీఎండీసీ ఉన్నతాధికారులు గురువారం ఇసుక ధరలను తగ్గించారు. సాధారణంగా ఇసుక టన్నుకు రూ.1400 ఉండగా రూ.1300లకు, ఇందిరమ్మ ఇళ్లకు రూ.1,000 నుంచి రూ.900 తగ్గించారు. ఇకనైనా సంబంధిత పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు స్పందించి అక్రమ ఇసుక తరలింపును అడ్డుకొని శాండ్ బజార్ ఇసుక కొనుగోలు చేసేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. డిసెంబరు మొదటి వారం నుంచి ఇసుక బుకింగ్‌లు తగ్గిపోయాయని శాండ్ బజార్ ఇన్‌ఛార్జి కృష్ణారెడ్డికి తెలిపారు. ధరల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

## ప్రణ'మిల్లు'తున్నారా..?

సంగారెడ్డి : ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని పలు మిల్లుల్లో సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించారు. అయినా ఈ మిల్లుల యజమానులపై చర్యలు తీసుకోవడానికి అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గతంలో మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఓ మిల్లు నిర్వాహకుడు సీఎంఆర్ బకాయిపడితే ఆయనకు చెందిన స్థిర, చరాస్తులను వేలం వేసి రెవెన్యూ రికవరీ యాక్టు కింద రూ.47 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. తాజాగా వికారాబాద్ జిల్లా దోమ మండలానికి చెందిన రెండు మిల్లుల యజమాని ఎండీ సర్దార్ 2000 వేల మెట్రిక్ టన్నులకు సంబంధించి జరిమానాతో కలిసి రూ.7 కోట్ల వరకు బకాయిపడడంతో కేసు నమోదైంది.

**పరిస్థితి ఎలా ఉందంటే..**

2022–23 సీజన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో బియ్యం తీసుకోవడంపై అనిశ్చితి ఏర్పడింది. ఫలితంగా మెదక్ జిల్లాలో 72 రైసు మిల్లర్ల వద్ద భారీ స్థాయిలో ధాన్యం పేరుకుపోయింది. ప్రస్తుత ప్రభుత్వం చిక్కులు తొలగించేందుకు మిల్లర్ల వద్ద పేరుకుపోయిన ధాన్యాన్ని వేలం వేసింది. మెదక్ జిల్లా పరిధిలో 87.986 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి వేలం వేశారు. దక్కించుకున్న వ్యాపారులు టన్నుకు రూ.21,700ల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదిన్నర దాటినా చెల్లింపులు పూర్తిస్థాయిలో



జరగలేదు.నిల్వ ధాన్యానికి నగదు చెల్లించాలని మెదక్ జిల్లా పౌరసరఫరాల శాఖ పలుమార్లు నోటీసులు జారీచేసినా ససేమిరా అంటున్నారు. పైరవీలతో నగదు చెల్లించకుండానే ప్రతీ సీజన్‌కు ధాన్యం కేటాయింపులు చేసుకుంటూ తమ మిల్లులను యథవిధిగా నిర్వహిస్తున్నారు. కొందరు తమ మిల్లును లీజుకు ఇచ్చేసి వెళ్లిపోయారు. సంగారెడ్డి జిల్లాలో యాసంగి సీజన్ ప్రారంభానికి ముందు విజిలెన్స్ యంత్రాంగం జిల్లాలోని మూడు నుంచి నాలుగు మిల్లుల్లో తనిఖీలు చేయగా ధాన్యం విక్రయించినట్లు నిర్ధారణైంది. 2024–25 రబీ సీజన్‌కు సంబంధించి 32,792 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను మిల్లర్లు ఇవ్వాల్సి ఉంది. సిద్దిపేట జిల్లాలో యాసంగి సీజన్‌కు 10,534 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది.

**రాజకీయ ఒత్తిళ్లతో...**

గత మూడు నాలుగు సీజన్లుగా ఉమ్మడి జిల్లాలోని కొన్ని మిల్లులు సకాలంలో సీఎంఆర్ ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నా రాజకీయ కారణాలతో వాటి యజమానులపై చర్యలు తీసుకోవడం లేదని తెలిసింది. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో కేసులతోనే సరిపెట్టారు. రెవెన్యూ రికవరీ యాక్టు ప్రకారం ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతోపాటు చట్టపరంగా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. తమపై రాజకీయ నాయకుల ఒత్తిళ్లున్నట్లు అధికారులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సీఎంఆర్ ఇవ్వని మిల్లు యజమానులను బ్లాక్ లిస్టులో పెట్టడంతో ధాన్యం పంపిణీని నిలిపివేయాలి.

## పుర పీఠాలే లక్ష్యం.. పార్టీల సన్నద్ధం

సంగారెడ్డి: మున్సిపల్ ఎన్నికలు త్వరలోనే నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. పార్టీ గుర్తులతో జరిగే ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా నేతలు తమ పార్టీ జెండాను పుర పీఠాలపై ఎగురవేయాలనే లక్ష్యంతో వ్యూహాలు రచిస్తున్నాయి. ప్రధానంగా రాజధాని శివారులోని పటాన్‌చెరు నియోజకవర్గంలో ఐదు బల్దియాలు ఉండటంతో.. ఇక్కడ అన్ని పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి.

**పాగా వేసేందుకు 'హస్తం' నేతల కసరత్తు**

ఉమ్మడి జిల్లాలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సంగారెడ్డి, మెదక్, నారాయణఖేడ్, జహీరాబాద్, పటాన్‌చెరు, హుస్నాబాద్‌లలో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు ఎక్కువ సంఖ్యలో గెలుపొందారు. సిద్దిపేట, దుబ్బాక, నర్సాపూర్‌లలో భారాస మద్దతుదారులు ఆధిక్యం ప్రదర్శించారు. గజ్వేల్‌లో కాంగ్రెస్, భారాస మద్దతుదారులు పోటాపో టీగా గెలుపొందారు. ప్రస్తుతం ఎన్నికలు జరిగే 19 పురపాలికల్లో మెజారిటీ స్థానాలను దక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహాలను రచిస్తోంది. ఎమ్మెల్యేలతో పాటు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జులకు ముఖ్యమంత్రి ఎన్నికల బాధ్యతలను అప్పగించారు. వార్డుస్థానాలకు అభ్యర్థులను సర్వేల ప్రాతిపదికగా ఎంపిక చేసేందుకు అధిష్ఠానం కసరత్తు చేస్తోంది.

**పట్టు నిలుపుకొనేందుకు భారాస వ్యూహం**

ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని పురపాలికల్లో గెలుపొందేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక వ్యూహాలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పార్టీనేతల సేవలను వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యేలతో పాటు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జిలకు హరీశ్‌రావు దిశానిర్దేశం చేస్తున్నారు. ఒక్కో వార్డుకు ఇద్దరు ముఖ్య నేతలకు బాధ్యతలు అప్పగించి పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు అవసరమైన ప్రచారం చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇప్పటికే ముఖ్యనేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికలు జరిగే పురపాలికల్లో కేటీఆర్, హరీశ్‌రావు ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీనేతలు వెల్లడిస్తున్నారు.

**ఉనికి చాటుకునేందుకు భాజపా యత్నం** పురపోరులో ఉనికి చాటుకోవాలని భాజపా ప్రయత్నిస్తోంది. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డిలు ఇప్పటికే బల్దియాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి.. ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ పట్టణాల్లో మెజార్టీ స్థానాల్లో విజయం సాధించాలని ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

# ప్రతి 7 కిలోమీటర్లకు ఒక రేడియల్ రోడ్డు

హైదరాబాద్: మహానగరం చుట్టూ 158 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న అవుటర్ రింగ్ రోడ్డు...భవిష్యత్తులో రానున్న ప్రాంతీయ రింగ్ రోడ్డు(ట్రిపుల్ఆర్) అనుసంధానం కోసం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నగరం నుంచి ఓఆర్ఆర్‌ను పూర్తిగా అనుసంధానం చేయనున్నారు. రానున్న రోజుల్లో ఈ రెండు కీలక రహదారుల మధ్యే అభివృద్ధి ప్రాజెక్టులు రానుండటంతో మౌలిక వసతులు కల్పించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగానే తొలుత రోడ్డు నెట్‌వర్క్‌పై హెచ్ఎండీఏ దృష్టిపెట్టింది. ప్రస్తుతం అవుటర్ రింగ్ రోడ్డు మీదుగా 11 వరకు రాష్ట్ర, జాతీయ రహదారులు వెళుతున్నాయి. ఇవి ఓఆర్ఆర్, ప్రాంతీయ రింగ్ రోడ్డు దాటి వెళ్లనున్నాయి. ఇవే కాకుండా...ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ ప్రతి 7-8 కిలోమీటర్ల మధ్య ఒక్కో రేడియల్ రోడ్డు నిర్మించాలనేది ప్రణాళిక. వీటిని ట్రిపుల్ఆర్‌తో అనుసంధానం చేస్తారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12 నుంచి ఫిలింనగర్, ఐటీసీ కోహినూర్ మీదుగా శిల్పా లేఅవుట్ వరకు మొత్తం 9 కిలోమీటర్ల మేరకు ఎలివేటెడ్ స్టీల్ కారిడార్‌ను నిర్మిస్తున్నారు. ఇది ఓఆర్ఆర్‌కు అనుసంధానం అవుతుంది. దీనికి సంబంధించి డీపీఆర్ హెచ్ఎండీఏ సిద్ధం చేస్తోంది. 15 ఎకరాల వరకు రక్షణశాఖ, ప్రైవేటు భూములను సేకరించేందుకు సిద్ధమవుతోంది. ఇక ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ఆర్ వరకు అనుసంధానం కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నారు.



రావిర్యాల (ఎగ్జిట్ 13) నుంచి ఆమనగల్లు వరకు 41 కిలోమీటర్లకు ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు మొదలయ్యాయి. ఎల్ఎన్‌టీ, రిత్విక్ కంపెనీలు ఈ పనులు మొదలు పెట్టాయి.

శంషాబాద్ విమానాశ్రయం వర్ధమాన్ కళాశాల సమీపం నుంచి లగచర్ల వరకు మరో 81 కిలోమీటర్ల వరకు ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ఆర్ వరకు రహదారి నిర్మాణానికి హెచ్ఎండీఏ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇవి కాకుండా దశల వారీగా మరిన్ని రోడ్లు నగరం నుంచి ఓఆర్ఆర్ వరకు.. అక్కడి నుంచి ట్రిపుల్ఆర్ వరకు రానున్నాయి.

ఆ రెండింటి మధ్య..

షేక్‌పేట్‌నుంచి మణికొండ, మైహోం అవతార్, ఎంజీఐటీ వరకు 7 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి చేయనున్నారు. నానక్‌రాంగూడ-అవుటర్‌కు మరో రోడ్డును సైతం మరో రెండు లేన్లు విస్తరించేందుకు హెచ్ఎండీఏ ప్రణాళిక సిద్ధం చేసింది.

**భూ సేకరణ షురూ.. !**

అవుటర్ రింగ్ రోడ్డు నుంచి ప్రాంతీయ రింగ్ రోడ్డును అనుసంధానించే రెండో గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు ప్రణాళిక షురూ అయింది. దీనికి సంబంధించి భూ సేకరణ చేపట్టడానికి తాజాగా ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఓఆర్ఆర్ బుద్వేల్ సమీపం నుంచి జాతీయ రహదారి 167ను కలుపుతూ నాచారం వరకు మొత్తం 81 కిలోమీటర్ల పొడవుతో ఈ రేడియల్ రోడ్డును నాలుగు వరుసలు నిర్మించేందుకు హెచ్ఎండీఏ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా భూ సేకరణ కీలకం కావడంతో రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని మాచన్‌పల్లి ప్రాంతంలో 45.05 ఎకరాలు, కొందుర్గ్ మండలం ముట్పూర్‌లో 95.72 ఎకరాల భూమిని సేకరించనున్నారు. భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చి తర్వాత పరిహారం లెక్కించనున్నారు. ఇప్పటికే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమయ్యే భూమిని గుర్తించారు. ఇప్పటికే రావిర్యాల నుంచి ఆమన్‌గల్ వరకు ఫ్యూచర్‌సిటీ, ట్రిపుల్ఆర్‌ను కలుపుతూ 41 కిలోమీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. క్షేత్రస్థాయిలో పనులు కూడా ప్రారంభించారు.

# ప్రణ'మిల్లు'తున్నారా..?

సంగారెడ్డి : ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని పలు మిల్లుల్లో సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించారు. అయినా ఈ మిల్లుల యజమానులపై చర్యలు తీసుకోవడానికి అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గతంలో మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఓ మిల్లు నిర్వాహకుడు సీఎంఆర్ బకాయిపడితే ఆయనకు చెందిన స్థిర, చరాస్తులను వేలం వేసి రెవెన్యూ రికవరీ యాక్టు కింద రూ.47 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. తాజాగా వికారాబాద్ జిల్లా దోమ మండలానికి చెందిన రెండు మిల్లుల యజమాని ఎండీ సర్దార్ 2000 వేల మెట్రిక్ టన్నులకు సంబంధించి జరిమానాతో కలిసి రూ.7 కోట్ల వరకు బకాయిపడడంతో కేసు నమోదైంది.

**పరిస్థితి ఎలా ఉందంటే..**

2022-23 సీజన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో బియ్యం తీసుకోవడంపై అనిశ్చితి ఏర్పడింది. ఫలితంగా మెదక్ జిల్లాలో 72 రైసు మిల్లర్ల వద్ద భారీ స్థాయిలో ధాన్యం పేరుకుపోయింది. ప్రస్తుత ప్రభుత్వం చిక్కులు తొలగించేందుకు మిల్లర్ల వద్ద పేరుకుపోయిన ధాన్యాన్ని వేలం వేసింది. మెదక్ జిల్లా పరిధిలో 87.986 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి వేలం వేశారు. దక్కించుకున్న వ్యాపారులు టన్నుకు రూ.21,700ల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదిన్నర దాటినా చెల్లింపులు పూర్తిస్థాయిలో జరగలేదు.

నిల్వ ధాన్యానికి నగదు చెల్లించాలని మెదక్ జిల్లా పౌరసరఫరాల శాఖ పలుమార్లు నోటీసులు జారీచేసినా ససేమిరా అంటున్నారు. పైరవీలతో నగదు చెల్లించకుండానే ప్రతీ సీజన్‌కు ధాన్యం కేటాయింపులు చేసుకుంటూ తమ మిల్లులను యథవిధిగా నిర్వహిస్తున్నారు. కొందరు తమ మిల్లును లీజుకు ఇచ్చేసి వెళ్లిపోయారు.

సంగారెడ్డి జిల్లాలో యాసంగి సీజన్ ప్రారంభానికి ముందు విజిలెన్స్ యంత్రాంగం జిల్లాలోని మూడు నుంచి నాలుగు మిల్లుల్లో తనిఖీలు చేయగా ధాన్యం విక్రయించినట్లు నిర్ధారణైంది. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి 32,792 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను మిల్లర్లు ఇవ్వాల్సి ఉంది. సిద్దిపేట జిల్లాలో యాసంగి సీజన్‌కు 10,534 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది.

**రాజకీయ ఒత్తిళ్లతో...**

గత మూడు నాలుగు సీజన్లుగా ఉమ్మడి జిల్లాలోని కొన్ని మిల్లులు సకాలంలో సీఎంఆర్ ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నా రాజకీయ కారణాలతో వాటి యజమానులపై చర్యలు తీసుకోవడం లేదని తెలిసింది. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో కేసులతోనే సరిపెట్టారు. రెవెన్యూ రికవరీ యాక్టు ప్రకారం ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతోపాటు చట్టపరంగా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. తమపై రాజకీయ నాయకుల ఒత్తిళ్లున్నట్లు అధికారులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సీఎంఆర్ ఇవ్వని మిల్లు యజమానులను బ్లాక్ లిస్టులో పెట్టడంతో ధాన్యం పంపిణీని నిలిపివేయాలి.

| 2021-22లో సీఎంఆర్ బకాయిలు జిల్లా | మిల్లులు | బకాయిలు |
|---|---|---|
| మెదక్ | 13 | రూ.120 కోట్లు |
| సిద్దిపేట | 6 | రూ.56 కోట్లు |

# పుంజుకుంటున్న 'పందెం'




మంచిర్యాల : జిల్లాలో 2025 నుంచి ఇప్పటి వరకు..

కేసులు : 7 పట్టుకున్న నగదు : రూ. 25,000

పందెం కోళ్లు: 10 పట్టుబడిన వారు: 35 ఇటీవల భీమిని మండలం ఖర్జీ భీంపూర్ గ్రామ శివారులో కోడి పందెం స్థావరాలపై పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. పోటీలో పాల్గొన్న ఏడుగురిని, రెండు పందెం కోళ్లను పట్టుకున్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. గతేడాది కన్నెపల్లి మండలంలో బండి మధునయ్య పందెం కోడి కాళ్లకు కత్తులు కడుతుండగా, అది ఒక్కసారిగా ఎగిరి ఆయనపై దూకింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన ఆయన మృతువాతపడ్డారు.

క్రాంతి పండగ అంటే రంగవల్లులు.. పిండివంటలు.. గాలిపటాలే గుర్తుకొస్తాయి. కొందరు మాత్రం కోడి పందేల కోసం ఎదురు చూస్తుంటారు. ఈ సంస్కృతి ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా.. కొద్ది సంవత్సరాలుగా జిల్లాలో చాప కింద నీరులా విస్తరిస్తోంది. రూ.వందల్లో మొదలైన పందెం వేలల్లోకి చేరింది. పోలీసులు వీటిపై నిఘా ఉంచినా పండగ సమీపిస్తుండటంతో ఈ ఆట 'పుంజు'కుంటోంది.

జిల్లాలో ప్రాణహిత తీర ప్రాంతాలైన భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి, కోటపల్లి, జైపూర్, భీమారం, దండేపల్లి, లక్షట్టిపేట మండలాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారు. పాల్గొనే వారికి తప్ప మరో వ్యక్తికి ఆట ఎక్కడ ఆడుతున్నారో సమాచారం బయటకు తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. రోజుకో చోట ఆట ప్రాంతాలను మార్చుతున్నారు. పోటీల్లో కోడితో పాల్గొనడానికి రూ.500, వీక్షించేందుకు ప్రత్యేకంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. పోటీలకు వచ్చిన వారి చరవాణులను లోనికి అనుమతించడం లేదు. ఇప్పటికే పోటీలు ప్రారంభమయ్యాయి. సంక్రాంతి వరకు కొనసాగనున్నాయి. కొంతమంది ప్రత్యేక వాహనాల్లో పెద్దపల్లి జిల్లాతో పాటు మహారాష్ట్రలోని సిరోంచకు వెళ్లి పోటీల్లో పాల్గొంటున్నారు. **ఓడినా.. ధర అదరహో..**

పోటీల్లో తలపడే కోడి పుంజుల ధర ఒక్కొక్కటి రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు ఉంటోంది. వీటిని నెమలి, కాకీ, కెక్కర, రసంగి, సేతు, డేగ, అబ్రాస్, చిత్ర పేర్లతో పిలుస్తారు. ఒక్కో ఆటకు రూ.5 వేల నుంచి రూ.50 వేల వరకు పందెం కాస్తున్నారు. పోటీలో మృతి చెందిన కోళ్లను తినేందుకు చాలా మంది భోజన ప్రియులు ఇష్టపడుతుండటంతో వాటికీ రూ.వేలల్లో డిమాండ్ ఉంటోంది.

# ఆరు దాటితే అవస్థలే!



నిర్మల్ : ఏవైనా అవసరాల నిమిత్తం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కార్యాలయాలకు వచ్చే ప్రజలకు, వివిధ శాఖల పరిధిలో దూరప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు సైతం ఇది సమస్యాత్మకంగా మారుతోంది. పని త్వరగా పూర్తయితే పగటివేళలో ఎలాగోలా వెళ్లిపోవచ్చు. ఏమాత్రం ఆలస్యమైనా, సాయంత్రమైందంటే వాహనాలు దొరక్క ఇబ్బందికరంగా మారుతోంది.పట్టణానికి సుమారు నాలుగు కి.మీ.లకు పైగా దూరంలో ప్రభుత్వం అభివృద్ధి చేసిన రహదారి మార్గంలో నూతన కలెక్టరేట్ భవనం ఉంటుంది. దాదాపు అన్ని జిల్లా కార్యాలయాలు అక్కడే ఉండటంతో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నిత్యం వెళ్తుంటారు. సొంత వాహనాలున్న వారి సంగతి పక్కనపెడితే.. మహిళలు, సొంత వాహనాలు లేని వారికి ఇబ్బందులు తప్పటం లేదు. ఉద్యోగుల సౌలభ్యం కోసం ఉదయం, సాయంత్రం ఆర్టీసీ బస్సు నడుస్తున్నా.. అది అందరికీ పూర్తిస్థాయి ప్రయోజనం కల్పించలేకపోతోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించేవారు సాయంత్రం 4.30 గంటల్లోపు పనులు పూర్తిచేసుకోవాలి. అలాగైతేనే ఆ సమయంలో వచ్చే బస్సులో తిరిగెళ్లొచ్చు. కానీ, అన్నిచోట్లా ఇది సాధ్యం కాదు. బస్సు వెళ్లిపోయిం దంటే.. ఉద్యోగులు, సిబ్బంది నానాతంటాలు పడాల్సిందే. ఆటోలైతే ప్రత్యేకంగా వీరిని తీసుకెళ్లేందుకే వెళ్లడం, తిరిగొచ్చేటపుడు కిరాయిలు దొరకవన్న కారణంతో రూ.100కు పైగా వసూలు చేస్తున్నారు.

**అదొక్కటే ఆధారం**

ఉద్యోగుల సౌలభ్యం కోసం నిర్మల్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం ఒక్కో ట్రిప్పు బస్సు నడిపిస్తున్నారు. ఉదయం 10.15 గంటలకు, సాయంత్రం 4.30 గంటలకు ఇది వెళ్తుంది. సొంత వాహనాల్లేనివారు ఈ బస్సులో ప్రయాణిస్తున్నారు. ఉదయం 8.35 గంటలకు ఓ బస్సు నడుస్తున్నా, అది రెండు పడకగదుల ఇళ్ల ప్రాంతంలో ఉండే విద్యార్థుల సౌలభ్యం కోసం ఏర్పాటుచేశారు. ఆ బస్సు సమయం ఉద్యోగులకు ఏమాత్రం ఉపయోగపడదు.

# కోచ్ ఫ్యాక్టరీ ఉద్యోగాలపై కోటి ఆశలు



కాజీపేట : హనుమకొండ జిల్లా కాజీపేటలోని అయోధ్య పురంలో కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నిరుద్యోగులు నాలుగు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కోచ్ ఫ్యాక్టరీ కల త్వరలో సాకారం కానుంది. ప్రస్తుతం దీనిపై రైల్వే ఐకాస ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగుతోంది. ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయితే నిరుద్యోగులకు ఉపాధి లభించనుంది. ఈ క్రమంలో ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి, నియామకాలు ఎలా జరుగుతాయనే విషయంపై అందరిలో ఆసక్తి నెలకొంది.

**నియమకాలు ఎలా ఉంటాయి?**

కోచ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తే సుమారు 3 నుంచి 4 వేల ఉద్యోగుల అవసరం ఉంటుంది. ముందుగా ఇతర కోచ్‌ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న నిపుణులను ఇక్కడికి బదిలీ లేదా డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి స్థానిక ఉద్యోగులకు శిక్షణ ఇప్పిస్తారు. డిప్యుటేషన్‌పై వచ్చిన నిపుణులు కొన్నేళ్ల తర్వాత తిరిగి వారి ప్రాంతాలకు వెళ్లిపోతారు. ప్రధాన విభాగాలు కాకుండా పారిశుధ్యం, టెక్నికల్, సెక్యూరిటీ తదితర విభాగాలు మాత్రం ఇతర ప్రైవేటు పరిశ్రమల్లో మాదిరిగానే ఉంటాయి. లేదా రైల్వే.. ఒక సంస్థకు ఉత్పత్తి బాధ్యతలను అప్పగించే అవకాశాలు ఉన్నాయి. ఇలా జరిగితే పూర్తిగా స్థానికులకే ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. ఏప్రిల్ లేదా మే మాసంలో ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

**స్థానికులకు ప్రాధాన్యమివ్వాలని..**

కాజీపేటలోని అయోధ్యపురంలో 160 ఎకరాల్లో రూ.521 కోట్ల వ్యయంతో కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టారు. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు, మెమూ, మెట్రో రైళ్ల కోచ్‌లు, వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపులు ఉంటాయి. దీని నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. 1980లోనే కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ మంజూరైంది. భూమిని కూడా సర్వే చేశారు. నాడు పంజాబ్‌లో జరుగుతున్న ఆందోళనలను చల్లార్చి అక్కడి యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కాజీపేట ఫ్యాక్టరీని పంజాబ్‌లోని కపుర్తలకు తరలించారు. అక్కడి యువతకు 82 శాతం ఉద్యోగాలు కల్పించారు. ఆ తర్వాత రాయ్‌బరేలీలో నిర్మించిన కోచ్‌ఫ్యాక్టరీలో కూడా స్థానికులకు 50శాతం ఉద్యోగాలిచ్చారు. అక్కడి నిబంధనలనే ఇక్కడా అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిరుద్యోగుల కోసమే రైల్వేశాఖ కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టింది. కోచ్‌ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని ఉద్యమంగా తీసుకెళ్తున్నాం.

దేవులపల్లి రాఘవేందర్, రైల్వే ఐకాస కన్వీనర్

# గడువు ముగిసినా.. ఓసీ ఇస్తాం

హైదరాబాద్: నిర్ణీత గడువులోపు నివాసయోగ్యపత్రం(ఓసీ) పొందలేకపోయిన భవనాలకు ఉపశమనం కల్పిస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ.కర్ణన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. నిబంధనలను పాటించి ఇంటి నిర్మాణం చేపడితే.. ఆలస్యమైనా సరే ఓసీ జారీ చేద్దామని ఆయన నిర్ణయించారు. అందులో భాగంగా.. ఓసీ దరఖాస్తులను రెండు రకాలుగా విభజించి.. వాటికి గురువారం మార్గదర్శకాలు జారీ చేశారు. రెండు కేటగిరీల్లోనూ.. భవన నిర్మాణంలో ఉల్లంఘనలుగరిష్ఠంగా 10శాతం మాత్రమే ఉండాలని, 18మీటర్ల ఎత్తు వరకు అనుమతి తీసుకున్న భవనాలకు మాత్రమే వర్తించనుందని స్పష్టం చేశారు. **మార్గదర్శకాలు ఇలా..**నిర్మాణ అనుమతి గడువు ముగిసిన తేదీ నుంచి రెండేళ్లలోపు ఓసీ కోసం దరఖాస్తు చేసుకున్నట్లయితే.. పెండింగులోని నిర్మాణ అనుమతి రుసుము, లింకు రోడ్డు ఛార్జీలు, సీఆర్ఎంపీ ఫీజు, ఇతరత్రా రుసుములతో దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటారు. నిర్మాణ అనుమతి గడువు ముగిసిన తేదీ నుంచి రెండేళ్ల తర్వాత దరఖాస్తు చేసుకున్నట్లయితే.. దరఖాస్తు తేదీ నాటికి మొత్తం నిర్మిత విస్తీర్ణానికి వర్తించే అన్ని రుసుములు, ఛార్జీలు వసూలు చేస్తారు.

# అంకుర సంస్థలు.. పరిశోధనలు.. కృత్రిమ మేధ

హైదరాబాద్: అంకుర సంస్థలు... అభివృద్ధి.. పరిశోధన... కృత్రిమమేధ అంశాలే కీలకంగా జేఎన్‌టీయూ హైదరాబాద్ భవిష్యత్ నిర్దేశనం చేసుకుంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మార్గదర్శకాల మేరకు జేఎన్‌టీయూలో చదువుకుంటున్న ఇంజినీరింగ్ విద్యార్థులకు వారి చదువు పూర్తయ్యేలోపే విద్య, ఉపాధి అవకాశాలు సులువుగా లభించేలా కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు వచ్చే ఐదేళ్లకు సంస్థాగత ప్రణాళికను అధికారులు రూపొందించనున్నారు. దీన్ని సమగ్రంగా తయారు చేసేందుకు జేఎన్‌టీయూ కాకినాడ మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ తులసీ రామ్‌దాస్ మార్గదర్శకత్వం వహిస్తున్నారు. ఈ క్రమంలో జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కేవీరావు, ప్రిన్సిపల్ జీవీ నరసింహారెడ్డిలు ప్రణాళికలో



అంశాలను చర్చించారు. నిరంతర విద్యానైపుణ్యంతో విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు ప్రోత్సహించే పది కమిటీలను ఏర్పాటు చేశారు.

**వినూత్న ఆవిష్కరణలు.. పేటెంట్లు**

విద్యార్థులు, ఆచార్యులు కలిసి వినూత్న ఆవిష్కరణలను కనుగొనేలా వర్సిటీ క్యాంపస్‌లో అభివృద్ధి, పరిశోధన విభాగాలను బలోపేతం చేయనున్నారు. విద్యార్థుల ఆలోచనలను పరిశోధనలుగా మార్చి పరిశ్రమలు, ఇతరసంస్థలకు ఉపయుక్తంగా ఉంటే పేటెంట్లు లభించేలా వారికి ప్రోత్సాహం అందించనున్నారు.

**దీర్ఘకాలిక అభివృద్ధికి శ్రీకారం**

ఇంజినీరింగ్ విద్యార్థుల్లో 50నుంచి70% వరకూ సరైన ఉద్యోగాలు లభించడంలేదు. చదువుకున్న కోర్సుతో పాటు నైపుణ్యాలు విద్యార్థుల్లో ఉండాలంటూ పరిశ్రమలు, బహుళజాతి సంస్థలు ఆశిస్తున్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న అధికారులు దీర్ఘకాలిక అభివృద్ధికి సంస్థాగత అభివృద్ధి ప్రణాళికలను రూపొందించనున్నామని రిజిస్ట్రార్ ప్రొ. కేవీరావు తెలిపారు. 3,4నెలల్లో సమగ్ర, సమ్మిళిత కార్యాచరణ రూపొందిస్తామని, తెలంగాణ టెక్నాలజీ విజన్-2035, తెలంగాణ రైజింగ్-2047 దార్శనిక పత్రాలకు అనుగుణంగా తమ ప్రణాళిక ఉంటుందని వివరించారు.

# రహదారులు మెరుగు.. వాహనాల పరుగు!

పరిగి : దశాబ్దాలుగా నెలకొన్న సమస్యలు ఒక్కొక్కటిగా తీరుతున్నాయి. ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈక్రమంలోనే రవాణా సౌకర్యాలను మెరుగు పరుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో ప్రతి ఊరికి దాదాపు రెండు వరుసల రహదారి పనులు జరుగుతున్నాయి. పరిగి నియోజకవర్గంలో ప్రధాన రోడ్లు నాలుగు వరుసలుగా మార్చే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. షాద్‌నగర్, వికారాబాద్ మార్గంలోనూ పనులు ప్రారంభించారు. ఇవి అందుబాటులోకి వస్తే ప్రయాణం సజావుగా సాగడంతో పాటు ప్రజల కష్టాలు తీరనున్నాయి.

**రవాణా వసతులతోనే అభివృద్ధి: రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే**

రవాణా సౌకర్యాలను మెరుగు పరిస్తే గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయి. ఇందుకోసం జాతీయ రహదారులకు పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్లను అనుసంధానించాలని ప్రభుత్వాన్ని కోరాం. పరిగి -షాద్‌నగర్, పరిగి - వికారాబాద్ రోడ్లను నాలుగు వరుసలుగా మార్చుతున్నాం.

నిర్మాణంలో ఉన్న గడిసింగాపూర్

-రంగారెడ్డిపల్లి రోడ్డు

**ఇదిగో ఇలా**

పరిగి నియోజకవర్గంలో రోడ్లు, భవనాల శాఖ రహదారులు 14 ఉండగా 178 కిలోమీటర్ల దూరం ఉన్నాయి. మొత్తంగా బీటీ ఉండగా అక్కడక్కడా దెబ్బతిన్న వాటికి మరమ్మతు పనులు చేపట్టడంతో పాటు పునరుద్ధరణ పనులు చేపట్టారు.

పరిగి మండలం గడిసింగాపూర్ నుంచి మహబూబ్‌నగర్ జిల్లా రంగారెడ్డిపల్లి గ్రామాల మధ్య దూరం 26కిలోమీటర్లు. ఇందులో 16కిలోమీటర్ల దూరం వరకు సింగిల్ రోడ్డును రెండు వరుసలుగా మార్చుతున్నారు. ఇందుకోసం సుమారు రూ.80 కోట్లు వెచ్చిస్తున్నారు. పరిగి నుంచి రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మార్గంలో 15కి.మీ, పరిగి నుంచి వికారాబాద్ వరకు 18.2 కి.మీ దూరం ఈ రెండింటికి కలిపి రూ.240 కోట్లు కేటాయించారు. ఈ రోడ్లను నాలుగు వరుసలుగా మార్చుతున్నారు. శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు మరింత పెరిగేందుకు అవకాశముంది. పూడూరు మండలం కంకల్ -కొందుర్గు మండలం లాల్‌పహాడ్ రోడ్డును రూ.20కోట్ల వెచ్చించి రెండు వరుసలుగా మార్చుతున్నారు. దాదాపు 80శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.

పరిగి మండలంలోని ఇబ్రాహీంపూర్ వరకు ఉన్న ఐదు కిలోమీటర్ల రోడ్డు బీటీ దెబ్బతిని అస్తవ్యస్తంగా మారింది. ఇదే మార్గంలో అనేక గిరిజన తండాలున్నాయి. రవాణా వసతి లేకపోవడంతో నిత్యం వేలాది మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈరోడ్డును రూ.22 కోట్ల అంచనా వ్యయంతో మెరుగు పరచనున్నారు.

# పోరుకు సన్నద్ధం.. పనులు ముమ్మరం

జగిత్యాల : పురపాలిక ఎన్నికల కోసం ఓవైపు యంత్రాంగం ఏర్పాట్లలో తలమునకలవగా, జగిత్యాలలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. పట్టణంలోని కొత్తబస్టాండు కూడలి, గడియారం, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో పలు పనులకు ఇటీవల శాసనసభ్యుడు డా.సంజయ్‌కుమార్ భూమిపూజ చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 80 రోజుల సమయమే ఉండటంతో ఈలోగా పనులు పూర్తి చేసేలా ముమ్మరం చేశారు.

మూడు విడతల్లో..జగిత్యాల బల్దియా పరిధిలో వివిధ పనులు చేపట్టేందుకు 2019లో టీయూఎఫ్ఐడీసీ(తెలంగాణ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ) నుంచి రూ.75 కోట్లు మంజూరయ్యాయి. స్థానిక అవసరాలకు అనుగుణంగా మూడు విడతల్లో చేపట్టే పనులకు బల్దియా ఆమోదం తెలిపింది. ఇందులో సీసీ, బీటీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, జిల్లా గ్రంథలయం, మురుగుకాలువలు, శ్మశానవాటికలు తదితర నిర్మాణాలు చేపట్టారు. ఒక్కో విడతలో రూ.25 కోట్ల చొప్పున ఇప్పటికే రూ.50 కోట్ల పనులు పూర్తి కాగా, ప్రస్తుతం మూడో విడత కింద రూ.25 కోట్ల పనులు చేపట్టారు. వీటిలో ఇప్పటివరకు 221 పనులకు టెండర్లు నిర్వహించారు. ఇందులో 135 పనులు పూర్తి కాగా, 86 ప్రగతిలో ఉన్నాయి. దీంతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులతో 49 పనులకు ఒప్పందం జరగగా, వీటిలో రూ.4.40 కోట్ల విలువైన 36 పనులు పూర్తయ్యాయి.నాణ్యత పాటిస్తేనే సార్థకంపట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో సీసీ రోడ్లు, మురుగుకాలువలే అధికంగా ఉన్నాయి. కాగా పలు చోట్ల పర్యవేక్షణ లోపంతో పనుల్లో నాణ్యత లోపిస్తోందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

## సొమ్ము హవాలా.. వాటా కావాలి

హైదరాబాద్ : డ్రగ్స్.. సైబర్ మోసాలు.. జీరో వ్యాపార లావాదేవీల్లో రూ.వందల కోట్లు చేతులు మారే హవాలా దందాకు నగరంలో కొందరు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పరోక్షంగా తోడ్పాటు అందిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వీరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి.

**ష్...అంతా గప్‌చుప్**

నగరం, శివారులో 100-150 మంది కీలక హవాలా నిర్వాహకులున్నట్టు అంచనా. వీరిలో 10-15 మంది నైజీరియన్ డ్రగ్స్ స్మగ్లర్లకు సహకరిస్తున్నట్టు నిర్ధారించారు. డ్రగ్స్ అమ్మగా వచ్చిన సొమ్మును సేకరించి నైజీరియా, అమెరికాలో ఉన్న ప్రధాన సూత్రధారులకు చేరవేస్తున్నట్టు గుర్తించారు. కొందరు హవాలా వ్యాపారులు కేసు నుంచి బయటపడేందుకు ఒక పోలీసు అధికారి సాయంతో ప్రజాప్రతినిధిని



కలిసినట్టు సమాచారం. రూ.30 లక్షలు ఇచ్చేందుకు ప్రయత్నించినా అప్పటికే ఉన్నతాధికారి దృష్టికి వెళ్లటంతో పథకం బెడిసికొట్టినట్టు తెలిసింది. ఓ ప్రధాన వ్యాపార ప్రాంతంలో పోలీసులు హవాలా సొమ్మును గుర్తించారు. ఏజెంట్లు పోలీసులను వేడుకోవటంతో రూ.10లక్షలు తీసుకుని వదిలేసినట్టు తెలిసింది. ఇదే ప్రాంతంలోని హోల్‌సేల్ షాప్‌లోభారీగానగదు ఉన్నట్లు తెలుసుకున్న ఓ ఎస్సై దాన్ని హవాలా సొమ్మని బెదిరించి రూ.2.5 లక్షలు కాజేసినట్టు ఆరోపణలున్నాయి.

**ఏటా రూ.2-3వేల కోట్లు..**


రాజధానిలో ఏటా రూ.2-3వేల కోట్ల నల్లధనం హవాలా మార్గంలో చేతులు మారుతుందని ఓ పోలీసు ఉన్నతాధికారి విశ్లేషించారు. దొరికే సొమ్ములో కొంతమాత్రమే లెక్కల్లో చూపుతూ ఆదాయ పన్నుశాఖకు అప్పగిస్తున్నట్టు సీపీ వీసీ సజ్జనార్ దృష్టికి వచ్చినట్టు సమాచారం. హవాలాకు సహకరిస్తున్న కొందరు ఇన్‌స్పెక్టర్లను తీవ్రంగా హెచ్చరించినట్లు తెలిసింది.

## పర్యాటక విశ్వవిద్యాలయం.. ప్రతిపాదనలకే పరిమితం

హైదరాబాద్ :తెలంగాణ పర్యాటక విశ్వవిద్యాలయం ఏర్పాటులో ఏళ్ల తరబడిగా కదలిక లేదు. పర్యాటక రంగ అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు పెంపొందించేలా ప్రత్యేకంగా విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చడం లేదు. ఏడాది క్రితం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పర్యాటక విధానంలో హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పటాలిటీ మేనేజ్‌మెంట్(నితం)ను పర్యాటక విశ్వవిద్యాలయంగా స్థాయి పెంచనున్నట్లు ప్రత్యేకంగా పేర్కొంది.

**మానవ వనరుల కొరత..**

రాష్ట్రంలో పర్యాటక రంగం వేగంగా పెరుగుతోంది. పర్యాటకం ద్వారా ఆర్థికాభివృద్ధికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నది ప్రభుత్వ ఆలోచన. ప్రస్తుతం రంగంలో నైపుణ్యం కలిగిన




మానవ వనరుల కొరత ఉంది. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా హోటళ్లు, ట్రావెల్ కంపెనీలు, ఈవెంట్‌మేనేజ్‌మెంట్, టూరిజం మార్కెటింగ్ మొదలైన రంగాల్లో శిక్షణ పొందిన ఉద్యోగుల అవసరముంది. పర్యాటకంలో కోర్సులు కూడా ప్రణాళికాబద్ధంగా లేవని.. ఈ నేపథ్యంలోనే నితంను విశ్వవిద్యాలయం స్థాయికి పెంచాలని పర్యాటక శాఖ ప్రతిపాదించింది.

**ఆదరణ కోల్పోయిన సంస్థ**

నితం అనుకున్న స్థాయిలో లేకపోవడం, వివాదాస్పద నియామకాల వంటి అంశాలతో సంస్థ ప్రతిష్ఠ మసకబారింది. కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. కీలకమైన కోర్సుల్లోనూ పదిమంది కంటే తక్కువ మంది విద్యార్థులు ఉంటున్నారు. ఒకప్పుడు నితం ఎంబీఏ సీట్లకు తీవ్రమైన పోటీ ఉండేది. ఈ నేపథ్యంలో మౌలిక సదుపాయాల ఉన్నా ఉపయోగించుకోలేని పరిస్థితి నితంలో నెలకొంది.

## మెట్రో వంతెనలు వాడండి.. క్షేమంగా రోడ్డు దాటండి

హైదరాబాద్ :నగరంలో రహదారులు దాటుతూ నిత్యం పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు.ప్రతి మెట్రో స్టేషన్‌లోని రెండు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను ఉపయోగించుకుని సురక్షితంగా రోడ్డు దాటొచ్చు. నగరంలో 57 మెట్రోరైలు స్టేషన్లు ఉన్నాయి. కొన్ని స్టేషన్లు మినహా చాలా వాటిలో నాలుగు వైపులా ప్రవేశ మార్గాలు ఉన్నాయి. యువకులు మెట్లు వినియోగించవచ్చు. పెద్దలు, లగేజీ ఉన్నవాళ్లు, కాళ్ల నొప్పులతో బాధపడే వారు మెట్రో లిఫ్టులు, ఎస్కలేటర్లు ఉపయోగించు



కుని రహదారి దాటొచ్చు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

అవగాహన కల్పించడం ద్వారా..

మెట్రోరైలు స్టేషన్లను ఫుట్‌ఓవర్ బ్రిడ్జిగా వాడుకోవచ్చు అనే విషయం తెలియదు. నిత్యం హైదరాబాద్‌కు ఐదు లక్షల మంది వస్తుంటారు.. వెళుతుంటారు. నిత్యం రాకపోకలు సాగించేవారితో పాటు, కొత్తగా వచ్చేవారికి సైతం తెలిసేలా స్టేషన్ల వద్ద సూచికలు ఏర్పాటు చేయాలి.

# పాండవుల గుట్టపై కబ్జాదారుల కన్ను



కాల్వశ్రీరాంపూర్ : అక్రమార్కులు గుట్టలు, ప్రభుత్వ స్థలాల్లో ఇష్టారాజ్యంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. గుట్టలు మాయమైపోతుండగా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో సుమారు 200 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో పాండవుల గుట్ట క్రమంగా తరిగిపోతోంది. ఈ గుట్ట ప్రాంతంలో పోలీస్ స్టేషన్, మార్కెట్‌యార్డు, జూనియర్ కళాశాల, కస్తూర్బా పాఠశాల, రెండు పడక గదుల నిర్మాణం, రైతు వేదిక, పల్లె ప్రకృతివనం, విద్యుత్తు ఉప కేంద్రం, శ్రీజగత్ మహామునీశ్వర స్వామి ఆలయానికి, అయ్యప్ప దేవాలయానికి కొంత భూమి కేటాయించారుఈ ప్రాంతమంతా అక్రమ పట్టాలతో కొందరు, మరి కొందరూ ఎలాంటి పట్టా లేకున్నా కబ్జా చేసి సాగు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

**పెద్దల అండదండలతో..**

వాస్తవంగా మట్టి తవ్వకాలు చేపట్టాలనుకునేవారు మొదట గనులశాఖకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలు సవ్యంగా ఉంటే ఎన్‌ఓసీ(నో అబ్జక్షన్ సర్టిఫికెట్) సంబంధిత తహసీల్దార్‌కు పంపుతారు. అనంతరం గనులశాఖ, రెవెన్యూశాఖ అధికారులు కలిసి ఒకేసారి నిర్ణీత మట్టి తవ్వకాల ప్రదేశాన్ని సర్వే చేయాలి. ఇవన్నీ ఉంటే మట్టి తవ్వకాలకు అనుమతించగా మట్టికి రాయల్టీ రూపంలో నిర్ణీత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇవేమీ లేకుండా మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి.

**రాయల్టీకి గండి**

ట్రాక్టర్లు కాకుండా లారీల్లో మట్టిని గృహాలు, వేడుక వేదికలు, వెంచర్ల ప్రదేశాలకు చేరవేస్తున్నారు. ఇలా నిబంధనలు విస్మరించడంతో ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీకి గండి పడుతోంది.

ఈ విషయంపై తహసీల్దార్ జగదీశ్వర్‌రావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పాండవుల గుట్ట ప్రాంతాన్ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటాం అని వివరించారు.

# స్వచ్ఛతలో మెరిసిన సర్కారు బడులు




పెద్దపల్లి : పాఠశాల స్థాయిలో పచ్చదనం, పరిశుభ్రతలో విద్యార్థులను భాగస్వామ్యం చేసేలా కేంద్రం ప్రోత్సహిస్తోంది. స్వచ్ఛతా కార్యక్రమాల్లో ఆదర్శంగా నిలిచిన పాఠశాలలకు స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్యాలయ(ఎస్‌హెచ్‌వీఆర్) పేరిట రేటింగ్ కేటాయిస్తోంది. ఉత్తమంగా నిలిచిన బడులకు అవార్డులు, నగదు పురస్కారాలను పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగా స్వచ్ఛతలో అగ్ర పథంలో నిలిచిన పాఠశాలల జాబితా ప్రకటించింది. జిల్లా నుంచి గ్రామీణ, పట్టణ కేటగిరీ నుంచి రాష్ట్రానికి ఎనిమిది పాఠశాలను ఎంపిక చేశారు.

**307 భాగస్వామ్యం**

జిల్లావ్యాప్తంగా 307 పాఠశాలలు ఇందులో భాగస్వామ్యం అయ్యాయి. పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత, మొక్కల పెంపకం, మరుగుదొడ్లు, సేంద్రీయ ఎరువుల తయారీ, పారిశుద్ధ్యం, తాగునీరు ఇలా 60 అంశాలపై ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

పాఠశాల స్థాయిలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పరిశీలించారు. తర్వాత జిల్లా స్థాయిలో ఒక కమిటీ బృందం పర్యటించి ఆరా తీసి ప్రతిభా ఆధారంగా రేటింగ్ కేటాయించారు.

జిల్లాలో స్వచ్ఛతలో ఉత్తమంగా నిలిచిన పాఠశాలలను మరోసారి తనిఖీలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 8 పాఠశాలలు రాష్ట్ర స్థాయిలో ఎంపికయ్యాయి. ఆయా పాఠశాలలను రాష్ట్ర కమిటీ బృందాలు పరిశీలిస్తున్నాయి. జాతీయ స్థాయి ఎంపిక చేసిన బడులకు రూ.లక్ష నగదుతోపాటు జాతీయ పురస్కారం అందనుంది. జిల్లాలో రాష్ట్ర కమిటీ బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తుందని జీసీడీవో కవిత తెలిపారు.

**ఎంపికైనవి ఇవే**

గ్రామీణ కేటగిరీ-1: ప్రాథమిక పాఠశాల సుద్దాల, ఎల్కలపల్లి, కాట్నపల్లి.గ్రామీణ కేటగిరీ-2: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మల్లాపూర్, జడ్పీ ఉన్నత పాఠశాల సుల్తాన్‌పూర్, కస్తూర్బా గాంధీ పాఠశాల సుల్తానాబాద్.పట్టణ కేటగిరీ-1: ప్రాథమిక పాఠశాల చందపల్లి.పట్టణ కేటగిరీ:2: కేంద్రీయ విద్యాలయం ఎన్టీపీసీ

# ప్రైవేటు వ్యాపారులకు మద్దతు



ధర్మారం : ప్రైవేటు వ్యాపారులు పత్తి ధర మాట్లాడుకున్నప్పుడే పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్సు ప్రతులు ఇవ్వమంటున్నారు. చరవాణికి వచ్చే ఓటీపీ చెప్పాలంటున్నారు. – జూలపల్లి మండలం అబ్బాపురానికి చెందిన ఓ మహిళా రైతు

పత్తి రైతులకు మద్దతు ధర అందించాలన్న లక్ష్యంతో సీసీఐ తెచ్చిన కపాస్ కిసాన్ యాప్ కొన్నిచోట్ల వ్యాపారులకే ప్రయోజనకరంగా మారుతోందని పై ఉదంతం తెలియజేస్తోంది. సీసీఐ ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.8,110 (పొడవు పింజ), రూ.7,710 (మధ్యస్థ పింజ)గా ఉంది. అయితే యాప్‌లో స్లాట్ బుకింగ్ చేయడం, అనుమతించిన రోజే మార్కెట్‌కు తరలించడం కష్టసాధ్యమని అక్కడకు వెళ్లాక తిరస్కరిస్తే అత్యంత తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తుందని ప్రైవేటు వ్యాపారులు ప్రచారం చేస్తున్నారు. నాణ్యమైన పత్తి రూ.6,500 నుంచి రూ.7,000 వరకు గ్రామాల్లో రైతుల ఇళ్ల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత తక్కువగా ఉంటే ఇంకా తక్కువకే కొంటున్నారు. ఇలా కొనుగోలు చేసిన పత్తిని రైతుల పేరిట కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసి సీసీఐకి విక్రయిస్తున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు.

**సులభమే..**

గూగుల్ ప్లే స్టోర్ నుంచి కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.అందుబాటులో ఉన్న మార్కెట్, పత్తిని విక్రయించే మిల్లును ఎంచుకోవాలి.

స్లాట్ బుక్ చేయగానే సంబంధిత వ్యక్తి చరవాణికి ఓటీపీ వస్తుంది. ఏదైనా సమస్య ఉంటే టోల్ ఫ్రీ నంబరు 1800 599 5779ను సంప్రదించవచ్చు.

**అధికారులు స్పందిస్తేనే..**

సీసీఐ కేంద్రాల వద్ద రైతుల పేరుతో ప్రైవేటు వ్యాపారులు పత్తి విక్రయించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటే అన్నదాతలకు ప్రయోజనం కలగనుంది. ఇప్పటికే సగానికిపైగా పత్తి రైతుల చేయి దాటిపోయింది. కపాస్ కిసాన్ యాప్ గురించి రైతులకు అవగాహన కల్పించి వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తేనే రైతులు నేరుగా సీసీఐకి విక్రయించి మద్దతు ధర పొందే అవకాశముంది.

## సౌర.. ఔరా 'సుమధుర'

రాయదుర్గం : సౌర విద్యుత్తు ప్లాంటు నిర్మాణంతో నానక్‌రాంగూడలోని సుమధుర ఆక్రోపోలిస్ అపార్ట్‌మెంట్స్ గేటెడ్ కమ్యూనిటీవాసులు ఆదర్శంగా నిలిచారు. అపార్టుమెంట్‌లో తరచూ విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గుల కారణంగా ఇబ్బందులు పడేవారు. సమస్యను ఓ సందర్భంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకెళ్లగా సౌర విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలని వారికి ఆయన సూచించారు.

**295 కిలోవాట్ల సామర్థ్యంతో..**

576 ఫ్లాట్లలోని గేటెడ్ కమ్యూనిటీ సభ్యులంతా సమావేశమై చర్చించి సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధపడ్డారు. అపార్టుమెంట్‌వాసులపై భారం వేయకుండా కమిటీ కార్పస్ ఫండ్‌పై వచ్చిన వడ్డీ రూ.30 లక్షలకు,



మరో రూ.కోటి బ్యాంకు రుణం తీసుకున్నారు. 295 కిలోవాట్ల సామర్థ్యంతో రోజుకు 1,300 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసేలా 31వ అంతస్తు పైన 9 అడుగుల ఎత్తులో ఫలకాలను ఏర్పాటు చేశారు. ఫలకాల కింద సమావేశాలకు, మొక్కల పెంపకానికి వెసులుబాటు ఉండేలా చూశారు.

**నెలకు రూ.3లక్షల ఆదా**

రోజుకు 1,300 యూనిట్లు విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. వేసవిలో సామర్థ్యం పెరిగితే నెలకు 40 వేల యూనిట్ల వరకు ఉత్పత్తయ్యే అవకాశం ఉంది. 25 ఏళ్లవరకు ఉత్పత్తి కేంద్రం పనిచేస్తుందని, తొలి ఏడాది నిర్వహణను ప్రైవేటు సంస్థే చూస్తుందని సొసైటీ ఛైర్మన్ శ్రీరామ రావు, వైస్ ఛైర్మన్ పి.ప్రదీప్ కుమార్, కార్యదర్శి డీవీ రెడ్డి తదితరులు తెలిపారు. నెలవారీగా రూ.3 లక్షల కరెంట్ బిల్లు ఆదా అవుతుందని, దాన్ని బ్యాంకు రుణానికి మళ్లించి నాలుగేళ్లలో రుణం తీర్చుతామని తెలిపారు.

## సిబ్బంది లేరు.. ఉన్నోళ్లు పలకరు!

ఖమ్మం : రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగమైన డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డీఈఐసీ) నిర్లక్ష్యానికి గురవుతోంది. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన కీలక వ్యవస్థ లక్ష్యం నీరుగారిపోతుంది. ఓవైపు సిబ్బంది కొరత, మరోవైపు ఉన్నవారు సైతం సక్రమంగా విధులు నిర్వర్తించకపోవటం సమస్యగా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపం, వైద్యనిపుణుల బాధ్యతారాహిత్యం వెరసి కేంద్రంలో సేవలు అంపశయ్యకు చేరుకున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి..**

పుట్టకతో వచ్చే లోపాలను ప్రాథమిక దశలో గుర్తించి నయం చేయటమే ఈకేంద్రం ముఖ్యోద్దేశం. పిల్లలకు సకాలంలో సేవలు లభించకపోవటంతో శాశ్వత వైకల్యానికి గురయ్యే ప్రమాదముంది. వైద్యులు ఉన్నా రోగులు ఇక్కడికి రాకపోవటం సమస్యగా మారింది. క్షేత్రస్థాయికి, కేంద్రానికి మధ్య సమన్వయ లోపమే దీనికి కారణం. ఇక్కడ ఫిజియోథెరపీ, దంత విభాగాలకు చెందిన వైద్యనిపుణులు మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. వీరు కూడా సర్వజనాసుపత్రిలో రిఫరల్ పిల్లలు ఉంటే చికిత్సలందిస్తున్నారు. లేదంటే ఖాళీగా ఉంటున్నారు. మిగిలిన విభాగాల్లో నిపుణులు ఎవరు, ఎక్కడ విధులు నిర్వర్తిస్తున్నారో తెలియని దుస్థితి.

**రూ.లక్షల పరికరాలు ఉన్నా..**

ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ఈకేంద్రంలో పరికరాలను ఏర్పాటు చేసింది. ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ఇతర పరికరాలు దుమ్ముపట్టిపోతున్నాయి. అప్తమాలజీ విభాగానికి ఎప్పుడూ తాళం వేసి ఉంటుందని చిన్నారుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఖరీదైన పరికరాలు మూలన పడేయటంతో పనికిరాకుండా పోతున్నాయి. ల్యాబ్‌లోని పరికరాలను వాడకపోవటంతో పాడైపోయాయి. వైద్యసిబ్బంది బయోమెట్రిక్ హాజరు యంత్రం, పర్యవేక్షణ, భద్రత కోసం ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు సైతం వృథాగా ఉండి వైర్లు వేలాడుతున్నాయి. అధికారులు మాత్రం తాము ఈఏడాది చికిత్సలు అందించిన వారి లెక్కలు తమ వద్ద ఉన్నాయంటూ రికార్డుల్లో చూపుతున్నారు. ఉన్నతాధికారులు



దృష్టిసారించి ఈకేంద్రంలో అందించే సేవలపై నమ్మకం పెంపొందించాల్సిన అవసరముంది.

**కొరవడిన పర్యవేక్షణ**

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య సమస్యలను ఆర్‌బీఎస్‌కే బృందాలు గుర్తించి డీఈఐసీకి పంపించాలి. వాహనాల్లో కేంద్రానికి చేర్చి తగిన చికిత్సలు ఇప్పించాలి. మండలం నుంచి ఎంతమంది పిల్లలను కేంద్రానికి తీసుకొస్తున్నారు? ఏ సమస్యలతో వస్తున్నారు? ఎంతమందికి చికిత్సలు అందించారు? అనే విషయాలపై పర్యవేక్షణ కొరవడింది.

డీఈఐసీలో తగిన చికిత్సలు అందించటానికి చర్యలు తీసుకుంటాం. వైద్యసిబ్బంది పనితీరుపై దృష్టి సారిస్తాం. ఖాళీల భార్తీపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– డాక్టర్ రామారావు, డీఎంహెచ్ఓ

ఈ ఏడాదిలో చికిత్సలు పొందినట్లుగా రిజిస్టర్లలో నమోదైన పిల్లల గణాంకాలు

చర్య సమస్యలు: 352
అనీమియా: 106
దంత సమస్యలు: 1,188
ఫిజియోథెరపీ: 710
స్పీచ్, ఇయరింగ్ థెరపీ: 652
అప్తమాలజీ: 1,102
ఇతర సమస్యలు: 527

చురకలు



# ఆయుష్ పోస్తున్నారు

బనగానపల్లి : 'ఆయుష్' వైద్య సేవలపై 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించింది.. నిధుల్లేక గత కొన్నేళ్లుగా ఆయా కేంద్రాల నిర్వహణ అటకెక్కింది.. అదేవిధంగా ఔషధాల పంపిణీ లేదు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు రూ.కోటి విలువైన మందులను సరఫరా చేసింది. రాయలసీమలోనే 10 పడకల ఆసుపత్రిగా ఉన్న బనగానపల్లి ఆసుపత్రి మరమ్మతులకు రూ.16 లక్షలు మంజూరు చేసింది. జిల్లా కేంద్రమైన నంద్యాల దవాఖానాకు రూ.50 లక్షలు, పాణ్యానికి రూ.30 లక్షలు, శిరివెళ్ల, దొర్నిపాడు, జిల్లెల్లకు రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి.

**ఖాళీల భర్తీకి ఒప్పందం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో హోమియోపతి ఆస్పత్రులు 14, ఆయుర్వేదిక్ 42 యునానీ వైద్యశాలలు 11, నాచురోపతి 2 వరకు ఉన్నాయి. నేషనల్ హెల్త్ మిషన్ కింద 2014-19లో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు.

ప్రతి ఆసుపత్రిలో ఓ వైద్యుడు, ఫార్మసిస్ట్, అటెండర్, స్వీపర్, ఏఎన్ఎం ఉండాలి. యునానీ మినహా మిగిలిన వైద్యాలయాల్లో ఏళ్ల తరబడి వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలో ఆయా కేంద్రాల్లో పక్షవాతం, కీళ్లు, కండరాల నొప్పులు తదితరాలకు చికిత్స అందించే వారు. సిబ్బంది లేక పోవడంతో మంచా లు, ఇతర వైద్య పరికరాలు ఎందుకు పనికి రాకుండా పోయాయి. "ఒప్పంద ప్రాతిపదికన సిబ్బంది నియామకానికి ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాయి.. త్వరలో భర్తీ చేయనున్నట్లు" ఆర్‌జేడీ డా.శేఖర్‌బాబు తెలిపారు.



**వీటిపై దృష్టి పెట్టాలి**

కర్నూలు నగరంలోని ఆయుర్వేద ఆసుపత్రిలో ఇన్‌ఛార్జి వైద్యుడే సేవలందిస్తున్నారు. ఇద్దరు సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. దొర్నిపాడులోని యునాని వైద్యశాల వైద్యురాలు బదిలీ కావడంతో ఆస్పత్రి మూతపడింది. అలాగే సంజామల మండలం ఆకుమళ్లలో వైద్యులు, సిబ్బంది లేక ఆయుర్వేద ఆస్పత్రికి తాళం వేశారు.

ఆళ్లగడ్డలో వైద్యుడు బదిలీపై వెళ్లడం, సిబ్బంది లేక ఆయుర్వేద ఆసుపత్రిలో మూత పడే దశకు చేరుకుంది. కృష్ణగిరిలో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో హోమియో వైద్యశాల నిరుపయోగంగా మారింది. రుద్రవరం మండలం ఆలమూరులో ఆయుర్వేద ఆస్పత్రిలో సిబ్బంది లేక దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. డోన్ ఆయుర్వేద ఆసుపత్రిలో వైద్యాధికారిణి, అటెండరే విధులు నిర్వహిస్తున్నారు. అవుకు మండలం గుండ్లశింగవరంలో ఉన్న ఒకే ఒక ఫార్మసిస్ట్ బదిలీ కావడంతో ఆసుపత్రి అలంకారప్రాయంగా మారింది. రుద్రవరంలో వైద్యుడు లేక ఏళ్లయింది. ఫార్మసిస్టే సేవలు అందిస్తున్నారు.

# జొన్నకు పురుగు.. ఖజానాకు చిల్లు

నంద్యాల : పౌర సరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో జొన్నలను పురుగులు బుక్కుతున్నాయి. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో పెద్దఎత్తున జొన్న సాగైంది. వీటికి బహిరంగ విపణిలో గిట్టుబాటు ధర లేకపోవడంతో కొనుగోలుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. 4,180 మంది రైతుల నుంచి 27,097.100 మెట్రిక్ టన్నులు సేకరించారు. క్వింటాకు మద్దతు ధర రూ.3,371 చెల్లించారు. వాటిని నంద్యాల కేంద్ర గిడ్డంగుల సంస్థలో నిల్వ చేయాల్సి ఉంది. అక్కడ పెద్దఎత్తున పత్తి నిల్వ ఉండటంతో నంద్యాల, నందికొట్కూరు సీడబ్ల్యూఎస్, ఏపీడబ్ల్యూఎస్ గోపవరం గోదాములతోపాటు గడిగరేవుల, దీబగుంట్ల, ఆళ్లగడ్డలోని ప్రైవేట్ గోదాముల్లో నిల్వ ఉంచారు. వీటి గడువు గతేడాది ఏప్రిల్ నాటికి ముగిసింది. అప్పటి వరకు అధికారులు అటువైపు తొంగి చూడకపోవడం గమనార్హం.

**సంచికి రూ.4 చెల్లించారు**

గోదాముల్లో నిల్వ చేసిన సరకుకు గాలి ఆడేలా ఏర్పాట్లు ఉండాలి. పురుగు పట్టకుండా రసాయనాలు వినియోగించాలి. ఇవేమీ పాటించకపోవడంతో పెద్ద ఎత్తున 'పురుగు' పట్టింది.

ఆరు వేల మెట్రిక్ టన్నులు నిల్వ ఉంచిన దీబగుంట్ల గోదాము, 3,600 టన్నులు నిల్వ ఉంచిన గడిగరేవుల గోదాములు, 5,600 మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న ఆళ్లగడ్డ గోదాములో పురుగులు తినేస్తున్నాయి. సీడబ్ల్యూఎస్‌లో నిల్వ చేసే జొన్నల సంచికి రూ.5 చెల్లిస్తుండగా.. ప్రైవేట్ గోదాముల్లో నిల్వ చేసే సంచికి రూ.4 ధరకే యజమానులు



ఒప్పుకొన్నారు. జిల్లాలోని మూడు గోదాముల్లో నిల్వ, నిర్వహణ బాధ్యతలు వారికే అప్పగించారు. కొంతకాలంగా ఇదే విధంగా 'పనులు' పొందుతున్న అనధికార గుత్తేదారుడే వీటిని దక్కించుకొన్నారు. ప్రైవేట్ గోదాములను లీజుకు తీసుకుని సదరకు వ్యక్తి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేస్తున్నారు.

**రేషన్ దుకాణాలకు తరలింపు**

గోదాముల్లో నిల్వ ఉంచిన జొన్నల్లో 17,400 మెట్రిక్ టన్నులను రేషన్ దుకాణాలకు తరలించారు. ప్రత్యేకించి జొన్నలు వినియోగించే నంద్యాల, కర్నూలు, శ్రీసత్యసాయి, అన్నమయ్య, కడప, పల్నాడు, ఒంగోలు, గుంటూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు తీసుకెళ్లారు.

రేషన్ దుకాణాల ద్వారా ఈనెల ఒకటో తేదీ నుంచే పంపిణీ కూడా ప్రారంభమైంది. కొన్నిచోట్ల జొన్నలు పుచ్చుపట్టడంతో కార్డుదారులు తీసుకోవడానికి విముఖత చూపినట్లు సమాచారం. మరోవైపు గోదాముల నుంచి తరలించిన జొన్నలు కొన్ని జిల్లాల్లో పౌరసరఫరాల గోదాముల్లో నిల్వ ఉంచారు. జొన్నలు నాణ్యతగా లేకపోవడంతో పక్కన పెట్టినట్లు తెలుస్తోంది.

# పేదల ఇల్లు.. 'పెద్దల కళ్లు'!



ఒంగోలు: గూడు లేని నిరుపేదలకు ఆవాసం కల్పించేందుకు ప్రభుత్వం స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి సాయమందించింది. అప్పట్లో మౌలిక వసతులు కల్పించకపోవడం, ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు లబ్ధిదారులకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. తాజాగా మార్కాపురం జిల్లా కేంద్రం కావడంతో పెద్దల ముసుగులోని అక్రమార్కుల కళ్లు ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇళ్లపై పడ్డాయి. పేదల ఇళ్లను లాక్కోవడమే కాకుండా ఖాళీ జాగాలు కనిపిస్తే కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మార్కాపురం పట్టణంలో పేదలకు ఇళ్లు పంపిణీ చేసేందుకు 2007-08లో అప్పటి ప్రభుత్వం పట్టణ శివారులోని చెన్నరాయునిపురం, నరసింహపురంలో భారీ ఎత్తున ఇళ్ల నిర్మాణం చేపట్టింది. నరసింహపురంలో 787 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం చేపట్టగా 587 ఇళ్లకు పైకప్పు వేశారు. మరో 139 పునాదుల స్థాయిలోనే ఉండిపోయాయి. దీనికి అనుబంధంగా ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతలో భాగంగా చెన్నరాయునిపురంలో 80 ఎకరాల్లో 889 మంది పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వీటిలో 531 ఇళ్లకు పైకప్పు వేయగా, పునాదుల దశలో 262 ఇళ్లు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఏవైతే పునాదుల దశలో నిలిచిపోయాయో వాటిపై అక్రమార్కులు కన్నేశారు. వాటిని ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపట్టే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే పైకప్పు దశలో ఉన్నవాటిని లబ్ధిదారులకు డబ్బులు ఆశ చూపి స్వాధీనం చేసుకుంటున్నారు. ఎప్పుడో 18 ఏళ్ల కిందట లబ్ధిదారులకు కేటాయించడంతో నిజమైన లబ్ధి దారులు ఎవరనేది గుర్తించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి.

**అధికారుల తప్పిదాలతోనే..**

అప్పట్లో కొంతమంది ఇళ్ల నిర్మాణం చేపట్టి వదిలేయగా, మరికొంతమంది ఇళ్ల నిర్మాణం అసలు ప్రారంభించలేదు. ఇలాంటి వాటిని అధికారులు లంచాలు తీసుకుని పలువురికి కేటాయించే ప్రయత్నం చేశారు. నకిలీ పత్రాలతో ఇద్దరు, ముగ్గురికి కట్టబెట్టడం గమనార్హం. ప్రస్తుతం అక్కడ ఖాళీ జాగా కనిపిస్తే ఎవరుబడితే వారు ఇష్టానుసారం నిర్మాణాలు చేపడుతున్నారు. తమ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదు చేయడంతో కొత్తగా చేపట్టిన కొన్నింటిని అధికారులు కూల్చేశారు. కొంతమంది పెద్దలు చేపట్టిన నిర్మాణాలను మాత్రం కూల్చకుండా చోద్యం చూస్తున్నారు. మార్కాపురం జిల్లా కేంద్రం కావడం, ఇందిరమ్మ ఇళ్లను ఆనుకుని ఓ ప్రైవేటు సంస్థ భారీ లేఅవుట్ వేయడంతో అందరి కళ్లు వీటిపై పడ్డాయి. డబ్బు లేని పేదలు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తుండగా, అక్రమార్కులు మాత్రం వడివడిగా నిర్మాణాలు చేపడుతున్నారు.

**నిజమైన లబ్ధిదారులకే కేటాయింపు**

మార్కాపురం పట్టణంలో ఎవరైతే నిజమైన లబ్ధిదారులు ఉన్నారో వారికే ఇళ్లు కేటాయిస్తాం. ఆర్థిక స్థోమత లేక ఇంటి నిర్మాణం చేపట్టలేని నిజమైన హక్కు దారులు తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చు. గృహ నిర్మాణ శాఖ ద్వారా అందించే రూ.2.50 లక్షల్లో అప్పట్లో ఇచ్చిన నగదును మినహాయించుకుని మిగిలిన మొత్తం లబ్ధిదారులకు అందజేస్తాం. ఆక్రమణల వ్యవహారాన్ని రెవెన్యూశాఖాధికారుల దృష్టికి తీసుకెళతాం.

పి.శ్రీనివాసవరప్రసాద్, పీడీ, గృహనిర్మాణశాఖ

# మామిడి దిగుబడి.. మంచుతో దిగులుపడి!



కనిగిరి : ఫలాల్లో రారాజు మామిడి. వందలాది రకాలతో నోరూరించే రుచులతో వేసవిలో ప్రత్యేకంగా లభించే పండు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించక పూత, పిందె దశకు వచ్చేసరికి మంచుదెబ్బ తగులుతోంది. ప్రస్తుతం మామిడి తోటలకు ఓ వైపు పొగమంచు, మరోవైపు తెగుళ్ల ప్రభావంతో ఇబ్బందులు తప్పడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 6 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగవుతున్నాయి. సింగరాయకొండ, ఉలవపాడు, గిద్దలూరు, బెస్తవారిపేట, కనిగిరి, యర్రగొండ పాలెం, పెద్దారవీడు, జరుగుమల్లి తదితర ప్రాంతాల్లో అధికంగా సాగు చేస్తున్నారు. ఇటీవల విస్తారంగా వర్షాలు కురవడం, రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోవడం, భారీగా మంచు కురుస్తుండడంతో మామిడికి ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. సాధారణంగా నవంబరు నుంచి జనవరి వరకు మామిడి పూత వస్తుంది. అనంతరం పిందె దశకు చేరుకుంటుంది. ప్రస్తుతం రసాలు, సువర్ణరేఖ, బంగినపల్లి, తోతాపురి తదితర రకాల చెట్లు పూత, పిందె దశలో ఉన్నాయి. వీటిలో కొన్ని రకాలకు పూత ఆలస్యంగా రాగా, మరికొన్ని రకాలు పూత, పిందె దశకు చేరుకున్నాయి. మంచు ప్రభావంతో పూత వచ్చే పరిస్థితి కనిపించడంలేదని, మంచుతో పూత, పిందెలు సైతం రాలిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తేనె మంచు పురుగు సోకి పూత మాడిపోయి, పిందె దశలో ఉన్న కాయలు రాలిపోతున్నాయి. మంచు ప్రభావంతో మచ్చ తెగులు సోకి మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచు ప్రభావం, తెగుళ్ల నివారణకు రూ.వేలు ఖర్చు చేసి మందులు పిచికారీ చేసినప్పటికి ఫలితం ఉండడం లేదని వాపోతున్నారు. ఈ ఏడాది ప్రారంభ దశలోనే ఇలాగుంటే కాయపక్వానికి వచ్చే సరికి ఎలా ఉంటుందోనని రైతులు మరింత ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై జిల్లా ఉద్యానవనశాఖాధికారి గోపీచంద్ మాట్లాడుతూ మంచు, తెగుళ్ల ప్రభావంతో పూత, పిందె రాలిపోతోందన్నారు. తేనె మంచు. పక్షకన్ను తెగులు, బూడిద తెగులు సోకుతున్నాయని, పూత దశలో శిలీంద్ర నాశకాలు పిచికారీ చేయాలన్నారు. రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడంతోపాటు స్థానిక ఉద్యానవనశాఖ అధికారులను సంప్రదించి సూచనలు తీసుకోవాలన్నారు.

**తెగుళ్లకు.. 'కంది'పోతోంది!**

పశ్చిమ ప్రాంతంలో ఈ ఏడాది కంది సాగు పెరిగింది. పొగాకు పండించే రైతులు కొంత మేరకు విస్తీర్ణం తగ్గించి కంది సాగువైపు మొగ్గుచూపారు. అయితే కందిలో ఎండుతెగులు ప్రభావంతో అక్కడక్కడ పంట దెబ్బతింటోంది. రెండు నెలల క్రితం కురిసిన వర్షాలకు పంట నీట మునిగింది. ఆ సమయంలోనే కొన్నిచోట్ల దెబ్బతింది. మరికొన్ని చోట్ల రైతులు అప్రమత్తమై నీటిని బయటకు తోడటంతో పంటను దక్కించుకోగలిగారు.

సాధారణ సాగు కంటే ఎక్కువ.. పొదిలి మండలంలో కంది సాధారణసాగు విస్తీర్ణం 6,500 హెక్లార్టు కాగా ఈ ఏడాది 10,812 హెక్టార్లలో సాగైంది. మార్కాపురం మండలంలో 3,264 ఎకరాలు, తర్లుపాడులో 770 హెక్టార్లు, కొనకనమిట్లలో 4,500 హెక్టార్లలో కంది వేశారు. గత ఏడాది 7 వేల హెక్టార్లలోపే సాగు చేశారు. పంట విస్తీర్ణం పెరిగినప్పటికీ కొన్నిచోట్ల ఎండుతెగులుతో మొక్కలు చనిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రభావంతో దిగుబడులు తగ్గే అవకాశం ఉందని వాపోతున్నారు. కందిపంటలో సస్యరక్షణ చర్యలు, బెట్ట పరిస్థితులను అధిగమించేందుకు వ్యవసాయ అధికారుల సలహాలు ఇవ్వాలని కోరుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి: ఎండు తెగులు నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి డి.శ్రీనివాసులరెడ్డి సూచిస్తున్నారు. ప్రారంభంలో రైతులు విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. పంట మార్పిడి తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ప్రస్తుతం కాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

# వెలిగొండపై విద్యుత్తు బకాయిల గుదిబండ

మార్కాపురం : జిల్లాలోని దోర్నాల మండలం కొత్తూరు శివారులో పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణమవుతోంది. ఇక్కడ సొరంగాల నిర్మాణ పనులకు గత అయిదేళ్లుగా వినియోగించిన విద్యుత్తుకు సంబంధించి రూ.107 కోట్ల బిల్లు బకాయిలు పేరుకుపోయాయి. ఇక్కడ నిర్మాణ పనులు చేస్తున్న గుత్తేదారు సంస్థను బకాయిలు చెల్లించాలని కోరుతున్నప్పటికీ స్పందన లేదని, పలుమార్లు సంప్రదించినా వసూలు కాలేదని అధికారులు తెలిపారు. గత వైకాపా ప్రభుత్వ హయాం నుంచే బకాయిలు రూ.107 కోట్లకు చేరుకోవడంతో తక్షణమే చెల్లించాలని గుత్తేదారు సంస్థకు నోటీసులిచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ విషయమై మార్కాపురం విద్యుత్తుశాఖ ఈఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ పాత సంస్థ పేరిటే బిల్లు ఉందని, బిల్లును ప్రస్తుతం చేస్తున్న కంపెనీ పేరిట మార్చమని కోరారని, బిల్లు మార్పు చేసి పాత బకాయిలు వసూలుకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే బిల్లు చెల్లించేందుకు గుత్తేదారు సంస్థ అంగీకరించిందన్నారు.

# ఇరకాటంలో భవిత!

నరసాపురం : దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలను వసతుల లేమి సమస్య వెంటాడుతోంది. ఈ కేంద్రాల ద్వారా దివ్యాంగ చిన్నారులకు పలు అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ తదితర సేవలు అందిస్తున్నారు. కొన్ని కేంద్రాలు ఇరుకు గదుల్లో కొనసాగుతుండగా మరికొన్ని గ్రామాలకు దూరంగా ఉన్నాయి. కొన్నిచోట్ల ర్యాంపులు లేకపోవడంతో దివ్యాంగ చిన్నారులకు అవస్థలు తప్పడం లేదు.మొగల్తూరు లోని భవిత కేంద్రంలో సుమారు 20 మంది చిన్నారులు ఉన్నారు. ఈ భవనానికి ర్యాంపు లేకపోవడంతో చిన్నారులు మూడడుగుల ఎత్తులో ఉన్న మెట్ల మార్గం నుంచి లోపలికి వెళ్లాల్సి వస్తోంది. చక్రాల కుర్చీలో పిల్లలను తీసుకువచ్చే వారు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పోడూరు లో మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో భవిత కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ దాదాపు 20 మంది చిన్నారులు శిక్షణ పొందుతున్నారు. వీరికి అనువుగా ఫ్రెండ్లీ టాయిలెట్లు (మరుగుదొడ్లు) లేవు. పెనుమంట్ర మండలం ఆలమూరులో భవిత కేంద్రం ఒకే గదిలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ



తగిన సదుపాయాలు లేక దూర ప్రాంతాల నుంచి పిల్లలను తీసుకువచ్చే తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు.

ఆకివీడులో భవిత కేంద్రానికి సొంత భవనం లేదు. ప్రారంభంలో సంతమార్కెట్ వద్ద పాతభవనంలో ఏర్పాటు చేశారు. అది శిథిలావస్థలో ఉండటంతో మాదివాడ ప్రాథమిక పాఠశాలలో ఒక గది కేటాయించారు. కొద్దికాలానికి ఆర్యవైశ్య కల్యాణ మండపం రోడ్డులో ఉన్న పాఠశాలకు తరలించారు. ఇక్కడ దివ్యాంగులకు అవసరమైన సౌకర్యాలు లేవు. నరసాపురంపట్టణంలో భవిత కేంద్రాన్ని స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఓ తరగతి గదిలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ 25 మంది దివ్యాంగులు శిక్షణ పొందుతున్నారు. వారికి అవసరమైన వసతి లేకపోవడంతో ఇరుకు గదిలోనే కాలం వెళ్లదీస్తున్నారు.

భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు..జిల్లాలో భవిత కేంద్రాలకు విడతల వారీగా సొంత భవనాలు నిర్మించేలా చర్యలు చేపట్టాం. తొలి విడతలో అయిదు భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు వచ్చిన వెంటనే నిర్మాణాలు చేపట్టి పూర్తి చేస్తాం. దివ్యాంగ చిన్నారులు కూడా సాధారణ విద్యార్థుల్లా విద్య, క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

- శ్యాంసుందర్, సర్వశిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్

# అనగనగా చెరువుంది! అది ఇప్పుడెక్కడుంది!!

కొవ్వూరు-గుండుగొలను జాతీయ రహదారి వెంబడే ఉంటుంది నారాయణపురం జమ్మి చెరువు. ఇక్కడ ఎకరా మార్కెట్ విలువ రూ.కోటికి పైగా ఉంది.

పంటల సాగు: ఆక్రమణదారులు రెండు పంటలు పండించుకుని సగటున ఎకరాకు రూ.50 వేల వరకు నికర ఆదాయం పొందుతున్నారు. చర్యలు: చెరువులో కొందరు రైతులు సాగు చేసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. పంచాయతీ కార్యదర్శితో నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించాలని అనుకున్నారంతే.

ఈనాడు-ఏలూరు: ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రజల తాగునీటి అవసరాలు.. సాగుకు ఉపయోగపడేవి చెరువులు. భూగర్భ జలాల పెంపునకు దోహదం చేస్తాయి. సహజ సిద్ధమైన ఈ జల వనరులు జిల్లాలో అత్యధికంగా ద్వారకాతిరుమల మండలంలో ఉండగా... అవి కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. వాటి విలువ రూ.30-40 కోట్లకు పైగానే ఉంటుంది.

చాలా చెరువులు ఆక్రమించి పంటలు సాగుచేసుకుంటున్నారు. నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో గుక్కెడు నీళ్లకు నోచుకోవడం లేదనే స్థానికుల ఫిర్యాదులపై అధికారుల చర్యలు శూన్యం. ఆక్రమణల తొలగింపు విషయంలో ఇటు జల వనరులు, అటు జిల్లా పంచాయతీ అధికారులు ఎవరికి వారే మీదంటే.. మీదంటూ తప్పించుకు



ంటున్నారు.

**49 ఎకరాల్లో 25 ఎకరాలు ఆక్రమణ**

గుణ్ణంపల్లి-తక్కెళ్లపాడులో లక్ష్మపురం చెరువు గర్భంలో కొంత భూమిని సాగు చేసుకుంటుండగా మరికొందరు కొందరు ఇళ్లు నిర్మించుకుని నివాసాలు ఉంటున్నారు.

ఇక్కడ ఎకరా ధర రూ.40-50 లక్షలు ఉంది. సగటున ఎకరాకు రూ.40 లక్షలు అనుకున్నా రూ.10 కోట్లకు పైగానే ఉంటుంది.

చర్యలు: ఇళ్ల నిర్మాణాల తొలగింపునకు కలెక్టర్, పోలీసులకు అధికారులు బందోబస్తు కోరుతూ లేఖ రాసి మిన్నకుండిపోయారు.

**32 వీకక్లో 16 వీకూలు ఆ్యకజుణ**

సత్తాల చెరువును ఆక్రమించి వరి పంటతో పాటు ఆయిల్‌ఫాం తోటలు సాగు చేశారు. ఇక్కడ ఎకరా ధర రూ.40 లక్షలు. ఈ ప్రకారం చూస్తే కబ్జాకు గురైన భూమి విలువ రూ.6.40 కోట్లు. చర్యలు: ఆక్రమణల తొలగ్రినకు కలెక్టర్, పోలీసు, పంచాయతీ అధికారుల సహకారం కోరుతూ గతేడాది జూన్, జులైలో జల వనరుల శాఖ రాసిన లేఖకు ఇప్పటికీ స్పందన లేదు.

సీఎస్ఆర్ నిధులతో పరిరక్షిస్తాం

ద్వారకాతిరుమల మండలంలో కొన్ని చెరువులు కబ్జాకు గురయ్యాయని గుర్తించాం. వాటి తొలగింపునకు నిధులతో పాటు పోలీసు బందోబస్తు అవసరం. మా శాఖ వద్ద బడ్జెట్ లేదు. సీఎస్ఆర్ నిధుల భాగస్వామ్యంతో అన్ని చెరువుల్లో ఆక్రమణలు తొలగించి వాటి పరిరక్షణకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

- పి.సతీష్, ఏఈ, చిన్న నీటి పారుదల శాఖ

# తప్పులు ఆపలేదు.. ముప్పు ఆగలేదు !

విశాఖపట్నం : సింహాచలం కొండపై దేవస్థాన బృహత్తర ప్రణాళికకు విరుద్ధంగా 'ప్రసాద్' పథకం పనులు సాగాయి. గత ప్రభుత్వ హయాంలో పథకం డీపీఆర్ కూడా ఇష్టారాజ్యంగా తయారు చేశారు. విషయం అప్పటి అధికారులకు తెలిసినా ఎవరూ నోరుమెదపలేదు. ఎక్కడెక్కడ ఎలా చేస్తున్నారో తనిఖీ చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. ఇంజినీరింగ్ విభాగం వైఫల్యాన్ని గుర్తించలేకపోయారు. ఈ నిర్లక్ష్యం వల్లే గత ఏడాది చందనోత్సవం రోజున ఏడుగురు భక్తుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఈవోగా పనిచేసిన త్రినాథరావు పర్యవేక్షణ లోపం ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించి... ఆయనపై అభియోగాలు నమోదు చేసి పది రోజుల్లో వివరణ కోరింది.

**అభ్యంతరం తెలిపినా..:** 'ప్రసాద్' పథకం నిధులతో చేస్తున్న పనులపై దేవాదాయశాఖ కొన్ని అభ్యంతరాలు తెలిపినా అప్పటి ఈవో పట్టించుకోలేదు. కొత్త ఘాట్ రోడ్డు వద్ద కాంప్లెక్సును మాస్టర్‌ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించారు. కొండపై బస్సులు నిలిపే ప్రాంగణం వద్ద భక్తుల సౌకర్యార్థం ఓ సెంటర్ నిర్మించారు. దీంతో బస్సులు నిలపడానికి, భక్తులు వేచి ఉండేందుకు ఇబ్బందిగా మారింది. దీనిపై దేవాదాయశాఖ అభ్యంతరం తెలిపినా అక్కడే కొనసాగించారు.

పాత పుష్కరిణి సత్రం స్థానంలో అయిదు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. దీనికీ పూర్తిస్థాయి అనుమతి లేదు. బస్ బేల నిర్మాణాలు, పర్యాటక సమాచార కేంద్రం, ఫుడ్ కోర్టులు మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా లేవు. గత ఏడాది ప్రమాదం తర్వాత పనులు నిలిపి మళ్లీ కొత్తగా టెండర్లు పిలిచి పనులు చేస్తున్నా బృహత్తర ప్రణాళికకు విరుద్ధంగానే ఉన్నాయనే విమర్శలొస్తున్నాయి.

**అయిదుసార్లు పనిచేసినా:** మాస్టర్‌ప్లాన్‌కు విరుద్ధంగా పనులు జరగడంతోనే గత ఏడాది కొండపై రిటైనింగ్ వాల్ కూలిన ఘటనలో



ఏడుగురు భక్తులు మృతిచెందారని ప్రభుత్వం భావించింది. అప్పట్లో ఈవోగా చేసిన త్రినాథరావు పర్యవేక్షణ లోపం ఉన్నట్లు తేల్చింది. ఈయన గత వైకాపా ప్రభుత్వ హయాం నుంచి గత ఏడాది అక్టోబరు వరకు అయిదుసార్లు సింహాచలం ఈవోగా చేశారు. మొదటిగా 2020 సెప్టెంబరు 2 నుంచి 2021 జనవరి 22 వరకు పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించారు. 2022 సెప్టెంబరు22 –2023 జూన్ 10; మళ్లీ 2023 జూన్ 28 – సెప్టెంబరు 17 వరకు చేశారు. ఆ తర్వాత 2024 సెప్టెంబరులో మళ్లీ బాధ్యతలు తీసుకొని 2025 ఫిబ్రవరి వరకు ఉండి మూడు నెలలు సెలవులో వెళ్లారు. అనంతరం గత ఏడాది మే 26న విధుల్లో చేరి అక్టోబరు 23 వరకు పని చేశారు. గత ప్రభుత్వ హయాంలోనూ భక్తులకు తీవ్ర అసౌకర్యం కలగడంపై నాడు జిల్లా అధికారులతో విచారణ చేయించారు. ఈవో త్రినాథరావు తప్పిదాన్ని గుర్తించి అప్పటి జేసీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అయినా ఆయనపై చర్యలు తీసుకోకుండా నాడు జాప్యం చేశారు.

# మొదలుకు ముందే ముగింపు

అనకాపల్లి : జిల్లాలో రబీలో సాగు ఇంకా పూర్తిస్థాయిలో చేపలేదు. ఖరీఫ్ పంట కోతదశలోనే ఉంది. ఇంతలోనే రబీ పంటలకు బీమా సమయం ముగిసిపోయింది. ఒక్క ఎకరాకు కూడా బీమా భరోసా లభించకముందే గడువు పూర్తయిపోయింది. దీంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను (పంటల బీమా పథకం) రబీలో వరి, పెసర, మినుము పంటలకు అమలు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఇంకా వరికోతలు కోస్తున్నారు. కోతల అనంతరం రబీ వరి, అపరాల సాగు చేపడతారు. ఇంతవరకు కేవలం 15 శాతం వరి, 38 శాతం అపరాలు సాగు చేశారు. ప్రభుత్వం వరి పంటకు బీమా చేసేందుకు డిసెంబరు నెలాఖరు వరకు, మినుము, పెసరకు డిసెంబరు 15 వరకు సమయం ఇచ్చింది. అప్పటికి వరి నాట్లే వేయలేదు. మినుము, పెసర కేవలం నాలుగు శాతమే సాగు చేశారు. వీరికి బీమాపై అవగాహన లేకపోవడంతో ఒక్కరూ చేయలేదు. వరి పంటకు ఎకరాకు రూ. 630, మినుము, పెసరకు రూ.300 రైతులు ప్రీమియంగా చెల్లించాలి. పంట నష్టపోతే వరికి రూ. 30 వేలు, పెసర, మినుముకు రూ. 18 వేలు పరిహారంగా అందిస్తారు.

**బీమా ఉంటే ఎంతో మేలు**

గతంలో ఉన్న పంటల బీమా పథకానికి ప్రస్తుతం ఉన్న పథకానికి ఎంతో తేడా ఉంది. వరి నాట్లు వేస్తేనే గతంలో బీమా చేయడానికి అర్హులు. ప్రస్తుతం నాట్లు వేయకపోయినా చేయవచ్చు. నారు వేస్తే చాలు. గతంలో కోతల అనంతరం పంటలు దెబ్బతింటే ఎటువంటి పరిహారం లభించేది కాదు.

ఈ పథకంలో కోతల అనంతరం 14 రోజుల వరకు నష్టం వచ్చినా



పరిహారం అందిస్తారు. గతంలో పంట దెబ్బతింటేనే పరిహారం చెల్లించేవారు. ఇప్పుడు అలా కాదు. నారు పోయినా 25 శాతం వరకు బీమా ఇస్తారు. బీమా చెల్లించే విధానంలో కూడా మార్పులొచ్చాయి. ఏడేళ్ల దిగుబడులు సరాసరి లెక్కించి పరిహారం అందించేవారు. వీటిలో కరవు వచ్చిన సంవత్సరం ఉంటే తగ్గిన దిగుబడి లెక్కించేవారు. ఇప్పుడు కరవు సంవత్సరం దిగుబడులను పరిగణనలోకి తీసుకోరు.

**సమయం పొడిగించమని అడిగాం**

జిల్లాలో రబీ సీజన్ ఆలస్యంగా ప్రారంభమవుతుంది. పంటల బీమా పథకంలో చేరితే రైతులకు ఎంతో ప్రయోజనం ఉంది. కేంద్ర ప్రభుత్వం బీమా ప్రీమియంలో కొంత రాయితీగా ఇస్తుంది. వరి నాట్లు వేయకపోయినా బీమా చేయవచ్చు. రైతులు నాట్లు వేశాకే బీమా కట్టడానికి ఇష్టపడుతున్నారు. అందువల్ల సమయం పొడిగించమని కోరాం.ఆశాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి

# మరల్లో మన సత్తా



ఉరవకొండ : అనంతపురం జిల్లా అంటే కరవు గుర్తుకు వస్తుంది. ఆ మాట చెరిగి పోయి ఇపుడు పవన విద్యుత్తుకు కేరాఫ్‌గా నిలుస్తోంది. ఉరవకొండ పవన విద్యుదుత్పత్తికి కేంద్రంగా మారింది. గాలి మరలు ఉత్పత్తి చేసే విద్యుత్తును స్వీకరించి ఇతర ప్రాంతాలకు సరఫరా చేయడానికే ఉరవకొండ మండలం పెద్ద ముష్టూరు వద్ద 105 ఎకరాల్లో ట్రాన్స్‌కో 14 ఫీడర్లతో 1630 మెగావోల్ట్– ఆంపియర్ (ఎంవీఏ) సామర్థ్యంతో 220 కేవీ ఉప కేంద్రాన్ని నిర్మించింది. దీనిని 2016లో అందుబాటులోకి తీసుకొచ్చారు.

**ఇక్కడి నుంచి ఎక్కడికి**

ఉత్పత్తి అయిన పవన విద్యుత్తును ఇక్కడి నుంచి తాడిపత్రి సమీపంలో తలారి చెరువు, హిందూపురం, తెలంగాణలోని వెల్గటూరులోని విద్యుత్తు ఉపకేంద్రాలకు 400 కేవీ ఫీడర్లతో సరఫరా చేస్తారు. ఇక్కడ తక్కువ వచ్చినా అక్కడి నుంచి తీసుకొనే సామర్థ్యం ఉంది.

ఘనత: విద్యుత్తు సామర్థ్యం కలిగినదిగా పెద్ద ముష్టూరు కేంద్రానికి గుర్తింపు దక్కింది. కార్యకలాపాలన్నీ బెంగళూరు కేంద్రంగా నడుస్తాయి. సబ్‌స్టేషన్ ఆటోమేషన్ సిస్టమ్ (ఎస్ఏఎస్)ను కలిగి ఉంది. అధిక ఓల్టేజ్‌ను నియంత్రించడానికి రెండు రియాక్టర్లను ఏర్పాటు చేశారు. ఈ ఉపకేంద్రం నిర్వహణలో అధికారులు ఉత్తమ అవార్డును అందుకోవడం విశేషం. పవన, సౌర విద్యుత్తు ఉత్పత్తికి పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో ముందు ముందు ఈ కేంద్రానికి మరిన్ని ఘనతలు దక్కే అవకాశం ఉందని ఈఈ రమణమూర్తి చెబుతున్నారు.

603 గాలిమరలు : నింబగల్లు, ఆమిద్యాల, ఇప్పేరు, వజ్రకరూరు, బెళుగుప్ప ప్రాంతాల్లో

1500 మెగావాట్లు: గాలి మరల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్తు మొత్తం సామర్థ్యం

1467ఎంవీ: గరిష్ఠంగా ఒక రోజులో స్వీకరించిన విద్యుత్తు

3.2 కోట్ల యూనిట్లు: ఒకరోజులో గాలి మరలు సంపూర్ణంగా తిరిగిన సమయంలో రికార్డైన విద్యుత్తు 2.8 కోట్ల యూనిట్లు: ఈ ఏడాది గరిష్ఠంగా ఒక రోజులో సరఫరా చేసింది.

# కోడిగుడ్లు ఎగ్గొట్టి చిక్కీలు చెడగొట్టి



పుట్టపర్తి: జిల్లాలో డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై పర్యవేక్షణ కొరవడింది. కొన్నిచోట్ల వారాల తరబడి కోడిగుడ్లు, చిక్కీలు ఇవ్వకపోయినా, మెనూ అమలు చేయకపోయినా అడిగేవారుండరు. ఉమ్మడి అనంత జిల్లాలో జరుగుతున్న అక్రమాలపై ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఇటీవల జరిగిన జడ్పీ సమావేశంలో ఎండగట్టారు. శ్రీసత్యసాయి జిల్లాలో కోడిగుడ్లు, చిక్కీలు సక్రమంగా అందడం లేదని, చిక్కీల్లో బెల్లానికి బదులు చక్కెర కలుపుతున్నారంటూ గతేడాది నవంబరు 6నలో కథనం ప్రచురితమైంది. అదేనెలలో అగళి మండలంలోని మూడు పాఠశాలల్లో కోడిగుడ్లు, చిక్కీలు ఇవ్వలేదు. కొండమనాయునిపాల్యంలో కొన్ని కోడిగుడ్లు పాడయ్యాయని, తక్కువ బరువు ఉన్నాయని గుర్తించారు.

నెలలో ఒక అధికారి పదిచోట్ల తనిఖీలు చేయాలన్నది లక్ష్యం. అధికారికి వాహన సౌకర్యం ఉండదు. సొంత ఖర్చులు పెట్టుకొని వెళ్లాల్సి వస్తోంది. పథకం నిర్వహణలో అక్రమాలు జరుగుతున్నాయన్నది బహిరంగ రహస్యం. ఇప్పటివరకు గుత్తేదారులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పడం లేదు.

**ఒక్కరోజు ఇవ్వకపోయినా...**

వారంలో ఐదు రోజులు విద్యార్థులకు గుడ్లు ఇస్తున్నారు. గతనెల ధర చూసుకుంటే.. ఒక్కో గుడ్డుకు రూ.6.50 చొప్పున చెల్లించారు. అంటే.. ఒక రోజు మొత్తం 1,23,524లో 524 మంది గైర్హాజరైనా.. 1.23 లక్షల మందికి రూ.7,99,500 మిగులుతుంది. చిక్కీలకు సంబంధించి టన్నుకు రూ.40 వేలు ఇస్తున్నట్లు సమాచారం. ఇవన్నీ కలిపితే రోజుకు రూ.10 లక్షలకు పైగా జేబుల్లోకి వెళుతుంది. గుత్తేదారులకు కొందరు నాయకుల సహకారం ఉందనే ఆరోపణలున్నాయి.

**జిల్లాలో ఇలా..**

ప్రభుత్వ పాఠశాలలు: 2,012

జూనియర్ కళాశాలలు: 22

మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు: 1.23 లక్షలు

సమీక్షించి చర్యలు తీసుకుంటాం

మౌర్య భరద్వాజ్, జేసీ, శ్రీసత్యసాయి జిల్లా

పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి సమీక్షస్తున్నాం. ఇప్పటికే గుత్తేదారుల టెండరు గడువు అయిపోయింది. జనవరి వరకు పొడిగించాం. ఎక్కడైనా అవకతవకలకు పాల్పడితే వెంటనే చర్యలు తీసుకుంటాం.

# శుద్ధి.. నీటి రాతే



పుత్తూరు : పైవేటు నీటి శుద్ధి కేంద్రాల నిర్వాహకులు ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి కాసుల వేట సాగిస్తున్నారు. కనీస ప్రమాణాలు, నిబంధనలు పాటించకుండా ప్యాకేజ్డ్ డ్రింకింగ్ మినరల్ వాటర్ పేరుతో విక్రయిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలు రెస్టారెంట్లు, బస్టాండ్లు, బేకరీల్లో నకిలీ బ్రాండ్లే కనిపిస్తున్నాయి. ఈ నకిలీ దందా విజిలెన్స్ అధికారుల తనిఖీల్లోనూ బయటపడినా.. ఇంకా అడ్డుకట్ట మాత్రం పడలేదు. ప్రధాన నగరాలు, పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో ప్రముఖ కంపెనీల పేర్లలోని అక్షరాలు మార్చి వాటిలో నీటిని నింపి విక్రయిస్తున్నారు. ఆధ్యాత్మిక కేంద్రాలు ఎక్కువగా ఉండటంతో జిల్లాలో ఈ నీళ్ల సీసాల విక్రయాలు నిత్యం వేల సంఖ్యలోనే ఉంటోంది. శుభకార్యాలు, సమావేశాలు జరిగితే నకిలీ బ్రాండ్ల ప్యాకేజ్డ్ అర లీటరు సీసాలు పెడుతున్నారు. బ్రాండెడ్ కంపెనీ అయితే అర లీటరు రూ.10, లోకల్ అయితే రూ.5 నుంచి రూ.6కే వస్తోంది. ప్లాంట్లలో ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించకనే బాటిళ్లు నింపి విక్రయాలు చేపడుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు.

**ప్రమాణాలు ఏవీ..** నీటిశుద్ధి ప్లాంటులో ఏసీతో పాటు కెమికల్, బయాలజీ ల్యాబ్, ఫిల్లింగ్ గది తప్పనిసరి.

బీఐఎస్ నిబంధనల మేరకు ప్లాంట్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో ఉండాలి. అధికారులు మూడు నెలలకోసారి నమూనాలు పరీక్షించాలి. సంతృప్తికరంగా ఉంటేనే అనుమతులు కొనసాగించాలి.

ప్యాకెట్లు, బాటిళ్లలో నింపి విక్రయించడానికి ప్రత్యేక అనుమతులు అవసరం.క్లోరినేషన్ ఎంతో కీలకం. నీటిని ట్యాంకులోకి పంపించాకే ఈ ప్రక్రియ చేయాలి. తర్వాత పలు ఫిల్టర్లలో నీటిని శుభ్రం చేసి రివర్స్ అస్మాసిస్ చేయాలి. మినరల్స్‌ను జతచేసి ఓజోనైజేషన్ చేశాకే క్యాన్లలో నింపాలి. తరచూ తనిఖీలు చేస్తున్నాం..

–జగదీశ్, ఆహార నియంత్రణ అధికారి, తిరుపతి జిల్లా

జిల్లాలో తరచూ తనిఖీలు చేస్తున్నాం. నిబంధనలు, ప్రమాణాలు పాటించని నిర్వాహకులపై కేసులు పెడుతున్నాం. ఇకపై తనిఖీలు ముమ్మరం చేసి కఠినచర్యలు తీసుకుంటాం.

# చదువులమ్మ సేవలో తరిస్తూ..!

విశాఖపట్నం : విశాఖకు చెందిన ఎంతో మంది వివిధ దేశాల్లో స్థిరపడినా... జిల్లా అభివృద్ధికి, వివిధ సంస్థలకు తమ వంతుగా సాయం చేస్తూనే ఉన్నారు. శుక్రవారం 'ప్రవాస భారతీయుల దినోత్సవం'. ఈ నేపథ్యంలో ఏయూ పూర్వ విద్యార్థి దాతృత్వం.. ప్రయోజనం ఏమిటో తెలుసుకుందామా.అమెరికాలో స్థిరపడినా.. తనకు జ్ఞానాన్ని అందించిన ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని మరువలేదు పూర్వ విద్యార్థి దేవ పురాణం. ఏటా మూడు, నాలుగు పర్యాయాలు ఏయూని సందర్శించి వర్సిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నారు. 2022 నుంచి ఇప్పటి వరకు వివిధ రూపాలలో రూ.12.9కోట్లు వితరణ అందించారు. దేవ పురాణం అమలాపురం అగ్రహారంలో పుట్టి పెరిగారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, పీహెచ్‌డీ చేశారు. తర్వాత చెన్నైలో ఎంబీఏ పూర్తి చేశారు. అనంతరం ఉద్యోగాన్వేషణలో అమెరికా వెళ్లారు. అక్కడ పేరెన్నిక గన్న ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాలు చేశారు. ప్రస్తుతం అమెరికా, యూకే, భారత్‌లో పలు ఫార్మా కంపెనీలకు కన్సల్టెంట్(సలహాదారు)గా పనిచేస్తున్నారు.

ఏయూకి అందించిన విరాళాలు: ఏయూ కెమిస్ట్రీ, ఫార్మసీ, సెంట్రల్ ల్యాబ్‌లకు సుమారు రూ.8కోట్ల విలువ చేసే పరికరాలు అందించారు. ఫార్మసీ కళాశాలలో లెక్చరర్ హాలు, ల్యాబ్ ఆధునికీకరణ, మహిళలకు శౌచాలయం, కెమిస్ట్రీ కళాశాలకు ల్యాబ్ పరికరాలు అందించారు.



గత ఏడాది డిసెంబరు 13న జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొని వర్సిటీకి ఏయూ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ (ఎఏఎ)కు రూ.20లక్షల విరాళం అందించారు. తల్లిదండ్రులు లలితా దేవి పురాణం, కోటిలింగ పురాణం పేరిట ఏయూ ఫార్మా విద్యార్థినులకు వసతిగృహం నిర్మించారు.

**తల్లి మాటల స్ఫూర్తితో:** 'నీవు సంపాదించింది నీదికాదు.. ఇతరులకు ఇచ్చిందే నీది' అని మా అమ్మ ఎప్పుడూ చెబుతుండేది. నేను దాన్ని పూర్తిగా నమ్ముతున్నా. అమెరికాలో బాగా స్థిరపడినా ఏటా తల్లిదండ్రులను చూడటానికి భారత్ వస్తుంటా. అలాగే ఏయూని సందర్శిస్తుంటా. ఏప్రిల్‌లో జరగనున్న ఏయూ శతాబ్ది ఉత్సవాలకు ఆహ్వానించారు. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపకారవేతనాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నా. దేవ పురాణం, ఏయూ పూర్వవిద్యార్థి

# కోనసీమకు దీటుగా..

ఎలమంచిలి : సంక్రాంతి పండగ వేళ గోదావరి జిల్లాల్లో ఏర్పాటు చేసే కోడిపందేల శిబిరాలు ఎంతో ప్రఖ్యాతిగాంచాయి. అక్కడి పందెం బరులను చూడటానికి ఎక్కడెక్కడి నుంచో తరలివెళ్తారు. గోదావరి జిల్లాలకు దీటుగా ఇప్పుడు జిల్లాలోనూ కోడి పందేల బరులు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. గతేడాది పాయకరావుపేట, ఎలమంచిలి, చోడవరం, పెందుర్తి, నర్సీపట్నంలో శిబిరాలు ఏర్పాటు చేశారు. భోగి నుంచి మూడు రోజులపాటు పగలు, రాత్రి తేడాలేకుండా పందాలు నిర్వహించారు. ఈసారి మరో అడుగు ముందుకేసి కోనసీమ తరహాలో బరులతోపాటు టెంట్లు, గ్రిల్స్ ఏర్పాటు చేసి పందేల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్ల పార్కింగ్‌కి ప్రత్యేకంగా స్థలాలు కేటాయిస్తున్నారు. గతేడాది ఎలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం మండలం రామన్నపాలెం గ్రామంలో పందెం బరి ఏర్పాటు చేశారు. ఈ ఏడాది రాంబిల్లి మండలం వెంకటాపురంలో నిర్వహించాలని నిర్ణయించారు. పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లిలో గత ఏడాది నిర్వహించగా.. ఈ ఏడాది దీన్ని ఎస్.రాయవరం మండలానికి మార్చారు. కొత్తగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటైన అడ్డరోడ్డులో ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇదేతరహా ఏర్పాట్లు సాగుతుండటంతో పందేల ప్రేమికులు ఈ ఏడాది భీమవరం వెళ్లక్కర్లేదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**పదివేలకు పైగా సిద్ధం:** గతేడాది పండగ సమయంలో పందేలకు సరిపడా కోళ్లు లభించలేదు. స్థానికంగా ఉన్నవి సరిపోకపోవడంతో కోనసీమ జిల్లాలకు వెళ్లి అధిక ధరలకు కొని తెచ్చుకోవాల్సి వచ్చింది. అక్కడ కూడా తగినన్ని దొరక్కపోవడంతో కనుమ పండగ రోజున శిబిరాల్లో జనాల సందడి కనిపించలేదు.

దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది జిల్లాలో పదివేలకు పైగా పందెం పుంజులు పెంచి వాటికి శిక్షణ ఇచ్చి సిద్ధం చేశారని అంచనా. వారంరోజులుగా వీటి అమ్మకాలు జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. జాతి పుంజులు ఒక్కొక్కటి రూ. 10 వేల నుంచి నుంచి రూ. 15 వేల వరకూ విక్రయిస్తున్నారు.

# నిధులు దండు'కుంట'న్నారు.

కర్నూలు : ఉమ్మడి జిల్లాలో వేసవికుంటలు, వాటికి అనుసంధానంగా ఏర్పాటైన సీపీడబ్ల్యూఎస్ పథకాల నిర్వహణలో భారీ అక్రమాలు జరుగుతున్నాయి. కొందరు గుత్తేదారులు రాజకీయ పలుకుబడిని ఉపయోగించి దశాబ్దాలుగా పథకాలను తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. తక్కువకు టెండర్లు దక్కించుకుని.. పథకాలను సక్రమంగా నిర్వహించకుండా.. నిబంధనల మేరకు నీటిని శుద్ధి చేయకుండా రూ.కోట్లు స్వాహా చేస్తున్నారు. వేసవి కుంటల్లో కనీస నీటినిల్వలు లేకపోయినా.. శుద్ధి చేయకుండా నీటిని విడుదల చేస్తూ..ప్రభుత్వం కళ్లు కప్పి పూర్తిస్థాయిలో బిల్లులు జేబుల్లో వేసుకుంటున్నా అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులు ముడుపులకు ఆశపడి వారికి సహకరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**నమ్మబుద్ధికాని నీటిశుద్ధి** ఉమ్మడి కర్నూలు జిల్లాలో 39 వేసవికుంటలు (ఎస్ఎస్ ట్యాంకులు) ఉన్నాయి. వీటి ద్వారా 342 గ్రామాల పరిధిలోని 9.99 లక్షల మంది ప్రజలు శుద్ధినీరు సరఫరా చేయాల్సి ఉంది. వీటి నిర్వహణకు ప్రభుత్వం ఏటా రూ.25.89 కోట్లు కేటాయిస్తుంది. వీటి నుంచి సీపీడబ్ల్యూఎస్‌లకు నీటిని పంపింగ్ చేసిన తర్వాత అక్కడ శుద్ధిచేసి గ్రామాలకు సరఫరా చేయాల్సి ఉంది. నిబంధనల మేరకు నీటిశుద్ధి జరగడం లేదు. కొన్నిచోట్ల చెరువుల నుంచి వచ్చే నీటిని నేరుగా సరఫరా చేస్తున్నారు.

**నిర్వహణకు నీళ్లొదిలారు** 30– 35 ఏళ్ల కిందట నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకుల నీటి నిల్వ సామర్థ్యం ఏటా తగ్గిపోతోంది. పూడిక పేరుకుపోయింది. నాచు, పిచ్చిమొక్కలు పెరిగినా తొలగించడం లేదు. కొన్నేళ్లుగా నిర్వహణ పనులు చేపట్టిన దాఖలాల్లేవు. వీటిలో నీటి నిల్వ తగ్గిపోవడంతో అన్ని గ్రామాలకు నీరివ్వలేని పరిస్థితి నెలకొంది. కొందరు గుత్తేదారులు మాత్రం అన్ని గ్రామాలకు నీరు ఇస్తున్నట్లు ఎం.బుక్‌లో నమోదు చేస్తూ యథేచ్ఛగా బిల్లులు డ్రా చేస్తున్నారు. కొందరు ఉద్యోగులు వారికి సహకరిస్తూ నిధులు దోచిపెడుతున్నారు.

**'తక్కువ'కు దక్కించుకుని** సీపీడబ్ల్యూఎస్ పథకాలను దక్కించుకునేందుకు గుత్తేదారులు పోటీపడ్డారు. కొందరు ఏకంగా 40 శాతం వరకు తక్కువ (లెస్)కు టెండర్లు వేసి దక్కించుకున్నారు. 20– 25 శాతం తక్కువకు టెండర్లు వేసుకునే వెసులుబాటు ఉంది. పోటీ పెరగడంతో కొందరు అతి తక్కువ మొత్తానికి నీటి పథకాలు నిర్వహిస్తామని ముందుకొచ్చారు. ఆదోని డివిజన్ పరిధిలోని పలు పథకాలను 30– 40 శాతం తక్కువకే దక్కించుకున్నారు.

# నిధులు మూట కట్టు'కుంట'న్నారు

ఆదోని : ఆదోని పట్టణ ప్రజలకు నీళ్లు అందించాల్సిన నీటి కుంట.. నేతలకు కాసుల పంట పండిస్తోంది. పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించాల్సిన సాధారణ నిధులు 'కుంట'లోకి మళ్లించారు. తాత్కాలిక మరమ్మతుల పేరుతో ఇప్పటి వరకు రూ.4 కోట్ల వరకు ఖర్చు పెట్టారు. ఈ నిధులన్నీ కేవలం మట్టి పనులు, ఇసుక సంచులకు వినియోగించడం గమనార్హం. తాజాగా మళ్లీ అవే పనులకు నిధులు వినియోగిస్తున్నారు. పని విలువ రూ.40 లక్షలు దాటితే.. ప్రజారోగ్య (పబ్లిక్ హెల్త్) విభాగం చేతిల్లోకి వెళ్తుంది. ఈ నేపథ్యంలో రూ.కోటి విలువైన పనిని మూడు ప్యాకేజీలుగా.. టెండర్లు పిలుస్తున్నారు. 'స్థానిక' నేతలు దక్కించుకొని నిధులు పంచేసుకుం టున్నారు.

**ఇప్పటికే భారీగా ఖర్చు**

పట్టణ ప్రజలకు మంచినీరు అందించేందుకు బసాపురంలో నీటి కుంట నిర్మించారు. రూ.30 కోట్లు వెచ్చించి 150 ఎకరాల్లో నిర్మించిన దీనిని 2007లో వినియోగంలోకి తీసుకొచ్చారు. తుంగభద్ర దిగువ కాల్వ నుంచి నీటిని ఇందులోకి ఎత్తి పోస్తారు. 3,110 మిలియన్ లీటర్ల నీరు నిల్వ చేసి శుద్ధి చేసి పట్టణ ప్రజలకు అందిస్తుంటారు.

2019 ప్రాంతంలో కుంటలో రెండు చోట్ల సీసీ పలకలు చెదిరిపోయాయి. వీటిని సరి చేసేందుకు రూ.25 లక్షల వరకు వెచ్చించారు. 2021లో కుంట లోపలి భాగంలో ఓ చోట మట్టి కట్ట జారిపోయింది.. శాశ్వత పనులు చేయకుండా రూ.60 లక్షలు వెచ్చించి తాత్కాలిక



పనులతో సరిపెట్టారు. 2022లో రూ.1.80 కోట్ల సాధారణ నిధులతో రివిట్‌మెంట్ పనులు చేపట్టారు. 2022-23 ప్రాంతంలో మట్టి కట్టకు ఇసుక సంచులతో అడ్డుకట్ట వేసేందుకు రూ.కోటి వరకు వెచ్చించారు.

**తాజాగా అవే చేస్తూ..**

కుంట లోపలి భాగంలో 110 మీటర్ల చొప్పున మూడు చోట్ల మట్టి జారిపోయింది. నీటి నిల్వ ప్రశ్నార్థకంగా మారింది. తుంగభద్ర జలాశయం గేట్ల మరమ్మతుల కారణంగా వచ్చే నెల నుంచి కొంత కాలంపాటు ఎల్లెల్సీకి నీటి సరఫరా ఆపేస్తున్నారు.

కుంటలో 75 శాతం నీటితో నింపుకోవాలనే ఆలోచనతో రూ.1.15 కోట్ల వ్యయంతో మూడు చోట్ల మట్టి కట్ట పటిష్ఠత, ఇసుక బస్తాల అడ్డుకట్ట పనులు చేపడుతున్నారు. కుంటకు శాశ్వత పరిష్కారం లభించాలంటే.. లోపలి భాగంలో సీసీ పలకలు తొలగించాలి. రివిట్‌మెంట్ పనులు చేపట్టాలని నిపుణులు సూచించారు.

# రైతు నేస్తం.. నిస్తేజం

కర్నూలు : రైతులు పండించిన పంట దిగుబడుల క్రయ, విక్రయాల నిర్వహణ ద్వారా.. వ్యవసాయ విపణులు ఏటా రూ.కోట్లలో ఆదాయం ఆర్జిస్తున్నాయి. రూ.కోట్లు ఆర్జిస్తున్నా కర్షకులను విస్మరిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లు ఉన్నాయి. వీటిలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డుల్లో క్రయ, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మిగతాచోట్ల సీజన్‌లో నామమాత్రపు విక్రయాలు జరుగుతున్నాయి. 2019 నుంచి ఇప్పటి వరకు జిల్లాలోని 7 వ్యవసాయ మార్కెట్ల పరిధిలో రూ.150 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది.

**వసతుల్లేక వేదన**

ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ విపణుల్లో రైతులకు కనీస వసతులు కల్పించలేదు. కొన్నిచోట్ల రైతు విశ్రాంతి భవనాలు ఉన్నా.. నిర్వహణ లేక నిరుపయోగంగానే మారాయి. కర్షకులకు ప్రథమ చికిత్సలు అందించాల్సి ఉన్నా వాటి ఊసేలేదు. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన రైతు సంజీవని వైద్యశాల ఏడేళ్లుగా మూతపడి ఉంది. పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతులు అనారోగ్యం బారినపడితే ప్రథమ చికిత్సలు కూడా అందించలేని పరిస్థితి నెలకొంది.

మార్కెట్ కమిటీలు: కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, కోడుమూరు, మంత్రాలయం




2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.40.40 కోట్ల లక్ష్యం నిర్దేశించారు..ఇప్పటి వరకు రూ.16.80 కోట్లు సమకూరింది. మార్చి నాటికి రూ.23.60 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.

**పశువైద్య శిబిరాలకు మంగళం**

ప్రతి మార్కెట్ కమిటీ పరిధిలోని గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉంది. పశు సంవర్ధకశాఖ సహకారంతో ఏడాది కాలంలో ఐదు శిబిరాలు నిర్వహించాలి. ఇందు కోసం రూ.లక్ష వరకు ఖర్చు చేయాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాం నుంచి మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీలు పశువైద్య శిబిరాలకు మంగళం పాడాయి. 2019 నుంచి ఈ పశువైద్య శిబిరాలను పూర్తిగా అటకెక్కించారు. మార్కెట్ కమిటీల నుంచి రూ.వందల కోట్లలో ఆదాయం వస్తున్నా రైతుల సంక్షేమం కోసం పైసా ఖర్చు చేయడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**రహదారుల బాగును పట్టించుకోక..** వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. వ్యవసాయ మార్కెట్ కమిటీలకు వచ్చే ఆదాయం నుంచి పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామీణ రహదా రులను అభివృద్ధి చేయాల్సి ఉంది. గత ప్రభుత్వంలో 2022లో ఒక్కసారి మాత్రమే మార్కెటింగ్ శాఖ ద్వారా గ్రామీణ రహదారులకు నిధులు మంజూరు చేశారు. తర్వాత నిధుల మంజూరు పూర్తిగా నిలిచిపోయింది.

# ఇంధన పొదుపు.. పురస్కారాల వైపు!



గుంతకల్లు : సమర్థులైన విద్యుత్తు ఇంజినీర్ల కృషి కారణంగా ఏటా గుంతకల్లు డివిజన్‌కు చెందిన విద్యుత్తు విభాగం (ఆపరేషన్) జాతీయ స్థాయిలో ఇంధనం పొదుపు విషయంలో ప్రథమ స్థానంలో నిలుస్తోంది. దీనికి గుర్తింపుగా రాష్ట్రపతి నుంచి పురస్కారాలు అందుకోవడం విశేషం. ఉన్నతాధికారుల సహకారం, తోడ్పాటు, సూచనలతో కిందిస్థాయి ఇంజినీర్లు ఇంధనం పొదుపు పనులను పూర్తి చేస్తూ రైల్వేకు పెద్దఎత్తున నిధులను ఆదా చేస్తున్నారు.

ప్రస్తుత ఏడాది గుంతకల్లులోని డీజిల్ ట్రాక్షన్ శిక్షణ కేంద్రం, ఇదే కేంద్రానికి సంబంధించిన కేంద్ర వసతి గృహం మొదటి బహుమతి, రాయచూరు రైల్వే స్టేషన్ ద్వితీయ బహుమతిని అందుకున్నాయి. వాటిని రైల్వే ఉన్నతాధికారులు ఈనెల 14న దిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో పాటు కేంద్ర విద్యాత్తుశాఖామంత్రి మనోహర్ లాల్ నుంచి అందుకున్నారు.

**క్షేత్రస్థాయిలో కార్యాచరణ**

రైల్వే అధికారులు సాధారణ విద్యుత్తును తక్కువ వినియోగిస్తూ సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసి వివిధ రైల్వే కార్యాలయాలు, రైల్వేస్టేషన్‌లకు సరఫరా చేస్తున్నారు. సొంతంగా ఉత్పత్తి చేస్తున్న సౌర విద్యుత్తును కూడా ఆదా చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి విక్రయిస్తుండటం విశేషం. ఉదాహరణకు డీజిల్ ట్రాక్షన్ శిక్షణ కేంద్రం, వసతి గృహాలకు సంబంధించి 47,204 యూనిట్ల సౌరవిద్యుత్తును ఉత్పత్తి చేస్తూ ఇందులో 11,418 యూనిట్ల విద్యుత్తును మాత్రం వినియోగించుకొని మిగిలిన 35,786 యూనిట్ల విద్యుత్తును రాష్ట్ర విద్యుత్తు శాఖకు సరఫరా చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక యూనిట్‌కు రూ.3 వంతున రైల్వేకు చెల్లిస్తోంది.

**ఇలా సాధ్యం** రైల్వే కార్యాలయాల్లో సిబ్బంది ఉన్న సమయంలో విద్యుత్తు దీపాలు వెలగడం, సిబ్బంది లేకపోతే దీపాలు వాటంతట అవే ఆరిపోయే పరికరాలను ఏర్పాటు చేశారు.గ్రీజర్లు, నీటి కూలర్లు అవసరమైన సమయంలో పని చేసేలా సెన్సార్లను బిగించారు. ప్రతి విద్యుత్తు పరికరానికి టైమర్లను ఏర్పాటు చేసి విద్యుత్తును పొదుపు చేస్తున్నారు. అన్ని చోట్ల ఎల్‌ఈడీ దీపాలనే వినియోగిస్తున్నారు.

సెన్సార్ల వినియోగంతో రైల్వేకు మూడు విభాగాల నుంచి రూ. 30 లక్షలు విద్యుత్తు ఆదా నుంచి మిగులుతుండటం విశేషం.

సీనియర్ డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీఈఈ శ్రీనిబాష్‌ల ఆధ్వర్యంలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు సాయి హరికృష్ణ, మధుసూదన్‌రావ్, రామమోహన్‌తో పాటు ఇతర ఇంజినీర్లు ఇంధనాన్ని పొదుపు చేసే విధానాలను పర్యవేక్షిస్తుంటారు.

# క్రిటికల్ కేర్ పనులు చకచకా



హిందూపురం : ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్టక్చర్ మిషన్ కింద హిందూపురం జిల్లా ఆసుపత్రిలో రూ. 14 కోట్లతో ఏర్పాటు చేస్తున్న 50 పడకల అత్యవసర క్రిటికల్ కేర్ కేంద్రం సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఆసుపత్రి ఆవరణలోని మాతాశిశు కేంద్రం పైభాగంలో ఈ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం టైల్స్, ఎలక్ట్రికల్, ఇతర పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏ, బీ, సీ బ్లాకుల్లో 80 శాతం పనులు పూర్తికాగా డీ బ్లాకులో చేపట్టాల్సి ఉంది.

**ఎలాంటి సౌకర్యాలు..**

కేంద్రంలో లిఫ్ట్‌తో మొదలు అన్ని అత్యవసర సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ కేంద్రానికే ప్రత్యేకంగా వైద్యులు, సాంకేతిక సిబ్బందిని కేటాయిస్తారు. ట్రామాకేర్, ఐసీ యూనిట్, వెంటిలేటర్, ప్రత్యేక ఆపరేషన్ థియేటర్లు, సెంట్రల్ ఆక్సిజన్ సౌకర్యం, పరీక్షలు చేయటానికి ప్రత్యేక ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తారు.

**ప్రత్యేక పర్యవేక్షణ**

ఈ కేంద్రం సేవలు త్వరగా ప్రజలకు అందించేందుకు ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య విదానపరిషత్ అధికారి, తన సహాయకులు వీరయ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణలు పనులు పర్యవేక్షిస్తున్నారు. ఈ కేంద్రం సేవలు త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకొంటామని మెడికల్ సూపరింటెండెంట్ అన్నపూర్ణ తెలిపారు.

**ప్రయోజనాలు**

అన్ని అత్యవసర సేవలకు హిందూపురంలో వైద్యసేవలు అందించేందుకు అవకాశం కలుగుతుంది. ఇప్పటివరకు ప్రమాదాలకు గురై ప్రాణాపాయంతో ఉన్నవారిని, ప్రసవాలు కాక చివరి నిమిషంలో ఇబ్బందులు పడే గర్భిణులను అనంతపురం, బెంగళూరుకు తరలిస్తున్నారు. ఇది పూర్తయితే ఇలాంటి వారికి ఇక్కడే వైద్యసేవలు అందించే వీలుకలుగుతుంది.

# హెచ్చెల్సీ వాటా నేటితో పూర్తి



అనంతపురం : తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ (టీబీ హెచ్చెల్సీ) నీటి వాటా శుక్రవారంతో (19న) పూర్తి కానుంది. దామాషా నిష్పత్తి (ప్రొరేట్) ప్రకారం టీబీ మండలి కేటాయించిన నీటి కేటాయింపులో భాగంగా హెచ్చెల్సీకి 25.755 టీఎంసీలు లభించాయి. ఈ ఏడాది జులై 17న డ్యాం వద్ద నీరు విడుదల చేయగా.. జిల్లా సరిహద్దుకు అదే నెల 19వ తేదీన చేరాయి. ఆనాటి నుంచి ఇప్పటి దాకా నిర్విఘ్నంగా ప్రవాహం కొనసాగుతోంది. ఎపుడూ లేనివిధంగా ఈసారి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం ఏర్పడలేదు. గురువారం నాటికి టీబీ డ్యాం వద్ద 25.330 టీఎంసీలు విడుదల చేయగా.. జిల్లా సరిహద్దుకు 22.808 టీఎంసీలు చేరినట్లు గణంకాలు నమోదు చేశారు. నిర్దేశిత వాటాలో కేవలం 0.0425 టీఎంసీలు మాత్రమే సరఫరా కావాలి. శుక్రవారం నాటికి మిగిలిన జలాలు జిల్లాకు చేరుతాయి. వెనువెంటనే కేసీ కాలువ మళ్లింపు (డైవర్షన్) వాటా ప్రారంభం కానుంది. ఇదే విషయాన్ని హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు పేర్కొన్నారు. తాగు, సాగునీటికి ఏ ఇబ్బంది ఉండదన్నారు. రబీలో వరి పంట వేయవద్దని ఇప్పటికే రైతులకు అవగాహన కల్పించామన్నారు.

**3 టీఎంసీలు అదనం**

కేసీ కాలువ వాటా కింద హెచ్చెల్సీకి అదనంగా 3 టీఎంసీలు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ జలాలను జనవరి 15 దాకా తీసుకునే అవకాశం ఉంది. తొలుత 2 టీఎంసీలు కేటాయించినా.. తాజాగా మరొక టీఎంసీ ఇస్తామని ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. మొత్తంగా 3 టీఎంసీలు హెచ్చెల్సీకి రానున్నాయి. ఇప్పటిదాకా హెచ్చెల్సీ నీటి ప్రవాహం 163 రోజులుగా నడుస్తోంది. మరో మూడు వారాలకుపైగా ప్రవాహం కొనసాగనుంది.

**నిండుగా జలాశయాలు**

హెచ్చెల్సీ ప్రధాన కాలువ, గుంతకల్లు ఉప కాలువ(జీబీసీ), పీఏబీఆర్ లింకు కాలువ, ఎమ్పీఆర్ దక్షిణ, ఉత్తర, తాడిపత్రి, పులివెందుల.. ఇలా అన్ని ప్రధాన కాలువల్లో నీటి ప్రవాహం అంతరాయం లేకుండా కొనసాగుతోంది. జలాశయాలు సైతం నిండుగా కనిపిస్తున్నాయి. కణేకల్లు చెరువులో 0.242 టీఎంసీలు, పీఏబీఆర్‌లో 5.128, ఎమ్పీఆర్‌లో 4.841, సీబీఆర్‌లో 9.410, చాగల్లులో 0.854, పెండేకల్లులో 0.411, సుబ్బరాయసాగర్‌లో 0.010, ముచ్చుకోటలో 0.097 టీఎంసీల ప్రకారం నిల్వ ఉన్నాయి.

# కేంద్ర పద్దు.. నిర్లక్ష్యమొద్దు

కర్నూలు : కేంద్రం నిధులు ఇస్తోంది.. సకాలంలో ఖర్చు చేయడం లేదు.. జనవరి 15 నాటికి పూర్తిగా పనులు చేపట్టాలని కలెక్టర్ల సదస్సుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు.. ఉమ్మడి కర్నూలు జిల్లాకు కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు విడుదల చేస్తోంది. వీటిని ప్రణాళికాబద్ధంగా.. సకాలంలో ఖర్చు చేయాల్సి ఉంది. గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిధులను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమవడంతో తదుపరి సొమ్ము విడుదల కావడం లేదు. ఫలితంగా చాలా పనులు మధ్యలోనే ఆగిపోయాయి.

**గిడ్డంగి.. అడ్డంకి**

కర్నూలు మార్కెట్ యార్డులో రూ.5 కోట్ల ఆర్డీఎఫ్ నిధులతో 4 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో శీతల గిడ్డంగి నిర్మించాలని నిర్ణయించారు. 40 శాతం పనులు పూర్తయ్యేసరికి పథకం గడువు ముగిసింది. ఫలితంగా నిర్మాణం ఆగిపోయింది. మిగిలిన పనులు పూర్తి చేయాలంటే మరో రూ.4.50 కోట్ల వరకు వెచ్చించాల్సిన పరిస్థితి.

**మైనార్టీ విద్యపై చిన్నచూపు**

పీఎంజేకేవీఎస్ యోజన కింద మైనారిటీ విద్యార్థుల సంక్షేమం కోసం కేంద్రం రూ.250 కోట్లు విడుదల చేసింది. ఆయా నిధులను సరిగా వినియోగించుకోవడంలేదు.

ఆదోని మండలం ఆరేకల్లులో మైనారిటీ వృత్తివిద్యా కళాశాల, వసతిగృహాన్ని 2018లో చాలావరకు నిర్మించారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత భవనాన్ని ప్రారంభించకుండా వదిలేసింది.



ఆదోనిలో మైనారిటీ బాలికల జూనియర్ కళాశాల భవనాన్ని రూ.1.60 కోట్లతో నిర్మించారు. పనులు పూర్తైనా ప్రారంభించలేదు.

**అందని అమృత్ ఫలాలు**

కర్నూలు నగరవాసులకు 1.7 టీఎంసీల నీరు కావాల్సి ఉండగా ప్రస్తుతమున్న ఎస్.ఎస్. ట్యాంకు సామర్థ్యం 0.15 టీఎంసీ మాత్రమే. నగరంలో 33 ఒ.హెచ్.ఎస్.ఆర్. ట్యాంకులుండగా.. ప్రస్తుత అవసరాలకు అవి సరిపోవడంలేదు. దీంతో అమృత్ 2.0 కింద రూ.133 కోట్లతో జగన్నాథగట్టుపై వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రణాళికలు రూపొందించారు. 25 ఒ.హెచ్.ఎస్.ఆర్. ట్యాంకులు నిర్మించాలని నిర్ణయించారు. పథకం ముందుకు కదలడం లేదు.

**దిశచూపని సమావేశాలు**

దిశ్శ పేరుతో ప్రతి మూడు నెలలకోసారి సమీక్ష సమావేశాలు జరపాల్సి ఉంది. వీటిని మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు.

**మరికొన్ని ఇలా..**

202526 సంవత్సరానికి జిల్లాలో 4,276 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉండగా.. ఇప్పటివరకు 825 నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 722 వరకు వివిధ దశల్లో ఉన్నాయి. ఆర్థిక సంవత్సరం గడువు సమీపిస్తున్నా నేటికీ 2,729 శౌచాలయాల పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు. సుంకేసుల నుంచి మునగాలపాడు పంపుహౌస్ వరకు 22 కి.మీ.ల మేర రూ.77 కోట్లతో పైపులైను పనులు చేపట్టారు. నాలుగేళ్లుగా సాగుతూనే ఉన్నాయి.

కర్నూలు జిల్లాలో 912 అంగన్‌వాడీ కేంద్రాలను నేటికీ అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. 142 భవన నిర్మాణాలు మొదలుపెట్టినా పనులు పూర్తి కాలేదు. ఏఐఐబీ పథకం కింద 250కి మించి జనాభా ఉన్న గ్రామాలకు రూ.132.38 కోట్లతో రహదారులను నిర్మించాలని నిర్ణయించారు. అందులో భాగంగా 85 పనులు చేపట్టాలని నిర్ణయించారు. నేటికీ 20 పనులు ప్రారంభించనేలేదు.

# కర్షక హితం పట్టని వ్యవసాయ విపణి

నంద్యాల : రైతులు పండించిన పంట దిగుబడుల క్రయ, విక్రయాల నిర్వహణ ద్వారా.. వ్యవసాయ విపణులు ఏటా రూ.కోట్లలో ఆదాయం ఆర్జిస్తున్నాయి. ఈ ఆదాయంలో కొంత మొత్తాన్ని రైతుల సేవకు వినియోగించాలి. రూ.కోట్లు ఆర్జిస్తున్నా కర్షకులను విస్మరిస్తున్నారు.

**పశువైద్య శిబిరాలకు మంగళం**

ప్రతి మార్కెట్ కమిటీ పరిధిలోని గ్రామాల్లో ఏడాదిలో ఐదు పశువైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉంది. రూ.లక్ష వరకు ఖర్చు చేయాల్సి ఉంది. మందులు కొనుగోలు చేయడానికి పశు సంవర్ధక శాఖకు మార్కెటింగ్ శాఖ నిధులు మంజూరు చేయాలి. లేదా పశు సంవర్ధక శాఖ అధికారుల సలహా మేరకు మార్కెటింగ్ శాఖనే మందులను కొనుగోలు చేయాలి.

గత ప్రభుత్వ హయాం నుంచి మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీలు పశువైద్య శిబిరాలకు మంగళం పాడాయి. 2019 నుంచి ఈ పశువైద్య శిబిరాలను పూర్తిగా అటకెక్కించారు.



**ఏటా రూ.కోట్ల ఆదాయం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లు ఉన్నాయి. 2019 నుంచి ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలోని 7 వ్యవసాయ మార్కెట్ల పరిధిలో రూ.150 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. నంద్యాల జిల్లాలోని 8 వ్యవసాయ మార్కెట్ల ద్వారా రూ.వంద కోట్లకు పైగా ఆదాయం సమకూరింది.

**రహదారుల బాగును పట్టించుకోక..**

వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. వ్యవసాయ మార్కెట్ కమిటీలకు వచ్చే ఆదాయం నుంచి పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయాల్సి ఉంది.

గత ప్రభుత్వంలో 2022లో ఒక్కసారి మాత్రమే మార్కెటింగ్ శాఖ ద్వారా గ్రామీణ రహదారులకు నిధులు మంజూరు చేశారు. తర్వాత నిధుల మంజూరు పూర్తిగా నిలిచిపోయింది. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక పంట పొలాలకు వెళ్లే దారులు దారుణంగా దెబ్బతిన్నాయి. వర్షాకాలంలో బురదమయం అవుతున్నాయి. ఈ అధ్వాన దారుల్లో పంట ఉత్పత్తులను తరలించేందుకు రైతులు నరకయాతన అనుభవిస్తున్నారు.

చురకలు



## నాడు ఎంతో.. నేడూ అంతే!

పెనుగొండ :పాలకోడేరు మండలం విస్సాకోడేరు శివారు విస్సాకోడేరుపాలెం ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదుల భవన నిర్మాణం రెండున్నరేళ్లుగా పునాది స్థాయిలోనే నిలిచిపోయింది. దీంతో పాత భవనంలోనే ఒకే గదిలో రెండు, మూడు తరగతులు నిర్వహిస్తున్నారు. పెనుగొండ మండలం రామన్నపాలెంలో నాడు-నేడు పథకం రెండో దశలో నిర్మాణం చేపట్టిన ప్రాథమికోన్నత పాఠశాల భవనం దుస్థితి ఇది. నిధుల జాప్యంతో నిర్మాణం పూర్తికాక నేటికీ పాతబడిన భవనంలోనే తరగతులను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం



ఇక్కడ 58 మంది చదువుతున్నారు.

వైకాపా ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో రెండో దశలో చేపట్టిన పనులకు నిధులు మంజూరు చేయకపోవడంతో నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 750 పాఠశాలల్లో సుమారు 5వేల పనులను ప్రతిపాదించగా, 90 శాతం ప్రారంభించారు. 50 శాతం పూర్తికాగా, నిధుల లేమితో మిగిలినవి వివిధ దశల్లో నిలిచిపోయాయి. కిటికీలు, తలుపులు లేవు.. కొత్త భవనాల నిర్మాణం, పాత భవనాల ఆధునికీకరణ 40 శాతం పూర్తిచేసినా చాలా చోట్ల కిటికీలు, తలుపులు పెట్టకుండా వదిలేశారు. మరుగుదొడ్లు, వంట గదులకు సైతం నేటికీ తలుపుల ఏర్పాటు పూర్తికాలేదు. పెనుగొండ మండలం మునమర్రు ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో నాడు-నేడు పథకం రెండో దశలో ఎంపికైంది. సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో నిర్మాణ పనులు చేపట్టలేదు. భవనం పూర్తిగా దెబ్బతినడంతో ప్రస్తుతం సమీప పంచాయతీ కార్యాలయ భవనంలో తరగతులను నిర్వహిస్తున్నారు.

అసంపూర్తిగా నిర్మాణం.. రెండో దశలో మంజూరైన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చాలా చోట్ల మధ్యలోనే నిలిచిపోయాయి. పాలకోడేరు, భీమవరం, పెనుగొండ, పెనుమంట్ర, మొగల్తూరు, ఆచంట, గణపవరం మండలాల్లో చేపట్టిన నిర్మాణాలు పునాది, శ్లాబు దశలో నిలిచిపోయి అసంపూర్తిగా ఎదురుచూస్తున్నాయి.

సిద్ధం చేస్తున్నాం.. నిలిచిపోయిన పనుల పూర్తికి అవసరమైన నిధుల వ్యయంపై ప్రభుత్వ ఆదేశాల మేరకు అంచనా వేస్తున్నాం. కొత్తగా చేపట్టాల్సిన పనులకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం' అని సమగ్ర శిక్షా సమన్వయకర్త శ్యామ్‌సుందర్ తెలిపారు.

## తేమంటూ కోత.. నూకంటూ మేత..!

ఆగిరిపల్లి : తేమ, నూక పేరుతో మిల్లర్లు, దళారుల దోపిడీకి పాల్పడుతున్నారు. వారికి కొందరు సిబ్బంది సహకరిస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని అన్నదాతలు వాపోతున్నారు. ఖరీఫ్‌లో ఓ వైపు ప్రకృతి సహకరించక అధిక వర్షాలు, ఆపై మొంథా తుపాను ప్రభావంతో దిగుబడులు తగ్గాయి. మరో పక్క తేమ శాతం ఎక్కువగా ఉందని మిల్లర్లు దోచుకుంటున్నారు. ఈ పరిస్థితిల్లో అండగా ఉండాల్సిన యంత్రాంగం కొర్రీలతో రైతులను ఇబ్బందులు పెడుతోంది.

ఆగిరిపల్లి మండలం చొప్పరమెట్లలో ఓ రైతుకు చెందిన ధాన్యం తేమ శాతం చూడగా 22-23 మధ్య ఉంది. నిబంధన ప్రకారం 17 శాతం ఉండాలి. అంతకన్నా ఎక్కువ ఉంటే ఆరబెట్టాలి. కానీ అదనంగా ఉన్న శాతానికి పాయింట్ రిజిస్ట్రేషన్ కిలో చొప్పున ధాన్యాన్ని మిల్లర్లు



తీసుకున్నారు. ముసునూరుకు చెందిన రైతులు గన్నీ సంచులు కోసం దళారులకు నగదు చెల్లించాల్సిన పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నూకలున్నాయని తూకంలో కోత పెడుతున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ముదినేపల్లికి చెందిన రైతు ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తే గడ్డిపరకలు ఉన్నాయని.. బస్తాకు 3 కేజీలు తరుగు తీశారు. ధాన్యాన్ని తీసుకువెళ్లేందుకు వాహనం పంపక పోవడంతో రూ.3 వేలు సొంత కిరాయి చెల్లించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

**నిబంధనలు బేఖాతర్**

తేమ శాతం కల్లం వద్ద చూసి ఇంకా ఆరబెట్టాలని చెబితే ఆరబెట్టుకుంటారు. మిల్లుకు చేరే లోపు ఆరతాయని తొలుత బస్తాల్లో నింపేస్తున్నారు. తీరా మిల్లు వద్దకు వెళ్లాక ఇంకా ఆరలేదని చెప్పడంతో వాటిని వెనక్కు తీసుకెళ్లలేక నష్టపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అమ్మేసుకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'రైతులను ఇబ్బందులు పెట్టే మిల్లర్లపై చర్యలు తీసుకుంటాం. వారికి సిబ్బంది సహకరిస్తే.. వారిపైనా శాఖాపరమైన చర్యలు తప్పవు' అని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా తెలిపారు.

## విలువైన మట్టి.. మాఫియా చెరబట్టి

అమలాపురం : డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని గోదావరి లంక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని మట్టి మాఫియా రెచ్చిపోతోంది. రాత్రి పది దాటితే చాలు వందల సంఖ్యలో లారీలు మట్టి లోడుతో దూసుకుపోతున్నాయి. కొత్తపేట మండలంలో మందపల్లి ఇసుక ర్యాంపు సమీపంలోని గోదావరి చెంతన, లంక ప్రాంతాల్లో వారం రోజులుగా తవ్వకాలు చేస్తున్నారు. నారాయణలంక, కేదార్లంక, రావులపాలెం మండలం కొమరాజులంక, ఊబలంక బట్టీల వద్ద.. ఆలమూరు మండలం చొప్పెల్ల, మూలస్థానం.. ఆత్రేయపురం మండలం అంకంపాలెం, నార్కేడుమిల్లి, రాజవరం, వెలిచేరు, తాడిపూడిలోని లంకల్లోనూ తవ్వేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నిబంధనలకు తూట్లు..లంకల్లో రైతులు ఎక్కువ శాతం వ్యవసాయం చేస్తుంటారు. నిబంధనల మేరకు ఇక్కడినుంచి గుప్పెడు మట్టి కూడా తరలించేందుకు వీలులేదు. కొత్తపేట పరిధిలో దాదాపు 500 ఇటుక బట్టీలుండగా, ఒక్కోదానికి 300 లారీల మట్టి అవసరం. దీనిని అదునుగా చేసుకుని మట్టి మాఫియా లారీ మట్టి రూ.10 వేల నుంచి రూ.15 వేలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ భూముల్లోనూ అడ్డగోలుగా తవ్వకాలు చేస్తున్నారు. ఎక్కడా రెవెన్యూ, భూగర్భ గనులశాఖ అనుమతులు లేవు. య కొందరు రైతులు సైతం అక్రమార్కులు ఇచ్చే డబ్బులు తీసుకొని భూములు అప్పగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

# పంట తీపి.. ప్రతిఫలం చేదు..



పుత్తూరు : రాష్ట్రంలో ఏ జిల్లాలో లేనన్ని చక్కెర కర్మాగారాలు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉండేవి. కానీ తదనంతర కాలంలో చాలా వరకు మూత పడటంతో రైతులు రోడ్డున పడ్డారు. వేరే దిక్కు లేక ఇతర పంటలవైపు మళ్లుతున్నారు.

**అప్పులు తెచ్చి సాగు చేస్తున్నా..**

అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టినా చెరకు పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. ఏటా పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా ప్రభుత్వాలు ధర కల్పించడంలో విఫలమవుతున్నాయి. ఫలితంగా చాలా మంది రైతులు సాగుకు దూరం అవుతున్నారు. ఉమ్మడి జిల్లా రెండు దశాబ్దాల క్రితం వరకు చెరకు సాగు విస్తీర్ణంలో ముందుండేది. తర్వాత కొత్తరకం విత్తనాలు అందుబాటులోకి రాకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గింది.

**మిగిలింది ఒక్కటే..**

చిత్తూరు, గాజులమండ్యం వద్ద ఎస్వీ చక్కెర కర్మాగారాలు, బీఎన్‌కండ్రిగ వద్ద మయూరి, నింద్ర వద్ద నేతమ్స్, పుంగనూరులో వాణి కర్మాగారం మూతపడ్డాయి. ప్రస్తుతం జిల్లా రైతులు పంటను ఎస్ఆర్‌పురం మండలం నెలవాయి వద్దనున్న ఎస్ఎన్‌జే కర్మాగారానికి తరలిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇది ఒక్కటే దిక్కు. సరిహద్దు ప్రాంతాల్లోని రైతులు పంటను ఏజెంట్ల ద్వారా తమిళనాడు తరలిస్తున్నారు. దీంతో ధరలు రావడం లేదు.

**రికవరీ వస్తేనే ధర..**

ప్రభుత్వం ప్రకటించిన ధర రైతుల కష్టానికి సరిపోవడం లేదు. గతేడాది టన్ను రూ.3151 కాగా, ఈ ఏడాది రూ.3,290గా ప్రకటించారు. ఏడాదికి టన్నుకు రూ.139 పెంచారు. కానీ కూలీ, ఎరువులు, పెట్టుబడి ఖర్చులు పెరగడంతో రైతులు కుదేలవుతున్నారు. దీనికి తోడు 9.5 శాతం రికవరీ వస్తేనే ఆ ధర చెల్లిస్తున్నారు. లేకపోతే ధరలో వ్యత్యాసం చూపుతున్నారు.

# ఇంటి నుంచే కొలువు



చిత్తూరు : విద్యార్హతలు ఉన్నా పరిస్థితుల ప్రభావంతో ఉద్యోగాలకు బయటకు వెళ్లలేక చాలామంది స్థానికంగానే ఉండిపోతున్నారు. ఇలాంటి వారి కోసం కూటమి ప్రభుత్వం కౌశలం పథకానికి శ్రీకారం చుట్టింది. ఇంటి నుంచే ఉద్యోగం చేసే అవకాశాన్ని కల్పిస్తోంది. వర్క్ ఫ్రం హెూంకు ఆసక్తి గల నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది.

**మరికొందరు ముందుకు**

కౌశలం సర్వే పూర్తయిన తర్వాత మరికొంత మంది వర్క్ ఫ్రం హెూంకు ముందుకు వచ్చారు. తాజాగా మరో 16 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఐటీఐ చదివిన వారు 446, డిప్లొమా 520, డిగ్రీ 8,346, పీజీ 1,922, పీజీ డిప్లొమా అభ్యర్థులు ఏడుగురు ఉన్నారు.

**సర్వే పూర్తయిన వారికి పరీక్షలు**

సర్వే పూర్తయిన నిరుద్యోగులకు ప్రస్తుతం సచివాలయాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలో కంప్యూటర్ నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, రీజనింగ్ అంశాల్లో ప్రశ్నలు ఉంటున్నాయి.

**ఇలా చేస్తున్నారు..**

నిరుద్యోగుల అర్హతల నిర్ధారణకు గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగులు సర్వే చేస్తున్నారు.

విద్యార్హతల ధ్రువపత్రాలను కౌశలం యాప్‌లో అప్‌లోడ్ చేశారు.

వీరికి సచివాలయాల్లో నైపుణ్య పరీక్ష నిర్వహిస్తున్నారు.


ఉత్తీర్ణులైన వారికి వర్క్ ఫ్రం హెూం అవకాశం కల్పించేలా ప్రణాళికల్ని అమలుచేయనున్నారు.

వివరాలు ఇలా..గ్రామ/వార్డు సచివాలయాలు: 612

వర్క్ ఫ్రం హెూంకు అర్హులు: 71,332 మంది

ఆసక్తి చూపనివారు: 17 వేల మంది

# ఇంకెన్నాళ్లీ ఉత్తుత్తి ప్రయోగాలు



తిరుపతి : ప్రపంచమంతా శాస్త్ర, సాంకేతిక రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్నా మన విద్యావ్యవస్థలోని లోపాలు మాత్రం మారడం లేదు. పాఠశాల, ఇంటర్ స్థాయిలో విద్యార్థులు కనీసం ప్రయోగశాలల ముఖం చూడకుండానే ఉన్నత విద్య వైపు పరుగులు పెడుతూ ఆవిష్కరణల్లో పాతాళంలో ఉంటున్నారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల సైన్స్ ల్యాబ్‌లను పరిశీలిస్తే అదే కళ్లకు కడుతోంది. సైన్స్ విద్యార్థులకు ఇంటర్, డిగ్రీ స్థాయిలో ప్రయోగ పాఠాలు తప్పనిసరి. భౌతిక, రసాయన, జీవ, వృక్ష శాస్త్రాల్లో ప్రయోగ పూర్వకంగా నేర్చుకొనే పాఠ్యాంశాలే ఎక్కువగా ఉంటాయి. ఇంటర్‌స్థాయిలో ప్రయోగశాల గదులు బోర్డులకే పరిమితమవుతున్నాయి. లోపల ఖాళీ టేబుళ్లు, పగిలిపోయిన సీసాలు, బూజు పట్టిన పరికరాలే కనిపిస్తున్నాయి. అడపాదడపా జరిగే సైన్స్ ప్రదర్శనల్లో కొనుక్కొచ్చినవే ఉంటున్నాయి.

**తితిదేలోనూ సమస్యలే**

తితిదే విద్యాసంస్థల్లో వేలసంఖ్యలో విద్యార్థులు ఉన్నారు. తగిన సంపత్తి ఉన్నా నిర్వహణ లోపాలు వెంటాడుతున్నాయి. ల్యాబ్‌లు ఉన్నా ప్రయోగాల విషయంలో ప్రోత్సాహం కరవైందని, పూర్తిస్థాయిలో పరికరాలు, రసాయనాలు లేవని చెబుతున్నారు. నిధుల కొరత లేని నేపథ్యంలో తితిదే ఆధ్వర్యంలో అధునాతన కేంద్రీయ ప్రయోగశాల నిర్మిస్తే మేలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**తనిఖీలు శూన్యం**

విద్యాశాఖ అధికారుల తనిఖీలు నామమాత్రంగా మారడంతో సైన్స్ ప్రయోగశాలల నిర్వహణపై ఎవరికీ పట్టింపులేకుండా పోయింది. విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు జరుగుతున్నాయా? లేదా? కావాల్సిన ముడిసరకులు, రసాయనాలు అందుబాటులో ఉన్నాయా? లేవా? వంటివి ఎవరూ పట్టించుకోవడం లేదు.

**90% కళాశాలల్లో అదేతీరు**

జిల్లాలోని విద్యాసంస్థల్లో పదిశాతం వరకే ప్రయోగశాలలు కొంతవరకు నిర్వహిస్తున్నాయని, మిగతా పాఠశాలలన్నీ వాటికి నీళ్లు వదిలేసినట్లు తెలుస్తోంది. పరిశీలనలో బోర్డులు, టేబుళ్లు, నాలుగు సీసాలు మాత్రమే కనిపించాయి. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు సైన్స్ ప్రాక్టికల్స్‌కు ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వడం లేదు. రెండో ఏడాదిలో 30 మార్కులు చొప్పున ఉన్నా మాయచేస్తున్నారు. చాలా కళాశాలల్లో సరైన ల్యాబ్ పరికరాలు, అందుకు ఉపయోగించే రసాయనాలు కనిపించట్లేదు. ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థులకు ప్రయోగాలంటేనే తెలియని పరిస్థితి నెలకొంది. యాజమాన్యాలు రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేసినా బట్టీ చదువులకు పరిమితం చేస్తున్నాయి. పైపెచ్చు ప్రాక్టికల్స్ మార్కుల పేరుతో బెదిరింపులకు దిగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాలోని ఉన్నత పాఠశాలలు: 659

విద్యార్థులు: 1.26 లక్షలు

జూనియర్ కళాశాలలు 185

విద్యార్థులు: 59,472

తితిదే విద్యాసంస్థలు: 7

విద్యార్థులు: 7,674

# కంది పంటలో గంజాయి సాగు



ర్నూలు జిల్లా చిప్పగిరి మండలం దేగులపాడు గ్రామంలో కంది పంటలో గంజాయి సాగు బట్టబయలైంది. వివరాల్లోకి వెళ్తే.. దేగులపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 176, 30 ఎకరాల విస్తీర్ణంలో ఎండోమెంట్ భూమి ఉంది. అందులో సుమారు 15 ఎకరాల భూమిని రైతులకు సాగు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. దేగులపాడు గ్రామానికి చెందిన ఉనేబాద్ శివయ్య అనే వ్యక్తి కంది పంటలో గంజాయి సాగు చేసినట్లు సమాచారం అందింది. ఆలూరు ఎక్సైజ్ సీఐ లలిత, ఆలూరు సీఐ రవి శంకర్ రెడ్డి, చిప్పగిరి ఎస్సై సతీష్ కుమార్, తహసీల్దార్ ఇజాజ్ అహ్మద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సునీత, తదితర అధికారులు శుక్రవారం దేగలహాల్ గ్రామ రెవెన్యూ పొలాల్లో దాడులను నిర్వహించి గంజాయి సాగును గుర్తించారు.

## కొంగొత్త సొబగులు.. భవితకు వెలుగులు

రాజమహేంద్రవరం : ఏటా వేలాదిమందికి ఉన్నత విద్య అందిస్తూ వారి భవితను తీర్చిదిద్దుతున్న రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల (అటానమస్) మరిన్ని సొబగులు సంతరించుకుంది. 172 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ కళాశాలకు ప్రభుత్వం, దాతలు, కళాశాల నిధులతో ఆధునిక వసతులు సమకూరాయి. వీటిని రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ప్రారంభించనున్నారు. 6,200 మంది చదివే ఈ కళాశాలకు కార్పొరేట్ స్థాయిలో రూ.32 లక్షలతో(రుడా రూ.20లక్షలు, నిర్వహణ నిధులు రూ.12 లక్షలు) ముఖద్వారాన్ని నిర్మించారు. బ్లాకులు, కార్యాలయాల గదికి వెళ్లేందుకు రూ.12 లక్షలతో నిర్మించిన ఇన్నర్ గేట్‌నూ మంత్రి ప్రారంభిస్తారు. ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించేలా ఇన్నోవేషన్-ఇంక్యుబేషన్ హబ్ ఇక్కడ ఉంది. హన్‌సా సొల్యూషన్స్ సంస్థ(హైదరాబాద్) రూ.1.2 కోట్ల సీఎస్ఆర్ నిధులు కేటాయించింది. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌తో మంత్రి లోకేశ్ సమక్షంలో ఎంవోయూ కుదుర్చుకోనున్నారు. సైన్స్, ఆర్ట్స్, కామర్స్ విభాగాలకు వేర్వేరు బ్లాకులు ఏర్పాటుచేశారు. తిరుమల విద్యాసంస్థల అధినేత, కళాశాల పూర్వ విద్యార్థి నున్న తిరుమలరావు రూ.46 లక్షలతో కామర్స్ బ్లాక్ ఏర్పాటుకు సహకరించారు. వందేమాతరం ఉద్యమానికి ప్రతీకగా సైన్స్ బ్లాక్ వద్ద వందేమాతరం పార్కు ఆవిష్కరణ, విదేశీ విద్యార్థుల బ్లాక్, గ్రంథాలయాన్ని లోకేశ్ సందర్శిస్తారు. భవానీ ఛారిటబుల్ ట్రస్ట్ సమకూర్చిన



8 ల్యాప్‌టాప్‌లను విద్యార్థులకు అందజేస్తారు.

**విద్యార్థులతో ముఖాముఖి**

కళాశాలలో ఏర్పాటుచేసిన బహిరంగ వేదిక వద్ద సుమారు 2500 మంది విద్యార్థులనుద్దేశించి లోకేశ్ ప్రసంగిస్తారు. కొందరితో ముఖాముఖి మాట్లాడతారు.

**ఇవి అవసరం...**

విదేశీ విద్యార్థులకు వసతి గృహం, బహుళ క్రీడా సముదాయం, కాన్వొకేషన్ హాల్, గ్రంథాలయం ఏర్పాటుకు ప్రత్యేకంగా సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

**నన్నయలో నూతన భవనాలు..**

నన్నయ విశ్వవిద్యాలయంలో కొన్నేళ్లుగా విద్యార్థులు ఎదుర్కొంటున్న తరగతి గదుల సమస్యకు పరిష్కారం లభించనుంది. ఏళ్ల తరబడి అవసరమైన భవనాలు లేక కొన్ని తరగతులు సరిగ్గా జరగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీసీ ఎస్.ప్రసన్నశ్రీ ఆధ్వర్యంలో భవన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. నేడు మంత్రి లోకేశ్ ప్రారంభించనున్నారు.

**అందుబాటులోకి వచ్చేవి..**

రూ.20.05 కోట్లతో ఇంజినీరింగ్ కళాశాల భవనం నిర్మించారు. రూ.8.25 కోట్లతో పరీక్షల విభాగం, రూ.5.50 కోట్లతో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ కళాశాల భవనాలు పూర్తి చేశారు. 'పలు భవనాలను రూ.34 కోట్లతో పూర్తి చేశాం. ఆ భవనాలకు తెలుగుదనం ఉట్టిపడేలా పేర్లు పెట్టాం. ' వీసీ ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు.

## ముంపు ఆపేలా.. ముప్పు తప్పేలా

నిడదవోలు : ఎర్రకాలువ ఈ ఏడాది పూర్తిస్థాయిలో ఉధృతి దాల్చకపోవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతం వరి కోతలు పూర్తిచేసి ధాన్యాన్ని విక్రయించుకున్నారు. అయినా వచ్చే ఏడాది మళ్లీ షరా మామూలే అన్న ఆందోళన మాత్రం అన్నదాతలను వీడడం లేదు. ఎర్రకాలువ ఏ మాత్రం పొంగినా ఇటు తూర్పు, అటు పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో 20 వేల ఎకరాల వరకు పంట, పలు గ్రామాలు జలమయమవుతాయి.

**ముందస్తు చర్యలతో..**

ఈ ముప్పును కొంతమేరకైనా తప్పించేందుకు అధికారులు, పాలకులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందుకు రూ.300 కోట్లు అవసరమని గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. ఈ నిధులు రావడానికి సమయం పట్టే అవకాశం ఉండటంతో నిడదవోలు నియోజకవర్గ పరిధిలో రూ.2 కోట్ల మేర అత్యవసర పనులు గుర్తించి ప్రతిపాదనలు పంపించారు. మంత్రి కందుల దుర్గేష్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్(ఎఫ్‌డీఆర్) నిధుల కింద రూ.1.80 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులలో మండలంలోని సింగవరం వద్ద రెండు ప్రాంతాల్లో రూ.35 లక్షలతో 8 ఇన్‌లెట్ గేట్లు ఏర్పాటు చేయనున్నారు. దీనివల్ల సుమారు 1000 నుంచి 2 వేల ఎకరాలకు ముంపు సమస్య తప్పుతుం



ది. 28వ కి.మీ. వద్ద అయిదు ఖానాలు, 26 నుంచి 27వ కి.మీ.ల మధ్య మూడు ఖానాలకు ఈ గేట్లు ఏర్పాటు చేస్తారు. కంసాలిపాలెం డ్యాం వద్ద కొట్టుకుపోయిన గట్టు కాంక్రీట్ పనులకు రూ.15 లక్షలు, కాలువ ఎర్త్ వర్క్‌కు రూ.1.30 కోట్లు వెచ్చించనున్నారు.

**టెండర్ల దశలో ఉంది..** -అనిల్‌కుమార్, ఏఈ, తాడేపల్లిగూడెం

సింగవరంలో 8 గేట్లు ఏర్పాటు, కంసాలిపాలెం వద్ద కోతకు గురైన డ్యాం ప్రాంతంలో కాంక్రీట్ పనులు, కాలువ ఎర్త్ పనులకు నిధులు మంజూరయ్యాయి. ఆ పనులు టెండర్ల దశలో ఉన్నాయి. ప్రస్తుతం గట్టు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ఇసుక బస్తాలు ఏర్పాటు చేశాం.

చురకలు






# లక్కీ ఛాన్స్ కొట్టేసిన సైయారా బ్యూటీ.. ఆ సినిమాటిక్ యూనివర్స్ లో భాగం

ఒక్కొక్కసారి అదృష్టం ఎలా ఉంటుంది అంటే అనూహ్యంగా ఓవర్ నైట్ లోనే స్టార్ సెలబ్రిటీలు అయిపోతూ ఉంటారు. ఆ తర్వాత వారికి వరుసగా అవకాశాలు కూడా తలుపుతడతాయి. అలా ఇప్పటికే ఇండస్ట్రీలోకి వచ్చిన మొదటి సినిమాతోనే భారీ విజయాలను సొంతం చేసుకుని.. వరుస సినిమాలలో అవకాశాలు అందుకున్న హీరోయిన్స్ జాబితాలోకి 'సైయారా' బ్యూటీ కూడా వచ్చి చేరింది. బాలీవుడ్ లో ఈ ఏడాది చిన్న సినిమాగా వచ్చి సంచలనం సృష్టించింది ఈ సినిమా. ఇందులో నటించింది కొత్త నటీనటులు.. అయినా సరే ఏకంగా రూ.600 కోట్ల క్లబ్లో చేరిపోయి సంచలనం సృష్టించింది. ముఖ్యంగా ఈ సినిమా ఇంత పెద్ద హిట్ అవ్వడానికి కథ కథనంతో పాటు లీడ్ రోల్స్ చేసిన అద్భుతమైన పర్ఫామెన్స్ ముఖ్య కారణం అని చెప్పవచ్చు. ప్రముఖ హీరోయిన్ అనన్య పాండే సోదరుడు అహాన్ పాండే, అనీత్ పడ్డా.. ఇద్దరికీ ఈ సినిమా తొలి సినిమానే అయినా ఏదో నటనలో పూర్తి అనుభవం ఉన్న నటీనటుల్లా నటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. యువత ఈ చిత్రానికి ఎంతలా కనెక్ట్ అయ్యింది అంటే సినిమా పూర్తి అయిన తర్వాత థియేటర్లలోనే ఏడ్చేసిన ఘటనలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. అంతేకాదు సినీ ఇండస్ట్రీలో ఒక యూత్ ఫుల్ రొమాంటిక్ చిత్రానికి యువత కనెక్ట్ అయ్యి ఏడ్చిన ఏకైక చిత్రం ఈ



సైయారా అని చెప్పవచ్చు. ఈ సినిమాతో ఇద్దరికీ అభిమానులు తమ గుండెల్లో గుడి కట్టేశారు అనడంలో సందేహం లేదు. అటు అహాన్ పాండే కూడా ఒక భారీ ప్రాజెక్టులో అవకాశం దక్కించుకోగా.. ఇప్పుడు అనీత్ పడ్డా కూడా ఆ సినిమాటిక్ యూనివర్స్ లో భాగం కాబోతోందని మేకర్స్ స్వయంగా ప్రకటించడంతో అనీత్ పడ్డా అభిమానుల ఆనందానికి అవధులు లేవని చెప్పవచ్చు. అసలు విషయంలోకి వెళ్తే.. అందం , అభినయంతో అందరినీ ఆకట్టుకున్న అనీత్ పడ్డాతో సైయారా విడుదలకు ముందే యశ్ రాజ్ ఫిలిమ్స్ వాళ్ళు ఇంకో మూడు చిత్రాలకు ఆమెతో అగ్రిమెంట్ చేయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా వేరే ప్రొడక్షన్ హౌస్ ల నుంచి కూడా ఈమెకు అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. ఇటు మరోవైపు ప్రస్తుతం బాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ బ్యానర్లలో ఒకటైన మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ కూడా ఈమెతో ఒక క్రేజీ మూవీ చేయడానికి ప్లాన్ చేసింది. ఇక అందులో భాగంగానే తాజాగా మ్యాడ్ డాక్ హారర్ కామెడీ యూనివర్స్ లో భాగంగా ఈరోజు భారీ ఎత్తున విడుదలైన చిత్రం థామా. ఈ సినిమా చివర్లో ఈ ఫ్రాంచైజీలో కొత్త సినిమా విశేషాలను పంచుకుంది మ్యాడ్ డాక్ ఫిలిం సంస్థ. 'శక్తి షాలిని' పేరుతో తెరకెక్కుతున్న ఆ చిత్రంలో అనీత్ పడ్డా లీడ్ రోల్ చేయనుంది అంటూ తెలిపింది. అయితే థామా హిందీ వెర్షన్ లో ఈ సినిమా గురించి అనౌన్స్మెంట్ ఇవ్వడంతో అభిమానులు చాలా క్రేజీగా ఫీల్ అవుతున్నారు. రొమాంటిక్ చిత్రం సైయారాతో అందరి దృష్టిని ఆకట్టుకున్న అనీత్ పడ్డా ఇప్పుడు ఈ సినిమాలో హారర్ పాత్రలో కనిపించబోతుందని తెలిసి ఎక్సైట్మెంట్ కనబరుస్తున్నారు.

# శెట్టిబ్యూటీకి సక్సెస్ కలిసొచ్చిన వేళ!

కేజీఎఫ్ తో పాన్ ఇండియా సక్సెస్ అందుకున్నా కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టికి పెద్దగా అవకాశాలు రాని మాట వాస్తవం. కేజీఎఫ్ మొదటి భాగం రిలీజ్ అనంతరం మళ్లీ నాలుగేళ్ల గ్యాప్ అనంతరం కేజీఎఫ్ 2, కోబ్రాలో నటించింది. ఆ తర్వాత మళ్లీ మరో అవకాశం రావడానికి ఏకంగా మూడేళ్లు సమయం పట్టింది. అదీ కన్నడలో కాదు. ఆ అవకాశం కూడా తెలుగులో వచ్చింది. అదే రీసెంట్ రిలీజ్ హిట్ 3. నాని హీరోగా నటించిన సినిమాలో శ్రీనిధి శెట్టి సరైన పాత్ర పోషించి బాగానే ఫేమస్ అయింది. సినిమా విజయం అమ్మడికి కలిసొచ్చింది. గ్లామర్ కు తావు లేకుండా డీసెంట్ రోల్ పోషించి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తాను అందాలు ఎరగా వేసి నటించే దాన్ని కాదు.. పెర్ఫార్మర్ మాత్రమేనని ప్రూవ్ చేసింది.

**టాలీవుడ్ లో మంచి భవిష్యత్:** తనలో ఆ ట్యాలెంట్ నేడు కొత్త అవకాశాలకు దారి తీసింది. ఇటీవలే రిలీజ్ అయిన తెలుసు కదాలో కూడా నటించిన సంగతి తెలిసిందే. ఈ సినిమా రిలీజ్ కు ముందే వెంకటేష్-త్రివిక్రమ్ సినిమాలో ఛాన్సు అందుకుందనే ప్రచారం జరిగింది. మొన్నటి వరకూ అది ప్రచారమే అయినా నేడు అదే నిజమైంది. సినిమాలో వెంకీకి జోడీగా శ్రీనిధి ఫైనల్ అయింది. ఈ



నేపథ్యంలో శ్రీనిధి శెట్టికి ఇంకా మంచి భవిష్యత్ ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతిభతో పాటు గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండటం వంటి కొన్ని లక్షణాలు మిగతా బ్యూటీల నుంచి వేరు చేస్తున్నాయి. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు మాత్రం ఎంచుకుంటూ ముందుకు సాగుతుంది.

**గ్లామర్ పాత్రలకు దూరంగా:** గ్లామర్ గేట్లు ఎత్తేస్తానంటే? అవకాశాలివ్వడానికి చాలా మంది సిద్ధంగా ఉంటారు. కానీ ఆ ఛాన్స్ ఇవ్వకుండా శ్రీనిధి వచ్చిన అవకాశాలతో సంతృప్తి చెందుతుంది. అందులో ది బెస్ట్ సెలక్ట్ చేసుకుంటుంది. అమ్మడు డిజైనర్ దుస్తులకు కూడా దూరంగా ఉంటుంది. సింపుల్ డిజైన్స్ లో ముస్తాబవుతుంది. అందాల ఆరబోతకు ఎంత మాత్రం ఛాన్స్ ఇవ్వదు. సినిమా ప్రచార కార్యక్రమాల్లోనూ పద్ధతైన దుస్తులు ధరించి కనిపిస్తుంది. అవన్నీ శ్రీనిధికి తెలుగులో ఓ రకంగా కలిసొచ్చేవే అయినా? మరో రకంగా కొన్ని రకాల ఛాన్సులు కోల్పోయే అవకాశం లేకపోలేదు. ఈ బ్యూటీ తీరు చూస్తుంటే?

**ఆ బ్యూటీ జర్నీలా శ్రీనిధి:** సాయి పల్లవి విధానంలో కనిపిస్తోంది. సాయి పల్లవి ప్రయాణం ఎలా సాగిందన్నది చెప్పాల్సిన పనిలేదు. కెరీర్ ఆరంభం నుంచి గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటూ కేవలం నటనకు ఆస్కారం ఉన్న సినిమాలు మాత్రమే చేసు కుంటూ వచ్చింది. మధ్యలో పారితోషికం ఆఫర్లు ఎన్ని వచ్చినా? నో ఛాన్స్ అంటూ గీసుకున్న గీత దాట లేదు. తక్కువ పారితోషికం అయినా? నచ్చిన పాత్రలే చేస్తానంటూ ముందుకు సాగుతుంది. తనలో ఆ క్వాలిటీనే బాలీవుడ్ లో రామాయణం వరకూ దారి తీసింది. రామాయణంలో అమ్మడు సీత పాత్ర పోషిస్తోన్న సంగతి తెలిసిందే. శ్రీనిధి శెట్టి ప్రయాణం కూడా అలాగే సాగుతుందా? అన్నది చూడాలి.

# పెద్ది వర్సెస్ ప్యారడైజ్.. ఎవరు తగ్గట్లేదంతే..!






సంక్రాంతి, దసరా మాత్రమే కాదు సమ్మర్ కి ముందు అంటే మార్చి ఎండింగ్ కూడా సినిమాలకు కలిసి వచ్చే సీజన్ లా భావిస్తున్నారు మేకర్స్. ఎందుకంటే మార్చిలో కొంతమంది స్టూడెంట్స్ కి ఎలాగు ఎగ్జామ్స్ పూర్తవుతాయి. ఆ తర్వాత ఏప్రిల్ లో ఎలాగు సమ్మర్ హాలీడేస్ ఇస్తారు. అందుకే ఆ సీజన్ లో సినిమాలు రిలీజ్ అయితే మంచి సక్సెస్ అయ్యే ఛాన్స్ లు ఉంటాయని దర్శక నిర్మాతలు అలా ఫిక్స్ అయ్యారు. ఐతే ఈసారి అదే నెక్స్ట్ ఇయర్ 2026 మార్చి ఎండింగ్ కి రెండు సినిమాలు ఫైట్ జరగబోతున్నాయి. అందులో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పెద్ది ఒకటి రేసులో వస్తుండగా న్యాచురల్ స్టార్ నాని ది ప్యారడైజ్ కూడా వస్తుంది.

**రెండు సినిమాలు రెండు డిఫరెంట్ జోనర్..** మార్చి 26న నాని ది ప్యారడైజ్ వస్తుంటే.. ఒకరోజు తర్వాత మార్చి 27న పెద్ది రిలీజ్ డేట్ ఫిక్స్ చేశారు. ఐతే ఆరోజు చరణ్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ అనుకున్నారు. ఐతే మళ్లీ రిలీజ్ డేట్ ఒకరోజు ముందు అంటే మార్చి 26నే ఫిక్స్ చేస్తున్నారని టాక్. ఐతే ఈ రెండు సినిమాలు రెండు డిఫరెంట్ జోనర్ సినిమాలుగా వస్తున్నాయి. నాని శ్రీకాంత్ ఓదెల కంప్లీట్ గా వాళ్ల సేఫ్ జోన్ వదిలి భారీ ప్రయోగాన్నే చేస్తున్నారు. ది ప్యారడైజ్ లో జడల్ రోల్ లో నాని కనిపించబోతున్నాడు. ఈ రోల్ తో నాని మరోసారి తన సత్తా చాటుతాడని అంటున్నారు. ఐతే ఈ సినిమా కాన్సెప్ట్ ఇంకా స్క్రీన్ ప్లే అంతా కూడా నాని సత్తానికి చాటుతాయని అంటున్నారు. పెద్ది విషయంలో బుచ్చి బాబు చరణ్ కూడా అంతే కాన్ ఫిడెంట్ గా ఉన్నారు. సినిమాలో చరణ్ లుక్ ఇంకా స్టోరీ అంతా కూడా వేరే లెవెల్ లో ఉంటాయట. తప్పకుండా మెగా ఫ్యాన్స్ కి ఒక రేంజ్ లో మాస్ ఫీస్ట్ ఇచ్చేలా పెద్ది వస్తుంది.

**పెద్ది సినిమాలో శివ రాజ్ కుమార్.. ప్యారడైజ్ లో మోహన్ బాబు..** పెద్ది సినిమాలో శివ రాజ్ కుమార్ స్పెషల్ ఎట్రాక్షన్ కానున్నారు. అలానే నాని ది ప్యారడైజ్ లో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు విలన్ గా నటిస్తున్నారు. పెద్ది, ది ప్యారడైజ్ ప్రస్తుతం రేసులో రెండు సినిమాలు ఉన్నాయి. ఈ సినిమాల ఫైట్ మాత్రం ఇంట్రెస్టింగ్ గా ఉండబోతుంది. రెండు సినిమాలు ఎక్కడ ఏమాత్రం తగ్గకుండా తెరకెక్కిస్తున్నారు. చరణ్ తో నాని పోటీ అనేదాని కన్నా రెండు సినిమాలు తెలుగు ఆడియన్స్ కు మరో సరికొత్త సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించే ఛాన్స్ ఉంటుందని చెప్పొచ్చు.

ఇక్కడ మరో విశేషం ఏంటంటే ది ప్యారడైజ్ డైరెక్టర్ శ్రీకాంత్ కూడా తొలి సినిమా దసరాతో బ్లాక్ బస్టర్ కొట్టాడు.. బుచ్చి బాబు కూడా ఉప్పెనతో సెన్సేషనల్ హిట్ కొట్టి రెండో సినిమా పెద్ది చేస్తున్నాడు. డైరెక్టర్స్ కూడా తమ రెండో సినిమా ది బెస్ట్ అనిపించుకునేలా చేయాలని ఎఫర్ట్స్ పెడుతున్నారు.

# ఆ రెస్టారెంట్ ఆదాయం విని షాకయ్యా!



సెలబ్రిటీలు ఎంతో తెలివిగా పెట్టుబడులు పెడుతుంటారు. అందులోనూ బాలీవుడ్ తారలు తాము సంపాదించిన దాన్ని, ఎంతో ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుని దాన్ని ఇన్వెస్ట్ చేస్తూ ఉంటారు. బాలీవుడ్ నటి శిల్పా శెట్టి కూడా అలానే చేశారు.

శిల్పా శెట్టి, ఆమె భర్త రాజ్ కుంద్రా ముంబైలో బాస్టియన్ అనే రెస్టారెంట్ ను మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. సినిమాల్లో బిజీగా ఉన్నప్పుడే శిల్పా బిజినెస్ లోకి అడుగుపెట్టి, బాస్టియన్ రెస్టారెంట్ ను ప్రారంభించారు. ఆ తర్వాత బాస్టియన్ ను మరింత విస్తరిస్తూ పలు బ్రాంచ్ లను కూడా స్టార్ట్ చేసి సక్సెస్‌ఫుల్ బిజినెస్ గా కొనసాగిస్తున్నారు. ముంబైలో ఉన్న ఈ బాస్టియన్ రెస్టారెంట్ ఎంతో ఫేమస్. ఆ రెస్టారెంట్ ఎంత ఫేమస్ అంటే పలువురు ప్రముఖులు కూడా దాని ఆదాయం చూసి ఆశ్చర్యపోయేంత.

**ఆ రెస్టారెంట్ ఆదాయం రోజుకు రూ.2 కోట్లు...** రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో ప్రముఖ రచయిత్రి శోభా డే, బాస్టియన్ రెస్టారెంట్ గురించి కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించారు. ముంబైలోని కొన్ని అంశాలు తనను ఆశ్చర్యపరుస్తాయని చెప్పిన శోభా, బాస్టియన్ రెస్టారెంట్ లోకి అడుగుపెడితే ఎలా ఉంటుందో ఆమె తెలిపారు. బాస్టియన్ రెస్టారెంట్‌కు మామూలు రోజుల్లో రూ.2 కోట్లు, వీకెండ్స్ లో రూ.3 కోట్ల ఆదాయం వస్తుందని చెప్పారు.

**అదంతా నమ్మలేకపోయా...** మొదట్లో ఈ వార్తలు నిజం కాదనుకున్నానని, కానీ తర్వాత వాటి గురించి తెలిసిందని, ఆ రెస్టారెంట్ లోపలికి వెళ్లి చూడగానే తాను షాకయ్యానని, అందులో దాదాపు 1400 మంది గెస్టులు స్టే చేయొచ్చని, ఒకేసారి 700 మంది భోజనం చేసేలా రెండు పెద్ద పెద్ద హాల్స్ ఉన్నాయని, అంతమందని అక్కడ చూసి తాను చూస్తున్నది నిజమేనా అని నమ్మలేకపోయినట్టు శోభా తెలిపారు. అంతటి స్టార్ హొటల్ కు సంబంధించిన బాంద్రా బ్రాంచ్ ను క్లోజ్ చేస్తున్నట్టు శిల్పా రీసెంట్ గా అనౌన్స్ చేశారు.

అయితే అదే రెస్టారెంట్‌ను జుహూ లో బాస్టియన్ బీచ్ క్లబ్ పేరుతో ప్రారంభించనున్నామని, ఎన్ని బ్రాంచ్ లు ఓపెన్ చేసినా బాంద్రాలోని రెస్టారెంటే అన్నింటికీ మూలమని, ఆ రెస్టారెంట్ ఎప్పటికీ తమకు స్పెషలేనని శిల్పా చెప్పారు.

# సీతమ్మ ఇలా స్లో అయితే ఎలా?

బాలీవుడ్ నటి అలియాభట్ సినిమాలు చేయడంలో స్పీడ్ తగ్గించిందా? పెళ్లికి ముందులా పెళ్లి తర్వాత పని చేయడం లేదా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. 2012 లో అమ్మడు స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ తో కెరీర్ మొదలు పెట్టింది. అప్పటి నుంచి 2022 వరకూ ఒకే వేగంతో సినిమాలు చేసింది. ఆ వేగానికి తగ్గట్టే సక్సస్లు పడ్డాయి. 20-25 సినిమాల వరకూ ఒకే జోరుతో పని చేసింది. కానీ వివాహం అనంతరం అమ్మడు వేగం పూర్తిగా తగ్గించేసింది. 2022-25 మధ్య చూసుకుంటే కేవలం మూడు నాలుగు సినిమాలు మాత్రమే కనిపిస్తున్నాయి. 2022 లో ఒకే ఏడాది నాలుగు సినిమాలతో ప్రేక్షకుల మధ్యలో ఉంది. అదే ఏడాది అమ్మడికి రణబీర్ కపూర్ తో వివాహమైంది. అప్పటి నుంచి ఏడాదికి ఒక సినిమా మాత్రమే రిలీజ్ లో ఉండేలా ప్లాన్ చేసుకుని ముందుకు సాగుతుంది. 2023 లో రాకీ ఔర్ రానీకి ప్రేమ్ కహానీ, హాలీవుడ్ చిత్రం హార్ట్ ఆఫ్ స్టోన్ తో ప్రేక్షకుల్లో ఉంది. అటుపై 2024 లో జిగ్రా తో అలరించింది. 2025



లో మాత్రం ఆల్ఫాతో అలరించడానికి రెడీ అవుతుంది. మరి అలియాలో వేగం తగ్గడానికి అసలు కారణం ఏంటి? అంటే సినిమాలు- ఫ్యామిలీ లైఫ్ ని బ్యాలెన్స్ చేసే క్రమంలోనే కొత్త ప్రాజెక్ట్ లు కమిట్ అవ్వడంలో ఆచితూచి వ్యవహరిస్తుంది. అవకాశాలు క్యూలో ఉన్నా అలియా మాత్రం సెలక్టివ్ గా వెళ్తుంది. పెళ్లికి ముందులా కాకుండా డిఫరెంట్ కాన్సెప్ట్ లు ..పక్కాగా హిట్ అవుతాయి? అన్న కథలవైపే అడుగులు వేస్తోంది. ఏడాదికి ఒక సినిమా రిలీజ్ కు ఉండేలా చూసుకుంటుంది. ఆల్ఫా డిసెంబర్ లో రిలీజ్ కు రెడీ అవుతుంది. భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతున్న చిత్రమిది. అలియా ప్రధాన పాత్రలో తెరకెక్కిన స్పై థ్రిల్లర్ ఇది. యశ్ రాజ్ ఫిలింస్ తొలిసారి ఓ లేడీతో స్పై సినిమా చేయడం విశేషం. ఈ సినిమా అనంతరం 2026లో అమ్మడు లవ్ అండ్ వార్ తో ప్రేక్షకుల ముందుకు రానుంది. అటు పై ఏ సినిమాలు చేస్తుంది? అన్నది లవ్ అండ్ వార్ చిత్రీకరణ ముగింపు దశకు వచ్చే వరకూ గానీ క్లారిటీ రాదు. అయితే అలియా భట్ ఇలా నెమ్మదిగా సినిమాలు చేయడంపై ఆమె అభిమానులు సోషల్ మీడియా వేదికగా అంసతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. మునుపటిలా సినిమాలు చేయాలంటూ రిక్వెస్ట్ చేస్తున్నారు. మరి ఈ అభ్య ర్థనలను అలియాభట్ ఎలా తీసుకుంటుందో చూడాలి.

# రకుల్ మళ్లీ టాలీవుడ్ ప్రయత్నాలా?

రకుల్ ప్రీత్ సింగ్ టాలీవుడ్ కి దూరమై నాలుగేళ్లు అవుతుంది. కొండపొలం తర్వాత అమ్మడు పూర్తిగా బాలీవుడ్ కే పరిమితమైంది. అక్కడ అవకాశాలతోనే నటిగా బిజీ అయింది. కానీ సక్సస్ లు మాత్రం చెంత చేరలేదు. అవకాశా లైతే ఓడిసి పట్టుకుంటుంది గానీ? విజయాలు మాత్రం ఎక్కడా కనిపించలేదు. నాలుగేళ్లలో ఎనిమిది ..తొమ్మిది హిందీ సినిమాలు చేసింది. వాటిలో సక్సస్ భూతద్దం పెట్టి వెతికినా ఎక్కడా కనిపించదు. అయినా అవకాశాలు మాత్రం ఎక్కడా తగ్గలేదు. ప్రస్తుతం లైనప్ లో రెండు..మూడు సినిమాలున్నాయి. వాటిపై ఎలాంటి బజ్ కూడా లేదు.

**అప్పుడలా నిరాశతో నోరు జారి:** మరి ఇలాంటి ఫేజ్ లో ఉన్న రకుల్ మళ్లీ టాలీవుడ్ ప్రయత్నాలు మొదలు పెట్టిందా? అంటే అవుననే తెలుస్తోంది. అమ్మడు గత పరిచయస్తులకు మళ్లీ టచ్ లో కి వెళుందిట. పాత మేనేజర్ ని మళ్లీ రంగంలోకి దించి దర్శక, నిర్మాతలకు టచ్ లో ఉండే ప్రయత్నం చేస్తుందిట. అలాగే రామ్ చరణ్-ఉపాసన



దంపతులకు రకుల్ మంచి స్నేహితురాలు అన్న సంగతి తెలిసిందే. అటువైపు నుంచి కూడా అమ్మడు చేయాల్సిన ప్రయత్నాలు చేస్తోందిట. మరి కంబ్యాక్ ఛాన్స్ ఎవరైనా ఇస్తారా? లేదా? అన్నది చూడాలి. వాస్తవానికి రకుల్ టాలీవుడ్ లో అవకాశాలు వస్తోన్న సమయంలోనే వదిలి బాలీవుడ్ కి వెళ్లింది. పాన్ ఇండియా సినిమాల్లో ఛాన్సులు రాలేదు? అన్న నిరాశ కూడా రకుల్ లో ఉంది.

**పూజాహెగ్డే కంటే పవర్ ఫుల్ గా విసిరిందే:** ఓ సందర్భంలో టాలీవుడ్ పై అసహనాన్ని కూడా వ్యక్తం చేసింది. కొందరికే పాన్ ఇండియా చిత్రాల్లో అవకాశాలు ఇస్తున్నారని..ఎంతో కాలంగా పరిశ్రమలో తన లాంటి సీనియర్లను పట్టించుకోలేదనే ఆవేదన వ్యక్తం చేసింది. ఆ విమర్శల్ని టాలీవుడ్ సీరియస్ గా తీసుకుంటే మాత్రం కంబ్యాక్ కష్టమే. పూజాహెగ్డే కూడా టాలీవుడ్ అవకాశాల్ని కాదని బాలీవుడ్ కి వెళ్లింది. అటుపై అంతే వేగంగా సౌత్ లో మళ్లీ అవకాశాలు కోసం ప్రయత్నించింది. లక్కీగా కోలీవుడ్ ఆదుకోవడంతో? కంబ్యాక్ అవ్వగలిగింది. కానీ టాలీవుడ్ మాత్రం పూజకు అవకాశాలివ్వడం లేదు.

**ప్రయత్నాలు ఫలించక:** ప్రయత్నాలు చేస్తున్నా? అవి అక్కడికే పరిమితమవుతున్నాయి తప్ప కన్సిడర్ చేసే పరిస్థితి కనిపించలేదు. మరి పూజాహెగ్డే కంటే రెండు ఆకులు ఎక్కువే విసిరిన రకుల్ కి టాలీవుడ్ అవకాశాలు ఇస్తుందా? లేదా? అన్నది చూడాలి.

ప్రస్తుతం రకుల్ హిందీలో దే దే ప్యార్ దే 2 లో నటిస్తోంది. దీంతో పాటు పతీ పత్నీ ఔర్ హూ దూ చిత్రంలోనూ నటిస్తోంది. ఇందులో దే దే ప్యార్ దే 2 వచ్చే నెలలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536